నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

మార్చి 1959

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం
గాంధీనగరం * విజయవాడ-2

విషయసూచిక

చిత్రములు



నాగార్జున

*

చిత్రశిల్పి:

శ్రీ అంకాల వేంకటసుబ్బారావు

*



కాటుక

*

చిత్రశిల్పి :

శ్రీ కల్యాణ్ ప్రసాద్ శర్మ

*

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 1 | విజయవాడ * మార్చి 1959 | సంచిక 8

సత్యసందేశం

మహాత్మ గాంధీ

సత్యమంటే ఏమిటి ? క్లిష్టమైన సమస్యే కాని నీ అంతర్వాణి చెప్పేదేమిటో అదే సత్యమని నావరకు నేను సమాధాన పడ్డాను అయితే, వివిధ వ్యక్తులు వివిధ విరుద్ధ సత్యాలను గూర్చి ఆలోచిస్తున్నారు గదా - అని మీరు అడుగుతారు మంచిదే మానవ మేధస్సు బహుధా ప్రవృత్తి కలది కావటంవల్లా, మానవ మేధస్సు సర్వే సర్వత్రా ఏకవిధంగా పరిణద్ధం కాకపోవటంవల్లా, ఒకరికి సత్యమైనది మరొకరికి అసత్యం కావచ్చు కనుక ఈ విషయంలో శోధనలు చేసినవారు, ఇట్టి శోధనలు చేయటంలో కొన్ని విధి నిషేధాలను పాటించవలెననే నిశ్చయానికి వచ్చారు... ఎలాంటి శిక్షణకూ లోబడకుండానే ఈనాడు ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మను గురించి మాట్లాడుతున్నారు కాబట్టి ఈ అయోమయ ప్రపంచంలో కావలసినంత అసత్యానికి అవకాశం ఉంది. వినయపూర్వకంగా నేను తమకు మనవి చేసుకోగలది ఏమంటే, పూర్తి వినయభావం లేనిదే ఎవడుగానీ సత్యాన్ని గ్రహింపజాలడని. సత్యమనే సముద్ర గర్భంలో ఈదవలెనంటే మనం కేవలం నిరహంకారులం కావాలి

నా దృష్టిలో అసంఖ్యాకములైన ఇతర సూత్రాలతో కూడిన ఏకైక ప్రధాన సూత్రమే సత్యం సత్యం అంటే మామూలు ప్రపంచంలో నిజాయితీకాదు, ఆలోచనలో నిజాయితీకూడా, మన భావనలోని సాపేక్ష సత్యంకూడా కాదు, కేవలమైన సత్యం, శాశ్వతమైన సూత్రం, అదే దైవం భగవంతుని లీలలు అనంతం కావటంవల్ల భగవంతుణ్ని గూర్చి నిర్వచనాలుకూడా అసంఖ్యాకంగా ఉంటాయి. అవి నన్ను ఒక్క క్షణం భయవిభ్రమాలతో నిస్తబ్ధుణ్ని చేస్తాయి కాని నేను భగవంతుణ్ని సత్యం రూపంలో పూజిస్తాను. నేను ఆ దైవాన్ని ఇంకా కనుగొనలేదు ఆ దైవం కోసమే వెదకుతున్నాను ఈ పరిశోధనా మార్గంలో నేను నాకు అత్యంత ప్రియ వస్తువులను సైతం త్యజించటానికి సిద్ధంగా ఉన్నాను. అందుకు నా జీవితాన్నే త్యాగం చేయవలసివచ్చినా, నేను సిద్ధం గాగలననే అనుకొంటాను కాని నేను ఆ సత్యాన్ని సందర్శించే పర్యంతం, నా భావన కనుగుణంగా సాపేక్ష సత్యాన్నిబట్టి మాత్రమే ప్రవర్తించవలసివస్తుంటుంది అందాకా, ఈ సాపేక్ష సత్యమే నా జ్ఞానజ్యోతిగానూ, అంగరక్షగానూ ఉంటుంది ఇది చక్కనైన ఇరుకుత్రోవ, అసిధారలాగా పదునైనది. అయినప్పటికీ అదే నాకు అతి సుగమమూ సత్వరమూ అయినమార్గం.

నేను ఖచ్చితంగా ఈ మార్గాన్ని అనుసరించటంవల్ల నేను చేసిన పెద్ద పెద్ద తప్పిదాలు కూడా నాదృష్టిలో అంత లెక్కలోవి కావు నా వరకు నన్ను ఈ మార్గం దుఃఖానికి దూరంగా ఉంచింది నా కాంతిపథంలో నేను పురోగమించాను ఈ పురోగమన మార్గంలో పరమసత్య రూపుడైన భగవంతుణ్ని తరచు నేను లీలగా చూశాను. ఆతడుమాత్రమే సత్యమనీ తక్కినవన్నీ అసత్యమనీ అన్న విశ్వాసం నాలో నానాటికీ పెంపొందుతున్నది అంతేకాక నాకు ఏది సాధ్యమో అది పసిపిల్లవాడికికూడా సుసాధ్యమే అనే విశ్వాసం కూడా నాలో పెంపొందుతున్నది. ఇలా చెప్పటానికి నాకు పూర్తికారణం ఉంది సత్యాన్వేషణ సాధనాలు ఎంత కష్టమైనవో, అంత సుకరమైనవి అహంకార బుద్ధికి అవి కేవలం అసాధ్యాలుగా కన్పించవచ్చు, కాని ఒక అమాయకుడైన పసిబిడ్డకు అతి సుసాధ్యాలుగా కన్పిస్తాయి సత్యాన్వేషి ధూళికంటె వినతుడై వుండాలి ప్రపంచమంతా ధూళిని తన కాళ్ళక్రింద త్రొక్కివేస్తుంది, సత్యాన్వేషి ఆ ధూళిచేతకూడా త్రొక్కించుకోవటానికి సిద్ధంగా వుండాలి అప్పుడు మాత్రమే అతనికి సత్యసందర్శనం కలుగుతుంది, అందాకా కాదు.

నావంటివాళ్ళు, వందలమంది, నశించిపోనీ! సత్యాన్నిమాత్రం వర్ధిల్లనీ ! నాలాంటి దోషగాషితులైన మర్త్యమాత్రులకోసం సత్యాన్ని వెంట్రుకవాసి కూడా తప్పిపోనీయవద్దు

నన్ను నేను విమర్శించుకొనేటప్పుడు, సత్యమెంత నిష్ఠురమైనదో, అంత నిష్ఠురంగా ఉండటానికి ప్రయత్నిస్తాను అలాగే ఇతరులుకూడా ఉండాలని నా కోరిక నా అంతరం నేను తెలుసుకొనేటప్పుడు నేను సూరదాసుతో ఏకీభవిస్తాను "నాకంటె దుష్టుడూ పాపిష్ఠి ఎక్కడున్నాడు ? నా జన్మదాతను నేను విస్మరించాను. అంత విశ్వాస ఘాతుకుణ్ని నేను !" అన్నాడు సూరదాసు.

నా ప్రతినిశ్వాసాన్ని పరిపాలించే ఆ ప్రభువుకు, నా జన్మదాత అయిన ఆ ప్రభువుకు నేను ఇంతదూరంగా ఉన్నాననేదే నా నిరంతర సంతాపం నాలోఉన్న దురావేశాలే నన్ను భగవంతునకు దూరం చేస్తున్నాయని నాకు తెలుసు కాని నేను వాటిని విడువలేకుండా ఉన్నాను

కుమ్మరివాని చేతిలోని మట్టిముద్దకంటె నేను మరేమీ కాను సత్యము ప్రేమ-అహింస-అనేది మాత్రమే నిలిచేది ఇది ఎక్కడఉంటే అక్కడ-ప్రతిదీ పర్యవసానంలో సుసంస్కృతమే అవుతుంది ఇది అపవాదలేని సూత్రం.

సత్యంకంటె దైవం లేదని నా సార్వత్రికమైన అనుభవం నాకు నచ్చజెపుతున్నది నాకు మసక మసకగా లీలగా అప్పుడప్పుడు కలిగిన సత్యసందర్శనంవల్ల ఆ సత్యంయొక్క అనంత కాంతిని నేను ఊహించలేకుండా వున్నాను. అది మనం ప్రతినిత్యం చూసే సూర్యకాంతికంటె కోట్లరెట్లు గొప్పది. ఆ మహాతేజఃపుంజంలో ఒకానొక మసకబారిన కిరణాన్ని మాత్రమే నేను చూశాను. కాని నా పరిశోధన

లన్నింటి ఫలితంగా నేనొక్కటిమాత్రం చెప్పగలను-అహింసాసిద్ధి పొందనిదే సంపూర్ణమైన సత్యసందర్శనం కలుగజాలదని

విశ్వరూపమైన సర్వసమన్వితమైన సత్యస్వభావాన్ని కనుగొనవలెనంటే, సృష్టిలో అత్యంత అల్పజీవిని సైతం తన్నుదాను ప్రేమించుకొన్నట్లుగా, ప్రేమించ గలిగి వుండాలి తత్సందర్శనం కోరేవాడు ఎవ్వడూ జీవితంలోని ఏ రంగానికీ దూరంగా ఉండలేడు. అందువల్ల నే, సత్యమునందలి నాభక్తి నన్ను రాజకీయ రంగంలోకి దించింది మతానికి రాజకీయాలతో సంబంధం లేదనేవారికి మతమంటే ఏమిటో తెలియదని నేను వినయంతోనే నిశ్శంకగా చెప్పగలను.

సంపూర్ణమైన సత్యం కనుగొనటం మానవసాధ్యం కాదు తాను చూచిన విధంగా సత్యాన్ని అనుసరించి జీవించటం, అందుకుగాను అతి పవిత్రమైన అహింసా మార్గాన్ని అనుసరించటం మానవుని విధి

సత్యం ప్రతిమానవుని హృదయంలోనూ వుంది. ప్రతివాడూ సత్యాన్ని తన హృదయంలోనే అన్వేషించాలి, తనకు తోచిన విధంగా సత్యమార్గాన ప్రవర్తించాలి, కాని ఎవ్వడుగానీ తనకు సత్యమని తోచినవిధంగా ఇతరులు నడువవలెనని నిర్బంధించే అధికారం లేదు.

జీవితం ఒకసాధన. సంపూర్ణత్వంకోసం-అంటే ఆత్మవిజ్ఞానంకోసం కృషి చేయటమే జీవితాదర్శం మన దౌర్బల్యాలవల్లా, అశక్తతలవల్లా, ఆ ఆదర్శం కుంచింపబడగూడదు నా లోటుపాట్లు నాకు తెలుసు అదే నాబాధ. నాలోని దౌర్బల్యాలనూ అశక్తతలనూ తొలగించవలసిందిగా నేను ప్రతినిత్యమూ ఆ సత్యాన్ని నిశ్శబ్దంగా ప్రార్థిస్తుంటాను

నే నుద్దేశించని విషయాలను చెప్పిన పాపం ఎన్నడూ నేను చేయలేదు. హృదయానికి సూటిగా చెప్పటమే నా స్వభావం ఒకప్పుడు అలా చెప్పలేకపోయినా, తరచూ నా అనుభవాన్నిబట్టి, సత్యం తనంతట తానే వినబడుతుందనీ, అనుభూతం కాగలదనీ నాకు తెలుసు

నేను వినతుణ్నే, కాని నిరంతర సత్యాన్వేషిని. నా తప్పులను నేను తెలిసికొని దిద్దుకొనేటందుకు, నావంటి సత్యాన్వేషకుల నందరినీ నా అన్వేషణలో ఆత్మీయులుగా స్వీకరిస్తాను నా ఆలోచనలలోను నిశ్చయాలలోను నేను చాలా తప్పులు చేశానని ఒప్పుకొంటాను. అయితే అలాంటి ప్రతిసారీ నాతప్పు నేను దిద్దుకొన్నాను అందువల్ల శాశ్వతమైన హానిఏమీ జరుగలేదు. అంతేకాక అహింసయొక్క మూల సత్యం పూర్వంకంటె మరింత ప్రస్ఫుటమైంది దేశానికేమీ దెబ్బతగులలేదు.

నేను జ్ఞానాన్వేషిని. నా కెవరిమీద విరోధంలేదు నేను ఎక్కడ సత్యాన్ని చూసినా, దాన్ని స్వీకరించి, దానిప్రకారం నడుచుకోటానికి ప్రయత్నిస్తాను

ఎంత మంచి ఉద్దేశ్యా లున్నప్పటికీ మానవుడు అప్పుడప్పుడు తప్పుదారిన పడి నట్లయితే, దానివల్ల ప్రపంచానికిగానీ, ఆ మాటకువస్తే, ఏ వ్యక్తికిగానీ నిజంగా ఏమీ హాని కలుగదు దైవభీతి గలిగి, తెలియక తప్పుచేసిన వారిని ఎల్లప్పుడూ దేవుడే రక్షిస్తాడు నా ఆదర్శాన్ని అనుసరించి నడిచినవారు కూడా, నా నడవడి ఏమో తెలిసికోకున్నప్పటికీ, అగమ్యమార్గాన నడిపిస్తుంటారు ఒక్కొక్కప్పుడు ఇతరుల ఆదర్శం తనకు మార్గదర్శకంగా కన్పించినప్పటికీ, మానవుడు తన ఆంతర ప్రబోధాన్ని బట్టి మాత్రమే ప్రవర్తిస్తాడు ఏది ఏమైనా, నేనుచేసిన తప్పులన్నీ నా అజ్ఞానంవల్ల చేసినవే కాబట్టి, వాటివల్ల ప్రపంచం బాధపడవలసిన అవసరం ఏమీఉండదు నేనుచేసిన తప్పు లేవీ బుద్ధిపూర్వకంగా చేసినవి కావని నా దృఢ విశ్వాసం

నిజానికి-ఒకడికి తప్పని స్పష్టంగాతోచే ఒకవిషయం మరొకడికి పరమ విజ్ఞా నంగా కన్పించవచ్చు అతడు ఒకవేళ కేవలం భ్రాంతిలోనే ఉన్నప్పటికీ చేయగలి గింది లేదు

"ముత్యంలో వెండిగానీ, సూర్యకాంతిలో నీరుగానీ లేనప్పటికీ మెరిసే ముత్యంలో వెండి తళుకూ, సూర్యకిరణంలో జలచ్ఛాయా భాసిస్తాయి ఈ భ్రాంతి నుండి మానవుణ్ని ఏ భౌతికశక్తీ కాపాడలేదు" అని తులసీదాసు చెప్పినాడు. ఒకా నొక మహాభ్రాంతితో పనిచేస్తున్న నావంటివాళ్ళ విషయంలో కూడా ఇది నిజం కావచ్చు అటువంటివాళ్ళను దేవుడు తప్పక క్షమిస్తాడు ప్రపంచంకూడా సహిస్తుంది చిట్టచివరకు సత్యం తనంతటతానే ప్రస్ఫుట మవుతుంది

సత్యంకంటె మతం లేదని నా నమ్మకం కాబట్టీ, సత్యాన్ని వదలి సాధించ గల స్వర్గాన్ని సైతం నేను తృణీకరించగలను కాబట్టీ, నా వ్రాతలలో అసత్యానికి స్థానం ఉండజాలదు ఈ ప్రపంచాన్ని నిలబెడుతున్నది ప్రేమఅని నా విశ్వాసం కనుక నా వ్రాతలలో ఏ వ్యక్తిపైనిగానీ ద్వేషం ఉండటానికి వీలులేదు ప్రేమ ఎక్కడ ఉన్నదో జీవితం అక్కడేస్తుంది ప్రేమలేని బ్రతుకు చావుతో సమానం ఒక నాణెంలో ఒకప్రక్క ప్రేమ ముద్రితమైవుంటే, ఆ రెండవ ప్రక్కది సత్యం, మనం సత్యంతోనూ ప్రేమతోనూ ఈ యావత్ప్రపంచాన్నీ జయించగలమని నాకు గట్టి నమ్మకం ఉంది

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౪

ప్రకృతి

బుద్ధి మొదలు భూతతత్త్వముల వఱకును గల తత్త్వముల నన్నిఁటిని విడఁగొట్టి చూచితిమేని వాని యన్నిఁటియందును ప్రకాశము, క్రియ, స్థితి యను మూఁడుగుణములు కానిపించును (1) భూతములు గ్రాహ్యములు. దానఁజేసి యీ మూఁడు గుణములును వానియెడ ప్రకాశ్యముగను కార్యముగను ధార్యము గను అగును ఈ భూతములు శరీరముగా పరిణామము చెందినపుడుగూడ శరీర బోధాధిష్ఠానరూపమగు ప్రకాశగుణముతోడను శరీర కార్యాధిష్ఠానరూపమగు క్రియాగుణముతోడను శరీర ధారణాధిష్ఠానరూపమగు స్థితి గుణముతోడను కూడుకొనియుండును.

గ్రహణ తత్త్వమునకు లేక ఇంద్రియము లన్నిఁటికిని ఈ ప్రకాశ క్రియా స్థితులు, బోధ చేష్టా ధృతిరూపముగా నున్నవి. కరణములం దొక విధృతి భావము కలదు అది క్రియాశీలమయినంతనే జ్ఞానము కలుగును.

'నేను ఉన్నాను' అను నిట్టి బుద్ధిలో జ్ఞానాంశము ప్రకాశ గుణము. ఇది ప్రవాహరూపమై ఎపుడును ఉండునుగాన పరిణామ శీలము, కాన నిది క్రియాగుణము. స్థితిశీలత స్థితిగుణము. అహంకారాదులగు ఎల్ల కరణము లందును ఇటులే ప్రకాశ క్రియా స్థితులు పొడకట్టును.

కరణశక్తుల కన్నిఁటికిని పైనున్న అంతఃకరణమునం దీ ప్రకాశ క్రియా స్థితులే ప్రఖ్యా ప్రవృత్తి స్థితి రూపముగా నున్నవి (2). ప్రఖ్య యనిన జ్ఞానాదికము (3) ప్రవృత్తి యనిన చేష్టాదికము (4). స్థితి యనిన సంస్కారాదికము (5).

ఈ జ్ఞాన చేష్టా సంస్కారములను తఱచిచూచినచో 'నేను' అను నొక మూలజ్ఞానము దొరకఁగలదు. దానిచే మన శ్చిత్తముల సృష్టి (6) 'నేను' అను నీమూలజ్ఞానములో చేష్టా సంస్కారముల మూలబీజము లున్నవి 'నే నెఱుగుచున్నాను, నేను చేయుచున్నాను, నేను శరీరమును ధరించుచున్నాను' అని మనకు సతతానుభవము. ఈ 'నేనే' అహంకారము. అహంకార మన్ని ఎఱుకలకును కుదురు. అనఁగా మనశ్చిత్తములకు సాధారణోపాదానకారణము. కాఁగా

---

(1) 'ప్రకాశ క్రియా స్థితి శీలం భూతేంద్రియాత్మకం భోగాపవర్గార్థమ్ దృశ్యమ్,—యోగ—2—18

(2) "చిత్తం హి ప్రఖ్యా ప్రవృత్తి స్థితి శీలత్వా త్త్రిగుణమ్" (యో.భాష్య—1—2)

(3) "ప్రసాద లాఘవ ప్రీత్యాదులు." (చూ వాచ-1-2)

(4) "పరితాపశోకాదులు"—(చూ—,,)

(5) "గౌరవావరణదైన్యాదులు"—(చూ ,,)

(6) చేష్టా సంస్కారాంశముల పారిభాషికనామము మనస్సు వృత్తిరూపము చిత్తము.

ప్రమాణాదులగు నెల్లతెఱఁగుల జ్ఞానములును చేష్టా సంస్కారములును ఈ 'నేను'— వికారములు

అహంకార ధర్మ మభిమానము అభిమాన మన 'నేను' యొక్క వేఱు వేఱు రీతులు. 'నేను గొప్పవాఁడను, తెలివితేటలు గలవాఁడను ఈ మొదలగు విశిష్టాహంతాజ్ఞాన మభిమానము సంకీర్ణ మగు నిట్టి 'నేను' అను జ్ఞానమునకు మూలము అసంకీర్ణ మగు 'నేను' అను జ్ఞానము. దీనికి అస్మిత అని పేరు. దీనిని అస్మిమాత్ర మనియు అస్మీతిమాత్ర మనియు నందురు. ఇదియే వికృతమై నానా రూపమగు అహంకారముగా మాఱును. ఇది అభిమానముచే అసంకుచితము కావున అస్మిమాత్రము. ఇదియ మహత్తత్త్వము లేక 'మహాన్ ఆత్మా' ఇది ఎల్ల జ్ఞానములకును మూలముకావున దీనిని బుద్ధితత్త్వ మనియు (7) నందురు ఇది అసంకీర్ణమగు 'నేను' 'అస్మి' కావున 'మహాన్ ఆత్మా'. 'అభిమానమును పాఱఁ ద్రోలుచో శుద్ధుఁడ నగుదును' అను జ్ఞాన మందఱకును ఉండును దాని చొప్పున అభిమానత్యాగ మొనరించినచో మన కీ 'మహాన్ ఆత్మా' 'అస్మీతిమాత్రము' 'అస్మిత' అనుభవమునకు రాఁగలదు.

ఇట్టి అస్మిత మొదలుకొని భూతముల వఱకును ఉన్న తత్త్వము లన్నియు మనచే తెలియఁబడును. (ప్రకాశ), మఱియు ఇవి పరివర్తనము చెందును. అనఁగా సక్రియములగును, మఱియును ఆవరింపఁబడుటచే మనకు తెలియని అంశ మొకటి ఇందు ఉన్నదనియు మనకు తెలియవచ్చును. సమస్త ప్రకాశము లేక జ్ఞానము, అప్రకాశముచే లేక అజ్ఞానముచే పొదుగఁబడియున్నది సమస్తక్రియయు జడతచే పొదుగఁబడియున్నది కాన 'నేను' మొదలుకొని భూతపర్యంత మంతయు ప్రకాశ క్రియాస్థితులచే (జడత) నిర్మితము. కాన మహత్తత్త్వమొదలు పంచభూతముల వఱకును గల బాహ్యాంతరసమస్తజ్ఞేయపదార్థములకును ప్రకాశ క్రియాస్థితు లుపాదానకారణము

ఈ మూఁటిలో ప్రకాశశీలమగు భావమునకు సత్త్వ మనియును క్రియాశీల మగు భావమునకు రజస్సు అనియును స్థితి శీలమగు భావమునకు తమస్సు అని యును పేళ్లు వీనికి నిఁక మౌలిక విశ్లేషము దొరకదు. ఇవి మూలభావములే

---

(7) బుద్ధి యను పదమునకు తెలివి లేక జ్ఞానము అను అర్థమున సాధారణముగా దర్శనములుగూడ ఈ పదమును అనియతార్థములందు వాడెను కావున నిది అపుడపుడు చిక్కులు కలిగించును జ్ఞానము లన్నింటికిని మూలజ్ఞాన మేదియో అట్టి "నేను" అను జ్ఞానమే బుద్ధితత్త్వము జ్ఞానము లన్నియు బుద్ధి, బుద్ధివృత్తి, చిత్తవృత్తి, ఈ మొదలుగా పెక్కువిధముల గౌణముగా వాడఁబడును దీనికి కారణము లేకపోలేదు, ఏలనఁగా ఇవన్నియు బుద్ధితత్త్వచ్ఛాయలే మఱియు కర్తవ్య నిశ్చయము ఆత్మనిశ్చయము లందేకాక ఐంద్రియికజ్ఞానములందును దీనికి ప్రయోగము కలదుగాని ఇవి యేవియు బుద్ధికి స్వరూపలక్షణములు కావు అధ్యవసాయమనఁగా కర్తవ్యనిశ్చయ మని కొన్నిపట్ల ప్రయోగము కలదు మున్మొదటి వ్యక్తతత్త్వమగు బుద్ధి కిది లక్షణము కాదు ఈ బుద్ధి తత్త్వమునకు క్రిందనున్న అన్ని కరణములయు మిశ్రితకార్యము అధ్యవసాయము

కాన మఱి వీనికి మూలము లేదు (8) మూలము లేదు కాన నివి నిత్యములు మఱియు నివి అవినాభావులు. వీనికి ప్రకృతి యని పేరు సత్త్వరజస్తమస్సులు అను ఈమూఁటిని గుణము లని అందురు గుణము లన ద్రవ్యాశ్రితములగు ధర్మములు కావు. మఱి త్రాళ్లు అని అర్థము. ముప్పేటలు వైచిన త్రాటితో బంధనము చేయుదురు. అటులే సత్త్వరజస్తమస్సులు అను ముప్పేటత్రాటివంటి ప్రకృతిచే పురుషుఁడు బంధింపఁబడును గావున సత్త్వ రజస్తమస్సులకు గుణము లని పేరు.

సృష్టి అనంతము దానికి ఉపాదానకారణముగూడ అనంతమైతీరవలయును కావున అనంతమగు ప్రకాశము, అనంతమగు క్రియ, అనంతమగు జడతయు ఈ సృష్టికి ఉపాదానకారణము త్రిగుణస్వరూపమగు ఈ మూలోపాదానము పేరు ప్రధానము లేక ప్రకృతి అనంతమగు సత్త్వము, అనంతమగు రజస్సు, అనంతమగు తమస్సు, కలిసి ప్రకృతి అని ప్రకృతిని లక్షింపవచ్చును. లేదా సమపరిమితమగు సత్త్వము, సమపరిమితమగు రజస్సు, సమపరిమితమగు తమస్సు వెరసి ప్రకృతి యని లక్షింపవచ్చును అనఁగా సత్త్వరజస్తమస్సుల సామ్యావస్థ ప్రకృతి యన్నమాట.

ఏదే నొక తత్త్వమునకు ఉపాదానకారణమునుగూడ ఆతత్త్వమునకు ప్రకృతి యని యందురు 'ప్రకృష్టముగా కార్యోత్పత్తి చేయునది ప్రకృతి' యని మిశ్రులు (9) ఈలక్షణమునుబట్టి మహత్తత్త్వము అహంకారము తన్మాత్రములుగూడ ప్రకృతి కాన త్రిగుణస్వరూపమగు ప్రకృతిని మూలప్రకృతి యనియు (10) మహదాదులను ప్రకృతి వికృతు లనియు సాంఖ్యకారిక లక్షించెను

అవ్యక్తము

శక్తిరూపముగా నుండునది, అనుమానముచే కనిపట్టనగునది, సాక్షాత్కారమున కయోగ్యమగునదియు అవ్యక్తతత్త్వమని చెప్పఁబడును స్వవ్యాపారముచే పుట్టువు గొనునది, వ్యక్తతత్త్వము ప్రకృతి సత్త్వరజస్తమ స్సామ్యావస్థ కావున స్వరూపముతో అవ్యక్తము తమస్సెంతయో రజ స్సంత, రజ స్సెంతయో సత్త్వమును అంత జడత యెంతో క్రియ అంత, క్రియ యెంతో ప్రకాశ మంత. ఈ మూఁడు సమాన మగుట అనగా నిది యర్థము జడతయు క్రియయు సమానమగుచో క్రియ కనఁబడదు. క్రియ కనఁబడదనగా ప్రకాశము పడయ దని యర్థము. ఈ యవస్థ సాక్షాత్కారయోగ్యము కా దన్నమాట క్రియచే రజస్సు ఉద్ఘాటితము కానినాఁడు సాక్షాజ్జ్ఞానము కలుగదు. క్రియచే రజస్సు ఉద్ఘాటితమైనంతనే సాక్షాజ్జ్ఞానము కలుగును కానిచో కలుగదు కావున ఆ యవస్థ అవ్యక్తము పూర్తిగా ఇది అజ్ఞేయము కాదుగాని ధారణకుమాత్ర మయోగ్యము. ఈయవస్థ

(8) "మూలే మూలాభావా దమూలం మూలమ్" సాం—సూ—1-67

(9) "ప్రకరోతీతి ప్రకృతిః ప్రకృతిత్వం తత్త్వాంతరోపాదానత్వమ్"

(10) "మూలప్రకృతి రవికృతి ర్మహదాద్యాః ప్రకృతివికృతయస్సప్త షోడశకస్తు వికారో న ప్రకృతి ర్న వికృతిః పురుషః"—సాం కా 3

ఒకటి ఉన్న దని ఎఱుఁగనగునుగాని ఎటులున్నదో అది మాత్రము ధారణ కందదు. ఏపదార్థమేని వ్యక్తముగా తెలియఁబడనంతమాత్రమున అది లే దని అనుట చెల్లదు. ఉన్న ద్రవ్యములనుగూడ పలుకారణములచే మనము కనుగొనఁజాలము మిగుల దవ్వు, మిగుల దాపు, ఇంద్రియవైకల్యము, అన్యమనస్కత,సౌక్ష్మ్యము, వ్యవధానము, అభిభవము (11) సమానాభిహారము (12) ఈ మొదలగు కారణములచే ఉన్న దానినే మనము కనుఁగొనజాలము (13) వీనిలో సూక్ష్మతాహేతువుచేతనే ప్రకృతి కానరాదుగాక; మఱి అసలు లేక కాదు దాని కార్యములు కానఁబడుచున్నవి కావున దాని ఉనికి ఉపలబ్ధ మగునుగదా! ఏవి దాని కార్యములు? మహదాదులు! అవి ప్రకృతికి కొంతవట్టు సరూపములు. ఎటులు? త్రిగుణమయము లగుటవలన. కొంతవట్టు విరూపములు ఎటులు? వ్యక్తము లగుటవలన (14) ఈ ప్రకృతి సూక్ష్మత యెట్టిది? ఒక మోకును తుల్యబలము కల యిరువురు ఒకఁ డొక చివరను ఇంకొకఁ డింకొక చివరను పట్టుకొని లాగుచున్నా రని అనుకొందము ఆమోకులో మనకు కనఁబడని యుద్ధ మొకటి జరగుట లేదా? విపరీతము లగు రెండు శక్తులు తుల్యబలము కలవగుచో నేక్రియయు కానరాదు కాని అలక్ష్యము అనఁగా కనిపట్టరాని ఒక సూక్ష్మక్రియ జరగుచున్న దని ఊహింపను మాత్రము వీలుకలుగును ప్రకృతిసూక్ష్మతయు ఇట్టి అలక్ష్యమగు నవస్థయే. రాజసికమగు క్రియయు తామసిక మగు జడతయు తుల్యబలము లాయెనేని అపుడు వ్యక్తక్రియ యుండదు అది కొంచెమేని ఉన్న చందము తెలియరాదు అది ప్రకాశము పడయదు అపుడు ప్రకాశము, క్రియ, స్థితి: ఈ మూఁడును కానరావు ఇది అవ్యక్తావస్థ.

సత్కార్యవాదము

కొండ బండ యుండలవలెఁగాని ఇచ్ఛాప్రేమ ద్వేషాదులవలెఁగాని సాక్షాదనుభవయోగ్యము కాకున్నను అవ్యక్త మను నొక వస్తువు కల దని ఒప్పక తప్పదు. పలయన్న బుద్ధ్యాదులు ఉత్పన్నములైన సత్పదార్థములు. ఇవి అసత్పదార్థమునుండి పుట్టనేరవు సత్కారణమునుండియే సత్కార్యము కలుగుట నియమముగా కానిపించుచున్నది. సాంఖ్యులును యోగులును మూలకారణపర్యంతము నీ నియమము చూపుదురు. కాన వారిది సత్కార్యవాదము

---

(11) ప్రకాశ మధికమగుచో కన్ను చూడఁజాలదు

(12) మినుముల రాశిలో ఒక మినుపగింజను కలిపివేసి మరల దానిని తీయఁబనిచినయెడల నది చేత కాని పని అగును అట్టిది సమానాభిహారము

(13) "అతిదూరాత్ సామీప్యా దింద్రియఘాతాన్మనోఽనవస్థానాత్ సౌక్ష్మ్యాద్ వ్యవధానా దభిభవాత్ సమానాభిహారా చ్చ" సాం కా 7.

(14) సౌక్ష్మ్యా త్తదనుపలబ్ధి ర్నా భావా త్కార్యత స్తదుపలబ్ధేః మహదాది త చ్చ కార్యం ప్రకృతి సరూపం విరూపం చ సాం కా 8.

పుట్టఁబోవుముందు కార్యము తన కారణమునందు సూక్ష్మరూపముగా నుండును. ఏలయన లేని దెన్నఁడును ఉనికి గొనఁజాలదు సదుపాదానకారణము నుండియే సత్కార్యము పుట్టును. అభావమునుండి భావోత్పత్తి యని ఒప్పుకొనుచో దేనినుండి ఏదేనియు పుట్టుకొనిరావచ్చు నని చెప్పుటయే యగును. అది అసంభవము శక్తి లేనిదే కార్యమెటులు? కావున ఉన్న శక్తినుండియే శక్యమగు ద్రవ్యము పుట్టుచున్న దని అనవలయును. మఱియు కార్యమున్నచో కారణము ఉండి తీర వలెను ఈదెస పుట్టుకకుముందు కార్యము సూక్ష్మరూపముతో కారణమునం దున్న దని తేలుచున్నది. లేమినుండి కలిమి పుట్టదు గనుక నే మహత్తత్త్వ ముత్పత్తికి మున్నుగూడ ఉనికిరూపుగనేయుండును. అది ఉనికిగొనియేయున్నదికాని అది కాన రాకున్నది ఈకానరానితనమే అవ్యక్తప్రకృతి.

మహదాదులగు వ్యక్తవస్తువు లుత్పత్తిలయశీలములు ఇట్టి వస్తువులకు కారణ ముండును మఱియు కార్యమునందు కారణగుణము లుండును కాన త్రిగుణాత్మకమగు వస్తు వొకటి వానికి మూలకారణము. మహత్తత్త్వము స్వకారణ మగు త్రిగుణాత్మకమగు వస్తువునుండి పుట్టి దానియంద లయమగును మహత్త త్త్వము వ్యక్తవస్తువు లన్నిఁటికిని మొదటిది. ఇది మిగిలిన వ్యక్తవస్తువు లన్నిటికిని కారణము దీనికి లయ మవ్యక్తమున. కావుననే దీనికి కారణ మొక వ్యక్తవస్తువు కాదు. అది ఒక అవ్యక్తవస్తువు,

వ్యక్తమంతయు లింగము. అనఁగా లయశీలము (15) మహదాదులన్నియు స్వస్వకారణములందు లయమగును. మఱి అవ్యక్తమో అలింగము. లింగమను పదము స్వకారణమునకు జ్ఞాపకము అను నర్థముగూడఁ జెప్పును. బుద్ధి మొదలగునవి తమ తమ కారణములకు జ్ఞాపకములు, అవ్యక్తమునకు మఱి కారణము లేదుగాన అది దేనికిని లింగము కాదు.

త్రిగుణాత్మకమగు అవ్యక్తమునుండియే సకలమున కుత్పత్తి. ఈ త్రిగుణము లును కలిసి కార్యమొనరించును కావున ఉత్పన్నమగు నాకార్య మొకటొకటిగనే ఉత్పన్నమగును కారణములు మూఁడయినను మహదాది కార్యములలో ప్రతి కార్యమును ఏకస్వరూపమే కలదై ఉత్పన్నమగును (16) కాని సత్త్వాదుల ప్రకా శాది విశేషముల ననుసరించియే గుణవికారము కలుగుచుండును ఆశ్రయ భేదముచే ఒక కార్యము ప్రకాశ ప్రధానముగనే వేఱొకటి క్రియాప్రధానముగనే ఇంకొకటి స్థితి ప్రధానముగనే ఉద్భవించును

అసంప్రజ్ఞాత సమాధిలో బుద్ధియు ఇంద్రియములును లయ మగును ఆ అవ్యక్త భావము ప్రకృతి 'గుణముల చరమరూప మెపుడును పట్టుపడదు' (17) అని

(15) "లయం గచ్ఛతీతి లింగమ్."

(16) "పరిణామైకత్వా ద్వస్తుతత్త్వమ్" (యో. సూ 4-14)

(17) "గుణానాం పరమం రూపం న దృష్టిపథ మర్ఛతి" (యో భా 4-13)

భాష్యము. ఇట్టి అవ్యక్త దశలో త్రిగుణ వికారములగు చిత్తేంద్రియములు లయము పొంది సమాధి భగ్నమగుటతోపాటు మరల వ్యక్తము లగుటఁజేసి సాంఖ్య తత్త్వ దృష్టిలో (18) అవ్యక్తము సత్ స్వరూపము అని యోగులందురు. ఆత్మజ్ఞాన మొదవి చిద్రూపత నెలకొనుడు చిత్తాదు లవ్యక్తతలో ముగియుఁగాన అపుడు ప్రకృతి అస ద్రూపము. యోగభాష్య మిటులు చెప్పును - 'అవ్యక్తము సత్తా-అసత్తాశూన్యము సత్తుగాని అసత్తుగాని కానిది, అసత్తును కానిది' (19) అనఁగా 'పరమార్థదృష్టిలో చరి తార్థమగుడు బుద్ధి సత్తు కాదు—అనుభావ్యము కాదు, మఱి సాంఖ్యతత్త్వదృష్టిలో అసత్తును కాదు' అని తాత్పర్యము.

అవ్యక్తావస్థ క్రియాహీనము. ఈ యవస్థలో విశ్వప్రకృతి లీనమయియుండును. ఇది స్థాయికాదు. ఏల యన ప్రకృతికి పరిణమించు స్వభావము కలదు. సృష్టికి పూర్వము ప్రకృతి యిటులు విశ్రాంతి గొనును. కాని పరిణమించు స్వభావము కల దానికి ఈ యవస్థ నిత్యముకాదు. అపుడు అదృష్టవశమున వ్యక్తావస్థ. దీనికి పరిణతి ఉన్నను ధ్వంసము లేదు. కాన నిత్యము. అవస్థాంతరప్రాప్తి పరిణామము. ఇది అభావము ధ్వంసము నాశముకాదు. పరిణామముననే విచిత్రసృష్టి. దీనికి విరా మము లేదు. దేశము లేక కాలము అవలంబముగా సృష్టి. దీని ప్రవాహము అనాది, అనంతము. ప్రకృతి పరిణామమునకు కాలవ్యాప్తిగాని దేశవ్యాప్తిగాని లేదు. గుణముల వైషమ్యమే క్రియాస్ఫూర్తి. అపుడ సృష్టివికాసము. 'గుణములు గుణ ములు' అని అనుచో ప్రకృతి అనియే మన కవగత మగును. పరిణామమనిన సృష్టి కభిముఖ మగు క్రియ. ఒకదానిచే మఱియొకదాని నియంత్రణమే యీ క్రియా స్వభావము. స్పందము వేగము నియంత్రణమును ఇవి గుణవైషమ్యమునఁగాని కలుగవు. అపుడ ప్రకృతికి వ్యక్తావస్థ. ఈ యవస్థలో ఒకగుణ మింకొక గుణమును అభిభవించును. ఒకటి సత్త్వమునకు వేఱొకటి రజస్సునకు కొండొకటి తమస్సునకు. దీన వస్తుగతమగు స్వభావము భేదించును. ఒక ప్రకృతియొక్కయే పరిణామము ఈ విశ్వము. కాని పరిణతమగు పదార్థముల స్వభావ మొకటికాదు. లో నున్న గుణ

---

(18) "ఇంద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్య శ్చ పరం మనః
మనస స్తు పరా బుద్ధిర్ బుద్ధే రాత్మా మహాన్ పరః
మహతః పర మవ్యక్త మవ్యక్తాత్ పురుషః పరః
పురుషా న్న పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః" [కఠ-1-3-,10 11.]

(19) "ని స్సత్తాసత్తం ని స్సదస న్నిరస దవ్యక్తమ్ (యోగభాష్య-2-19) ని స్సత్తాసత్తమ్. పురుషార్థసంపాదకత లేనిదయ్యు శూన్యము కానిది. నిస్సదసత్—స్థూలకార్యము సూక్ష్మకారణ ములు లేనిది అనఁగా కార్యకారణములు లేనిది. నిరసత్—అసత్తు కానిది అనఁగా భావ పదార్థము అని వ్యాఖ్యావిశేషములు.

ఈ కతమే సాంఖ్యులకును యోగులకును తత్త్వములయెడ ప్రమాణము. బాదరాయణులు ఈ విషయ మెల్ల ఖండించిరి. "అనుమానిక మప్యేకేషా మితి చే న్న శరీర రూపక విన్యస్త గృహీతే ర్దర్శయతి చ" 1-41, "ఇతరేషాం చా నుపలబ్ధేః" 2-1-2, "ఏతేన యోగః ప్రత్యుక్తః" 2-1-3. ఈమొదలగు బ్రహ్మ సూత్రములును శంకరభాష్యమును చూచునది.

ధర్మముబట్టి పదార్థస్వభావము పర్పడును. దీనఁజేసి వస్తు వైవిధ్యము. వానిలో గుణ ధర్మ సంచారమును సంక్షోభమును వేఱువేఱు. ఇంతియకాక ఒకవస్తువునందే వేఱు వేఱు వేళల ఈ సంచార సంక్షోభములు వేఱువేఱు దీనఁజేసి వస్తువిశేషములందు నానావస్థల పుట్టుక. పరిణతి ప్రకృతి స్వభావము. దీనికి విరతిలేదు.

పరిణామమునకును ఒకరీతి కలదు. ఇది నియమబద్ధము. కారణస్వరూపము కార్యమందు స్ఫుటమగును. అది అనురూప పరిణామము నూవులనుండియే నూనె గాని యిసుకనుండి రాదు పరిణతి శృంఖలాబద్ధముగాన సృష్టిలో శ్రేణీ విన్యాసము సంగతి, సర్యాయము కానిపించును. కాని అన్నిటికి మొదట గుణధర్మానుగతమగు సంచారము సంచార విశేషముచే పరిణతికి వైశ్వరూప్యము,

గుణములు మూఁడును పరస్పరోపరక్తములు సత్త్వము రజస్తమస్సులచే రజస్సు సత్త్వతమస్సులచే తమస్సు సత్త్వరజస్సులచే ననుగతము అవి ఏయెడను విడిపోవు మఱి విడిగా కార్యము చేయవు. ఇవి కలసి క్రియాశీలము లగుడు భూతేం ద్రియ పరిణామము ఇవి ఒండొకటి కలిసి మిధునములయినను విడిగనే ఉన్నటులు పరిణతదశలో కానిపించును. పరిణతిలో ప్రత్యేక గుణవిశేష మావశ్యకము ఇటులని వీని కలిసికట్టు తనమునకు విలయము లేదు. సత్త్వమధికమగుచో మిగులు రెండును అడఁగియుండును ఇటులే మిగిలినవియు సత్త్వము ప్రధాన మయినచోట ప్రకాశ మాత్రము సత్త్వము ప్రకాశక్రియ రజస్సుది. ప్రకాశ, సంరక్షణము లేక స్థితి తమ స్సుది. ఇటులే మిగిలినవానియెడ నరయునది. ఈ రీతిగా గుణముల క్రియ నిష్పన్న మగును.

ప్రపంచమున ప్రతివస్తువుగూడ దేనియో సుసూక్ష్మమగు పరిణామ మని అను మానముచే సాధింపనగును.ఇంతియకాక తన్మాత్రములకడనుండి మహత్తత్త్వము వఱ కును తత్త్వములు సమాధిజమగు ప్రజ్ఞలో సాక్షాదనుభవగమ్యములు. ఈదెస 'పరిణామ మునకెల్ల మూలము ప్రకృతిలో' అని తెలిసివచ్చును. వ్యక్తావస్థలో సృష్టి భిన్నపర్యాయ మయ్యు పరిణామ వాదమున నిది పర్యాయ నిత్యతకాదు. గుణధర్మనివేశభేదముచే వస్తుపర్యాయము మార్పుచెందును. మూలప్రకృతియొక్క వికృతులు మాత్రము మాఱవు కాని గుణసమావేశముచే వ్యక్తి మాఱునగును. వ్యక్తినిగాని జాతినిగాని ఎప్పుడును ఒకే రీతిగా నుంపఁగల నియామకత లేదు. 'సాధన పురుషకారములచే మను ష్యుఁడు మనుష్యత బాసి దైవముగా పరిణమింప వచ్చును' అని భాష్యము (20)

నిత్యము పరిణామినియగు నీ ప్రకృతితోడను మఱియు నిత్యుఁడును అపరిణ ణామియునగు పురుషునితోడను సృష్టి ఇటులయ్యు ప్రకృతియొక్కయే పరిణామము సృష్టి. ఇది స్వాభావికము ఈ పరిణామమున కేమేని ఉద్దేశము కలదా? కలదు ఒక దెస పురుషుని భోగము మఱియొక దెస అపవర్గము ప్రకృతి పురు

(20) (యో—సూ—భా—4—8)

షుని ఆకర్షించి ఐశ్వర్యానందము లొసఁగు చందముననే ఆధ్యాసిక బంధమునుండియు నిష్కృతి కలిగించును. ప్రకృతిక్రియ యెల్ల - సృష్టిగాని 'సృష్ట్యుపసంహృతి కాని పురుషుని గూర్చి ఏల? అది జడము. తన పనికి తనపట్లనేమి ఫలము? పురుషుపట్ల తన పని సార్థకము

కేవల ప్రకృతి సృష్టి చేయలేదు. అది పురుషోపదృష్టము కావలయును. ఇటు లని పురుషేచ్ఛగాని ప్రయోజనముగాని సృష్టికి కారణముగాదు పురుషునకు ప్రయో జన మేమియు లేదు. ఆ ప్రయోజనము ప్రకృతికే. జడమునకేటి ప్రయోజనము? పురుష సంస్పర్శలో ఈ ప్రయోజనమునకు అభివ్యక్తి దీన అవ్యక్తత తొలఁగుటయు వ్యక్తత ఏర్పడుటయు సిద్ధించును.

❖

మనవి

రచయితలు, చిత్రకారులు, తమతమ రచనలను చిత్రములను ప్రతినెల
10 వ తేదీ లోపుగా కార్యాలయమునకు చేరునట్లు పంపవలెను.
ప్రచురించని రచనలు, చిత్రాలు త్రిప్పిపంపగోరువారు,
వారిరచనలతో, చిత్రాలతో కావలసిన తపాలా
బిళ్ళలు పంపవలెను.

సంపాదకులు నవభారతి

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి
సీ తా క ల్యా ణ ము

౧

సీతారాములు లక్ష్మీనారాయణులు. రాముడు సాక్షాత్తు పరమేశ్వరుడు. రాముడు పురుషుడు. సీత ప్రకృతి. ఆ వివాహము బ్రహ్మానందముతో సమానమైనది. ఈ ఘట్టములో యీ విషయములను జోడించుచు గొప్ప కల్పనలతో వ్రాయబడినది.

లోకములో వివాహములు జరుగును. జరిగినయన్ని వివాహములయందు కొన్ని కొన్ని సందర్భముల నొక సమానమైన యనుభవము లోకము పొందుచున్నది. ఆ యనుభవము నిందు జోడించుచు నీ రచన యంతయు రమ్యముగా చేయబడినది. పెండ్లికూతును తట్టలోపెట్టి మేనమామ తీసుకొని వచ్చును. పెండ్లికూతుండ్లు తట్టలలో నుండగా వారు సిగ్గుచే తలలు వంచుకొని యుందురు. వారి మొగములు కొద్దిగా కన్పించుచుండును. తలకట్టు మిక్కిలిగా కన్పించుచుండును. మొగములు తామరపువ్వులు. తలకట్టు తుమ్మెదలు. తొందరలో చూచినప్పుడు తుమ్మెదలు క్రమ్మిన తామరపూలు తట్టలలో పెట్టి తీసుకొనివచ్చుచున్నట్లు హఠాత్తుగా కన్పించును. కొంచెము పరిశీలించి చూచినంతనే, వారు పెండ్లి కూతుండ్రని తెలియును. ఈ సంగతి ఈ పద్యములో నున్నది.

గీ తుమ్మెదలు పైని గ్రమ్మిన తమ్మిపూలునాల్గు తట్టలతో దెచ్చినారు మేన
మామ లంతలో జూడగా మధుర లజ్జ లుదయమైన రాకన్నెల వదనములుగ.

దీనితో పెండ్లిసేయుట మొదలుపెట్టబడును ఆ ప్రారంభమే యింత మధురమైన భ్రాంతిజనకముగా నున్నది. ఒకానొక విలక్షణమైన సుఖమునకు తొలిమెట్టువలె నున్నది. పెండ్లికూతుండ్రు వచ్చిరి. భార్యాభర్తల మధ్య సన్నని తెర పట్టిరి. ఆ భార్యల మొగములు తెరలో నుండి కనిపించునేమోయని భర్తలు చూతురు. తెర సన్ననిది కనుక కనిపించీ కనిపించనట్లు కనిపించును. తెర తీసినంత అసలు స్వరూపము కనిపించును. యీ యర్థమునందు రామచంద్రుడు సాక్షాత్ పరమేశ్వరుడగుట శ్లేషించుచు నిట్లు వ్రాయబడినది.

సీ॥ సంకల్పసంభవాస్థానమౌ తెరతోఁచి పంచీకృతంబులౌ ప్రాణములును
దెరవెన్కఁ బ్రతిబింబ దీధితుల్ ప్రకటించి తనకు మించిన మోహమున వెలింగి
తను దానరాము డయ్యును విస్మరించి తత్ప్రతిబింబమునయందు రాముఁడగుచుఁ.

తెర 'సంకల్ప సంభవాస్థానము వలె' నున్నది. సంకల్పసంభవుడనగా మన్మథుడు. రామచంద్రునకా తెర మన్మథుని యాస్థానమువలె నున్నది అనగా ఆయనకు సీతయందుగల ప్రేమాతిశయముచేత యే తెరసందులలో నుండి యామె లీలగా కనిపించుచున్నదో యా తెర యాయన మనస్సునకు మన్మథుని యాస్థానమువలె కనిపించినది.

ఆయన సాక్షాత్ పరమేశ్వరుడు. నిర్గుణుడు. పరబ్రహ్మ స్వరూపుడు ఆయనకు మోహమేమిటి ? కాని మొట్టమొదట నిర్గుణమైన పరబ్రహ్మము. "బహూశ్యాం ప్రియాయై" యని సంకల్పించెను. ఆ సంకల్పమే మాయ. అచ్ఛమైన, బ్రహ్మమైన తనకు, ప్రపంచకమునకు- నడుమ తెరయున్నది. ఆ తెరయే మాయ. పంచీకృతములైన ప్రాణములు తెరవెనుక "ప్రతిబింబదీధితులను" ప్రకటించినది. సర్వమానవులయందు భగవంతుడు ప్రతిబింబముగా నున్నాడు. అంతర్యామిగా నున్నాడు. ఇదియే ప్రతిబింబము మాయయందు పరమేశ్వరుడు ప్రతిబింబించుచున్నాడు. ఇది వేదాంతార్థము. ఇంక రాముడు తెరవెనుక నున్న సీతయందు తనకామె ప్రతిబింబమన్నట్లుగా, అనగా అంత మోహముతో మెలగుచున్నాడని యర్థము.

తనకు మించిన మోహామున వెలింగి...

రామునకు సీతయందు కల ప్రేమ యధికముగా నున్నది. తనయందు తనకంటె సీత యందే యెక్కువ ప్రేమ యున్నట్లు కనిపించినది. తనకు మించిన మోహమనగా నిది తాను దా రాముడై యా ప్రతిబింబమునందు రాముడగుచున్నాడు. రాముడనగా రమించువాడు. తన యందు తానే రమించువాడు. అనగా పరమయోగి. సాక్షాన్నారాయణుడు. ఇట్లయ్యు ఆ ప్రతి బింబమునందు రమించుచున్నాడు. సీతయందు రమించుచున్నాడు. ప్రకృతియందు పరమేశ్వరుడు రమించునుగదా! మానవులందరు తాము పరమాత్మ ద్రవ్యములై పంచేంద్రియాదులయందు రమిం చుట సహజము. పరమేశ్వరుడు మాయయందు రమించును. రాముడు సీతయందు రమించు చున్నాడు.

తెరతీసినంత తెలిసి నిజస్వరూపంబు బ్రహ్మానంద పరిధి యగుచు.

తెర తీసినంతనే సీతయొక్క నిజస్వరూపము - అనగా యదార్థమూర్తి కనిపించినది. ఆమెమహాసౌందర్యము చూచి యతడు, 'బ్రహ్మానందపరిధి' యైనాడు. అనగా తన యానందమును పట్టలేక పోయినాడని యర్థము. వేదాంతార్థమేమనగా- తెర తీసినంతనే, మాయ తొలగిపోయినంతనే, నిజస్వరూపంబు తెలిసి - యనగా తాను పరమాత్మయని తెలిసికొని, తాను బ్రహ్మముగనుక, బ్రహ్మానందమును మానవుడు యోగియై పొందును.

ఎంతటి మహీయుడయ్యును నినకులశిశు వింతగ నణీయుడై సర్వసృష్టి సహజ మైన విభ్రాంతి బొందె

రాముడెంతో గొప్పవాడు. తాటకను వధించెను. సుబాహునిచంపెను. మారీచుని సముద్ర ములో కూల్చెను. అహల్యాశాప విమోచనము చేసెను. యీ యీ కార్యములు పెండ్లికి పూర్వమే జరుగుటచేత రాముడు తాను మహావీరుడనని, శాపమోక్షణము చేయగలిగిన మహాత్ముడనని కొంత మనస్సులో ననుకొనవలయును. అంతటి మహీయుడు, గొప్పవాడు కాని సీతను చూచి నంతటనే యివి యన్నియు మఱచిపోయి యామెయందు కలిగిన ప్రేమచేత, తానే లేనట్లు, యామె లేనిచో తాను లేనట్లు, తనకు తానంత కుదించుకొని పోయినాడు. అందుచేత అణీయుడు. అణువు ఒక అణువైనాడు అంతటి మహీయుడు, ఇంతటి యణువైనాడు. ఇది ప్రేమలక్షణము. పరమేశ్వరుడు "అణోరణీయాన్, మహతోమహీయాన్" అని వేదములు చెప్పుచున్నవి. ఆయన అణువుకంటె అణువు. మహత్తుకంటె మహత్తు. తాను పరమేశ్వరుడై మహత్తు, జీవుడై అణువు. ఈ విభ్రాంతి సృష్టిసహజము. ఎంత పరమేశ్వరుడైనను మానవుడై జన్మించి నంతనే యిట్టి లక్షణములు కలుగును ఇది సృష్టిసహజమైనది.

మోహజమ్ములైన వికృతి నలుగురితోపాటు విస్తరించు.

యీ వికారము మోహజము. నలుగురితో పాటనగా - లోకముతో పాటని యర్థము. లోకమునందు నలుగురు యెట్లు చేసిన నీవట్లు జేయవలెను., యందురు. ఇక్కడ నలుగురనగా- బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులని యర్థము. స్థూలముగా - పదిమందియని యర్థము. యిత రులు యని యర్థము. యీ మోహజనితమైన వికృతి నలుగురితోపాటు విస్తరించును అనగా రామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు సమానముగా గలదని యర్థము. లేనిచో ముగ్గురితోపాటు విస్తరించుననవలె. అనగా లక్ష్మణ భరతశత్రుఘ్నుల కెట్లున్నదో-రామునకు నట్లేయని. ఇందురో రామునిగూడ కలిపి, నలుగురికని చెప్పబడినది. నలుగురెట్లు చేయుదురో నీవట్లు చేయుమన్న వాక్యములో - నలుగురనగా చాతుర్వర్ణ్యమైనచో 'నీవు' అని చెప్పబడినవాడు యీ నలుగురిలో నున్నాడుగదా ? అట్లే రాముడు - యీ నలుగురిలో నున్నాడు.

శ్రీ జగన్నాథ పండితరాయ విరచిత

గంగాలహరి

అనువాదకులు : డాక్టర్, శ్రీ బూర్గుల రామకృష్ణరావు

౧

సమృద్ధం సౌభాగ్యం సకలవసుధాయాః కిమపితన్
మహైశ్వర్యం లీలాజనితజగతః ఖండపరశోః।
శ్రుతీనాం సర్వస్వం సుకృత మథమూర్తం సుమనసాం
సుధాసౌందర్యం తే సలిలమశివం నః శమయతు॥

శ్రీ సౌభాగ్య సమృద్ధి యీ వసుధకుం, గ్రీడాజగత్కల్పనా
వ్యాసంగుండగు నిందుమౌళి పరమైశ్వర్యమ్ము, సర్వశ్రుతి
శ్రీ సర్వస్వము, పుణ్యమూర్తి, సుమనశ్రేణీ సుధాసార ధా
రా సౌందర్యము, మాకు నీసలిల, మార్యా మంగళమ్మిచ్చుతన్. ౧

దరిద్రాణాందైన్యం దురితమథ దుర్వాసనహృదాం
ద్రుతం దూరీకుర్వన్సకృదపి గతో దృష్టిసరణిమ్।
అపి ద్రాగావిద్యాద్రుమదళన దీక్షాగురురిహ
ప్రవాహస్తే వారాం శ్రియమయమపారాం దిశతునః॥

దూరమ్మొం బొనరించు దైన్యము దరిద్రుల్ మ్రొక్క, దుర్వాసనా
దారాఘౌఘముఁ బాపు దృష్టి బడినంతన్ నీ ప్రవాహ, మ్మవి
ద్యారూపక్షితి జాత నిర్దళన దీక్షాచార క, మ్మస్మదీ
యారాధ్యమ్మయి, యిచ్చుగావుత నపారైశ్వర్యధుర్యప్రభన్. ౨

ఉదంచన్మార్తాండస్ఫుటకపట హేరంబజననీ
కటాక్ష వ్యాక్షేప క్షణ జనిత సంక్షోభ నివహాః।
భవంతు త్వంగంతో హరశిరసి గంగాతనుభువః
తరంగాః ప్రోత్తుంగా దురితభయ భఙ్గాయ భవతామ్॥

అరుణార్కస్ఫుట చండికాకృత కటాక్షక్షేప సద్యః క్షణ
స్ఫురితామర్ష వికంపితేశ్వర జటాజూటాంత గంగాసరి
త్స్వరసోత్తుంగ తరంగ భంగిమము లశ్రాంతంబు దుర్వార దు
ర్భరసంసార సముచ్ఛలచ్ఛిఖిశిఖా భంగమ్ము గావించుతన్. ౩

తవాలంబాదంబ స్ఫురదలఘు గర్వేణ సహసా
మయా సర్వేఽవజ్ఞా సరణిమథ నీతాః సురగణాః।
ఇదానీ మౌదాస్యం భజసి యది భాగీరథి తదా
నిరాధారో హా రోదిమి కథయ కేషామిహ పురః॥

అంబా! నీయవలంబ మున్నదని గర్వారంభినై దేవబృం
దంబున్ బొమ్మని యీసడించితిని, ఔదాసీన్యమీ వూని న
న్నుం బాలింపకయున్న, దిక్కెసెడియెందుం బోయి యెవ్వారిముం
దంబా! యేడ్చెదఁ దెల్పవే, గుణ కదంబాలంబ । గంగానదీ. ౪

స్మృతింయాతా పుంసా మకృతసుకృతా నామపి చ యా
హరత్యంత స్తంద్రాం తిమిరమివ చంద్రాంశు సరణిః।
ఇయంసాతే మూర్తిః సకలసురసంసేవ్యసలిలా
మమాంతః సంతాపం త్రివిధమపి పాపంచ హరతామ్॥

ఇంతేనిన్ సుకృతమ్ము సేయని జనమ్మేయైన భావింప స్వాం
తాంతర్ధ్వాంతముఁ జిమ్మచీఁకటులఁ జంద్రాంశుచ్ఛటానీక మ
ల్లైంతేఁ జిమ్ము సురాది సేవ్యరసమూర్తీ! సంతతాస్మన్మనో
ధ్వాంత మ్మాంతర పాప తాప వితతిన్, ద్వన్మూర్తి చెండాడుతన్. ౫

అపిప్రాజ్యం రాజ్యం తృణమివ పరిత్యజ్య సహసా
విలోలద్వా నీరం తవ జనని తీరం శ్రితవతామ్ ।
సుధాతః స్వాదీయ స్సలిల భరమాతృప్తి పిబతామ్
జనానామానందః పరిహసతి నిర్వాణ పదవీమ్ ॥

భావజ్ఞుల్ దమప్రాజ్య రాజ్యము తృణ ప్రాయమ్ముగా వీడియీ
నీవానీర విలోల దివ్యతటినీ నిత్యాశ్రయమ్మొంది నీ
సేవల్ సేయుదు రీసుధాతి మధుర శ్రీవారి ధారావళీ
సేవాభాగ్యము నవ్వుముక్తి రమణీ శృంగార భాండారమున్. ౬

ప్రభాతే స్నాతీనాం నృపతి రమణీనాం కుచతటీ
గతో యావన్మాతర్మిలతి తవ తోయై ర్మృగమదః ।
మృగాస్తా వద్వైమానిక శతసహస్రైః పరివృతా
విశంతి స్వచ్ఛందం విమల వపుషో నందన వనమ్ ॥

నీ నీటన్ దెలవార రాచరమణుల్ నీరాడఁ బీన స్తనా
స్థానమ్మౌ మృగపంకమందుఁ గలియన్, ధన్యమ్ములై లేళ్ళు వై
మానాయాస సహస్రదేవగణ సామ్రాజ్యమ్ము వెన్నంటగా
సానంద మ్మొనరించు నందనవనీ స్వచ్ఛంద సంచారముల్. ౭

స్మృతం సద్యఃస్వాంతం విరచయతి శాంతం సకృదపి
ప్రగీతం తత్పాపం ఝటితి భవతాపంచ హరతి ।
ఇదం తద్గంగేతి శ్రవణ రమణీయం ఖలుపదం
మమప్రాణప్రాంతర్వదన కమలా న్త ర్విలసతు ॥

స్వాంతమ్మున్ బొనరించు శాంతముఁ దలంపన్ బాపతాపమ్ము లం
తంతం దూల్చును గాన భంగిమను, 'గంగా' యన్నఁ గర్ణామృత
మ్మెంతే నయ్యెడు నన్న యా క్షణములోనే, నీదు నామమ్ము ప్రా
ణాంత ప్రాంతమునందు నాముఖ సరోజాంత స్థలిన్ న_ర్తిలున్. ౮

యదంతః ఖేలన్తో బహులతర సంతోష భరితా
నకాకా నాకాధీశ్వర నగర సాకాంక్ష మనసః ।
నివాసాల్లోకానాం జనిమరణ శోకాపహరణం
యదేత త్తే తీరం శ్రమశమన ధీరం భవతునః ॥

కాకుల్ 'కా' వని నీదునీట నెగురంగా నేర్చి హర్షాన, నా
నాకాధీశ పురీవిహార కలనానందమ్ముఁ గాంక్షింప, వే
దోకోనన్ వసియించినన్ జనిమృతి ప్రోద్యద్వ్యథల్ దీరెడిన్
మాకీతీరము తాపసంశమన శుంభద్ధీరమౌ గావుతన్. ౯

నయత్సాక్షా ద్వేదైరపి గలిత భేదై రవసితం
నయస్మిన్ జీవానాం ప్రసరతి మనోవాగవసరః ।
నిరాకారం నిత్యం నిజమహిమ నిర్వాసిత తమో
విశుద్ధం యత్తత్వం సురతటిని తత్వం న విషయః ॥

భేదాతీతములైన వేదములకున్ వేద్యమ్ముగా నట్టి తా
నేదో భావము, వాఙ్మనో విషయ మెందేఁగాని యందమ్ము, నిః
ఖేదబ్రహ్మ, మపాస్తగాధ తమమై కీల్కొన్న నామ స్వరూ
పాదుల్ లేని యఖండ తత్వమవు, తత్వాతీతవున్, జాహ్నవీ. ౧౦

మహాదానై ర్ధ్యానై ర్బహువిధ వితానై రపిచయన్
నలభ్యం ఘోరాభిః సువిమల తపోరాశిభిరపి।
అచిన్త్యం తద్విష్ణోః పదమఖిల సాధారణతయా
దదానా కేనాసి త్వమిహ తులనీయా కథయ నః॥

నానాతీవ్ర తపోవితానముల, స్నానధ్యాన దానాది సం
ధానాధీనత నందరానిది యచింత్యమ్మైన యవ్వైష్ణవ
స్థానమ్మారక యెల్లవారలకునున్ దానమ్ముగావింతు వ
మ్మా నిన్నెవ్వరితో సమాన వననౌ నామాటఁ దెల్పంగదే. ౧౧

నృణామీక్షా మాత్రాదపి పరిహరన్త్యా భవభయం
శివాయాస్తే మూర్తేః క ఇహ మహిమానం నిగదతు।
అమర్ష మ్లానాయాః పరమ మనురోధం గిరిభువో
విహాయ శ్రీకంఠః శిరసి నియతం ధారయతి యామ్॥

ఆలోకమ్మననే ప్రజాభవ భయమ్మంతమ్ము నొందించు నీ
లీలామంగళమూర్తి వైభవము నుల్లేఖించు నెవ్వండహో
ఫాలాక్షుండె యమర్ష రోషవశయౌ ప్రాలేయ రాట్కన్యకన్
లాలింపండు, తలన్ ధరించు నెపుడున్ లక్షించి నిన్నేమదిన్. ౧౨

వినింద్యాన్యున్మత్తై రపిచ పరిహార్యాణి పతితై
రవాచ్యాని వ్రాత్యైః సపులక మపాస్యాని పిశునైః।
హరంతీ లోకానా మనవరత మేనాంసి కియతామ్
కదా ప్యశ్రాంతా త్వం జగతి పునరేకా విజయసే॥

ఉన్మత్తుల్ పతితుల్ వినింద్యము లటంచూహించి వర్జింప నా
జన్మవ్రాత్యు లవాచ్యమంచనగ, దుర్జన్ముల్ సరోమాంచులై
సన్మార్గమ్మది గాదనన్ వెలుచు దోషశ్రేణి నొక్కమ్మడిన్
మన్మాతా! హరియించి మించెదుగదమ్మా! నీవ యశ్రాంతమున్, ౧౩

స్ఖలంతీ స్వర్లోకా దవని తల శోకాప హృతయే
జటాజూట గ్రంథౌయదసి వినిబద్ధా పురభిదా।
అయే నిర్లోభానామపి మనసి లోభం జనయతాం
గుణానా మేవాయం తవ జనని దోషః పరిణతః॥

స్వర్లోకమ్మననుండి శోకము లడంపన్ గ్రిందికిన్ దూకుచో
దుర్లభ్యన్ఁ బురశాసనుండు జడలందుంబట్టి బంధించెనిన్,
నిర్లోభాత్ముల కేని లోభగుణముం నిక్కంబు పుట్టించునీ;
దౌర్లాటన్ గుణమెల్ల దోషపరమై తోచెన్గదే స్వర్ణదీ. ౧౪

జడానంధాన్ పంగూన్ ప్రకృతి బధిరా నుక్తివికలాన్
గ్రహగ్రస్తా న స్తాఖిల దురిత నిస్తార సరణీన్।
నిలింపైర్ని ర్ముక్తానపి చ నిరయాంతర్నిపతతో
నరానంబ త్రాతుం త్వమిహ పరమం భేషజమసి॥

మాతా! మూకజడాంధ పంగు బధిరోన్మాదగ్రహగ్రస్తులన్,
భూతప్రేత పిశాచ బాధితుల, వేల్పుల్ వీడు దుర్మార్గక
వ్రాతమ్మున్ బ్రదికించు భేషజమవై రాజిల్లుచున్నావు. నీ
వేతన్మాత్ర వటంచు నెంచవశమౌనే నీ ప్రభావమ్ములన్ ౧౫

స్వభావ స్వచ్ఛానాం సహజ శిశిరాణా మయమపా
మపారస్తే మాతర్జయతి మహిమా కోఽపి జగతి।
ముదాయం గాయంతి ద్యుతల మనవద్యద్యుతి భృతః
సమాసాద్యాద్యాపి స్ఫుటపులకసాంద్రాః సగరజాః॥

సహజ స్వచ్ఛములున్ స్వభావ శిశిరచ్ఛాయమ్ములౌ త్వత్పయో
మహిమమ్మెందు నపార సారమగునమ్మా యంచు నీనాటి, క
న్వహ ముద్యద్రుచి సంభృతుల్ సగర సంతానమ్ము గీర్తించెడిన్
ముహు రుద్యత్పులకాంగులై దివమునన్ మోదించి, భాగీరథీ. ౧౬

కృతక్షుద్రైనస్కానథ ఝటితి సంతప్త మనసః
సముద్ధర్తుం సంతి త్రిభువనతలే తీర్థనివహాః।
అపిప్రాయశ్చిత్త ప్రసరణ పథాతీత చరితాన్
నరానూరీకర్తుం త్వమివ జనని త్వం విజయసే॥

పాయమ్మోటకు క్షుద్రపాపి జనమోక్షమ్మియ, నానావిధో
పాయమ్ముల్ వెదుకన్ ద్రిలోకముల నంబా! తీర్థముల్ లేవటే?
ప్రాయశ్చిత్త పథవ్యతీతులగు ప్రభ్రష్టాత్ములౌ పాపులన్
నీయంతం దరిఁ జేర్చి యేల నవనిన్ నీసాటి నీవే సుమీ. ౧౭

నిధానం ధర్మాణాం కిమపిచ విధానం నవముదాం
ప్రధానం తీర్థానా మమల పరిధానం త్రిజగతః।
సమాధానం బుద్ధేరథఖలు తిరోధాన మధియాం
శ్రియామాధానం నః పరిహరతు తాపం తవవపుః॥

శ్రేయోరాసి నిధానమై, నవసుఖ శ్రీసంవిధానమ్మునై,
వేయే తీర్థములం బ్రధానమయి, భూవేలా పరీధానమై,
ధ్యేయమ్మై బుధకోటికిన్, ఖలుల కెంతేనిన్ దిరోధానమై
శ్రేయః స్థానము నైన నీదగు పయః శ్రీ వాపుతన్ పాపముల్. ౧౮

కౌటిల్యార్థశాస్త్రమ్

ఆంధ్ర వివరణము

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి

౧

[కౌటిల్య, విష్ణుగుప్త, వాత్స్యాయన, అను ఇతరనామధేయములు గల చాణక్యుడు నంద రాజులవలన గ్రహించిన భారత సామ్రాజ్యము నందు మౌర్యచంద్రగుప్త నభిషేకించి ఈ అర్థశాస్త్రమును రచించి యిచ్చెను. ఈ అర్థ శాస్త్రము వాక్యాత్మకముగ నున్నది. ఆ యా ప్రకరణముల తుదను శ్లోకములు గలవు. తుదను శాస్త్రసంగ్రహరూపమగు 571 సూత్ర ములు వేరుగ గలవు. యథాశక్తిగ తోచినంతగ సంగ్రహముగ వివరణము వ్రాయబడుచున్నది]

మూ॥ వినయాధికారికం ప్రథమ మధికరణం.

ఓం నమ శ్శుక్రబృహస్పతిభ్యాం.

ఈ అర్థశాస్త్రమునందు 15 అధికరణములు గలవు. 180 ప్రకరణములు గలవు. ఒక్కొక ప్రకరణమునందు 2-3 అధ్యాయములు గలవు. అందు వినయము నుద్దేశించి మొదటి అధికర ణమునందు ప్రకరణములు గలవు. కావున నిది వినయాధికరణము. అర్థశాస్త్రప్రణేతలలో మొదటివారుబృహస్పతి, శుక్రుడు, కావున శుక్ర బృహస్పతులకునమస్కారము గావింపబడెను.

మూ॥ పృథివ్యా లాభే పాలనే చ యావ
న్త్యర్థశా
స్త్రాణి పూర్వాచార్యైః ప్రస్థాపితాని ప్రాయశ
స్తాని సంగృహ్య ఏక మిద మర్థశాస్త్రం
కృతం.

పూర్వాచార్యులు బృహస్పతి, శుక్రుడు, మొదలగు వారు భూమిని(రాజ్యమును) సంపా దించుట, పరిపాలించుట, వీటివిషయమై ఎన్ని అర్థశాస్త్రగ్రంథములను స్థాపించిరో వాటిని తఱచుగ సంగ్రహించి ఈ ఒక (ముఖ్యమగు) అర్థశాస్త్రము నాచే చేయబడుచున్నది. అచ టచట ఆ యా గ్రంథకర్తలు అభిప్రాయము లను చూపి విమర్శించి తన సిద్ధాంతమును చూపియుండెను. ప్రాయికముగ పూర్వాచార్యుల నిర్ణయములను త్రోసివేయుటయు గలదు. అట్లు చేయుచున్నా నని గ్రంథకర్త ప్రాయశః అను పదముచే సూచించెను. రాజ్యసంపాదన మునకును రాజ్యపాలనమునకును వలసిన విష యములలో కొన్ని కొన్ని విషయములనే ఒక్కొక ఆచార్యుడు చెప్పెననియు తాను సకల విషయములను సంగ్రహముగ నిందు చెప్పు చున్నాననియును 'ఏకం' అనుపదముచే సూచించెను.

మూ॥ తస్యాయం ప్రకరణాధికరణ సముద్దేశః
విద్యాసముద్దేశః । వృద్ధసంయోగః ।
ఇంద్రియజయః ।
అమాత్యోత్పత్తిః । మంత్రిపురోహితో
త్పత్తిః । ఉపధాభి
శ్శౌచాశౌచజ్ఞాన మమాత్యానాం । గూఢ
పురుషోత్పత్తిః ।
గూఢపురుషప్రణిధిః । స్వవిషయే
కృత్యాకృత్య
పక్షరక్షణం । పరవిషయే కృత్యాకృత్య
పక్షోపగ్రహః ।
మంత్రాధికారః । ధూతప్రణిధిః ।
రాజపుత్రరక్షణమ్ ।
అపరుద్ధవృత్తమ్। అపరుద్ధే వృత్తిః।
రాజప్రణిధిః।
నిశాంతప్రణిధిః।ఆత్మరక్షితకమ్॥

ఇతి వినయాధికారికం ప్రథమాధికరణమ్.

ఈ అర్థశాస్త్రమునకు అధికరణములు ప్రక రణములు వీటియొక్క నిర్దేశము చేయబడు చున్నది. మొదటిదగు వినయాధికరణమునందు 1వ ప్రకరణము విద్యాసముద్దేశము. ఏ యే విద్యలు చదువదగినవి? ఎవరే యే విద్యల 'చదువవలయును? వాటి ప్రయోజనము. వాటి

స్వరూపము ఇట్లు విద్యాసముద్దేశమునందు 3 అధ్యాయములు 2 వ ప్రకరణము వృద్ధసంయోగము, పెద్దల సంబంధము అనగా కొన్ని విద్యలు చదువదగినవి. కొన్ని నేర్పదగినవి ఏ యే విద్యలు ఎవ రెవరి వలన గ్రహింపదగినవి? ఆ యా విషయములందు పెద్ద లెట్టివారు? ఈ విషయము ఒక అధ్యాయమున గలదు. 3 వ ప్రకరణము ఇంద్రియజయము, ఇంద్రియజయము లేనిచో గలుగు హాని, ఇంద్రియజయము వలని ప్రయోజనము ఇంద్రియజయప్రకారము, రెండు అధ్యాయములు. 4 వ ప్రకరణము,అమాత్యోత్పత్తి,ఒక అధ్యాయము. అమాత్యులుగ నెవరు తగినవారు?ఇత్యాదివిషయమిందు గలదు 5 వ ప్రకరణము. మంత్రిపురోహితోత్పత్తి. ప్రధానమంత్రికే మంత్రియని పేరు ఎవరు మంత్రిగను, పురోహితుడుగను ఉండుటకు అర్హులు? ఈవిషయమునకు సంబంధించి ఒక అధ్యాయము 6 వ ప్రకరణము, అమాత్యులను ఆ యా కార్యస్థానములందు పరిశీలించుట, ఒక అధ్యాయము 7వ ప్రకరణము గూఢపురుషోత్పత్తి, రహస్యభటులు మారువేషములతో ప్రభుత్వసంబంధము లేనివారివలె సంచరింపుచు ప్రభుత్వకృత్యములను పరిశీలించువారు గూఢపురుషులు. ఇందుకు తగినవారు, వారి కృత్యము ఒక అధ్యాయము. 8 వ ప్రకరణము ఏ యే విషయములయందు గూఢచారులు ఏ యే రూపములతో నుండవలెను? ఇత్యాదికము ఒక అధ్యాయము 9 వ ప్రకరణము - స్వవిషయమందు కృత్యాకృత్య పక్షరక్షణము ఒక అధ్యాయము. చేయదగినవారు కృత్యులు అనగా సులభముగా స్వాధీనము చేయదగినవారు. అకృత్యులు - సులభముగా స్వాధీనము చేయవగని వారు. స్వాధీనమగుటకు సాధ్యులు కానివారు ఈ కృత్యులు అకృత్యులు స్వదేశీ సంబంధమైనవారు పరదేశ సంబంధమైనవారు ఇట్లు రెండు విధములుగ నగుచున్నారు తమ దేశమందు గల కృత్యులను అకృత్యులను తన పక్షమందే యుండునట్లు రక్షించుకొనుట - 'కృత్యాకృత్యపక్షరక్షణము' అని చెప్పబడును ఇది ఒక అధ్యాయము.

శత్రుసంబంధులగు కృత్యులను అకృత్యులను స్వపక్షమందుండునట్లు ప్రయత్నించి గ్రహించవలెనను "పరవిషయే కృత్యాకృత్య పక్షోపగ్రహము" అని 10 వ ప్రకరణము,ఒక అధ్యాయమున గలదు. 11 వ ప్రకరణము మంత్రాధికారము. రాజకీయకార్యాలోచనము ఒక అధ్యాయము. 12వ ప్రకరణము దూత ప్రణిధి. దూతగా నుండదగివారల గూర్చిన ప్రకరణము ఒక అధ్యాయము. 13 వ ప్రకరణము రాజపుత్రరక్షణము. వ్యసనముల పాలుగాకుండునట్లును వినయాది సంపన్నులగునట్లును రాజపుత్రులను కాపాడుట ఒక అధ్యాయము. 14, 15 ప్రకరణములు - అవరుద్ధ వృత్తము, అవరుద్ధునియందు వృత్తము అను రెండు విషయములు ఒకే అధ్యాయమునగలవు అవరుద్ధుడు అనగా నిర్బంధితుడు రాజపుత్రుడు నిర్బంధింపబడి యెట్లు మెలగవలెను? నిర్బంధితుల విషయమై ఎట్లు చూడవలెను? అను విషయములు ప్రతిపాదింపబడినవి. 16 వ ప్రకరణము రాజప్రణిధి.రాజైనవాడు ప్రజలతో నెట్లు మెలగవలెను? దైనందినకృత్యముల నెట్లాచరించవలెను? మొదలగు విషయములు ఒక అధ్యాయము 17 వ ప్రకరణము నిశాంత ప్రణిధి. రాజగృహసంబంధమైన విషయములు గలది ఒక అధ్యాయము. 18 వ ప్రకరణము ఆత్మరక్షితకము. రాజు తనను కాపాడుకొనుట. విశ్వాసముగల భృత్యులను సేకరించుట ఆహారాదులను పరీక్షించుట అప్రమత్తతగ నుండుట మొదలగు విషయములు గలది ఒక అధ్యాయము ఇది వినయాధికరణము

మూ॥ జనపదనివేశః। భూమిచ్ఛిద్రవిధానమ్। దుర్గవిధానమ్।దుర్గనివేశః।సన్నిధాతృచేయ కర్మ। సమాహర్త్వ సముదయప్రస్థాపనమ్। అక్షపటలే గాణనిక్యాధికారః। సముదయస్య యుక్తాపహృతస్య ప్రత్యానయనమ్ । ఉపయుక్తపరీక్షా । శాసనాధికారః। కోశప్రవేశ్య

రత్నపరీక్ష । ఆకరకర్మాంతప్రవర్తనమ్ । అక్షశాలాయాం సువర్ణాధ్యక్షః । విశిఖాయాం సౌవర్ణికప్రచారః । కోష్ఠాగారాధ్యక్షః । పణ్యాధ్యక్షః। కుప్యాధ్యక్షః। ఆయుధాగారాధ్యక్షః । తులామానపౌతవమ్। దేశకాలమానమ్।శుల్కాధ్యక్షః సూత్రాధ్యక్షః । సీతాధ్యక్షః ।సురాధ్యక్షః । సూనాధ్యక్షః । గణికాధ్యక్షః। నావధ్యక్షః। గోధ్యక్ష్యః।అశ్వాధ్యక్షః హస్త్యధ్యక్షః । రథాధ్యక్షః। పత్త్యధ్యక్షః । సేనాపతిప్రచారః।ముద్రాధ్యక్షః।వివీతాధ్యక్షః సమాహర్తృప్రచారః । గృహపతివైదేహకతాపసవ్యంజనాః ప్రణిధయః । నాగరికప్రణిధిః । ఇత్యధ్యక్షప్రచారో ద్వితీయమధికరణమ్.

రెండవ అధికరణము అధ్యక్షప్రచారము. రాజ్యపరిపాలనమందు గల శాఖల విభాగము, ఆయా శాఖాధ్యక్షులు చేయదగిన పనులు మొదలగునవి యిందు నిర్ణయింపబడినవి. రాజ్యపాలనమునందు శాఖావిభాగముకంటె తొలుత గ్రామనగరారణ్యాదివిభాగము దేశవిభాగము ఆవశ్యకములు, కావున రాజ్యశాఖావిభాగము దేశవిభాగాదికము సంబంధించినవి యగుటచే నీ యధికరణమునందు ఆ ప్రకరణము లన్నియు చెప్పబడినవి, మొత్తమీ యధికరణమునందు 36 ప్రకరణములు గలవు. 1 జనపదనివేశము. ఇందు గ్రామభేదములు అందందు ఉండదగిన కార్యాలయములు పెద్దగ్రామములు అనగా చిన్న పట్టణములందు చేయవలసిన సౌకర్యములు మొదలగునవి ఒక అధ్యాయములో చెప్పబడినవి. 2 భూమిచ్ఛిద్రవిధానము.ఆటవికజంతువు లుండుటకు వాటిని పట్టుకొనుటకు తగిన వనములు అందు చేయవలసిన పనులు మొదలగునవి యిందు ఒక అధ్యాయమున చెప్పబడినవి 3 దుర్గవిధానము కోటలు కందకములు కోట బురుజులు మొదలగువాటి నిర్మాణము మొదలగునవి ఒక అధ్యాయమున గలవు. 4 దుర్గనివేశము. కోటలందు నివాసములయొక్క నిర్మాణములు ఒక అధ్యాయము. 5 సన్నిధాతృచేయకర్మ రాజ్యపాలనమునకై రాజ్యమునందును రాజులకును వలసిన భవనములను నిర్మించుట, ఆయాభవనాదులకు సంబంధించిన కార్యములు, వీటిని చేయించు నధికారి సన్నిధాత, ఆతడు చేయవగిన పని, సన్నిధాతృచేయకర్మ, ఇది ఒక అధ్యాయము 6 సమాహర్తృసముదయప్రస్థాపనమ్. బహువిధము లగు ఆదాయములను గ్రహించువాడు సమాహర్త, ఆదాయముల మొత్తము సముదయము. సమాహర్త, సముదయములోని బహువిధాదాయములను ఎట్లు గ్రహింపవలయును? ఎట్టి వ్యయము చేయవగును? వీటికిసంబంధించినప్రకరణము ఒకఅధ్యాయము 7 అక్షపటలమందు గాణనిక్యాధికారము గణనము లెక్కించుట. గాణనికుడు గణనముచేయువాడు, గాణనిక్యము లెక్కించువారి సమూహము. ఆ యా గ్రామ నగరాదులందు ఆయవ్యయాదులను గణించు వారి లెక్కలను అన్నిటిని పరిశీలించుట, వాటి నిబంధనలు మొదలగువాటికి సంబంధించిన కార్యాలయము అక్షపటలము. అందు ఏ యే శాఖల సంబంధము గలదు? గాణనికులను పరీక్షించుట ఎట్లు? మొదలగు విషయములు ఇందు ఒక అధ్యాయమున గలవు. 8 సమిష్టి ఆదాయమునందు ఉపయోగింపబడిన దాని యొక్కయు, అపహరింపబడిన దాని యొక్కయు పూరించుట ఒక అధ్యాయము, 9 ఉపయుక్తపరీక్ష, ఆ యా శాఖాధ్యక్షులు ఉపయుక్తులు, వారిని పరీక్షించుట. 10 శాసనాధికారము శాసనము లెట్లుండవలెను? ఎందులకు శాసనము చేయవలయును. మొదలగు శాసన సంబంధములగు విషయములుగల ప్రకరణము.

"ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే"

శ్రీ వెల్దండ ప్రభాకరరావు

౩

రాముడు లవుని చూడగానే యతని మనసు పరిపరివిధములు భ్రమించుచుండును. లవునకుకూడ శ్రీరాముని చూడగానే యాతనికి వశ్యమైపోయి విరోధ భావమును మరచిపోవును అది సహజమేగదా "మహనీయులయందు విలసద్గంగా తీర్థంబులం దవురీతినే మహిమం బొకండు సహజంబై యుండు నింకేమగున్" యని యర్ధాంతరన్యాసాలంకారమును విసరినాడు భవభూతి. లవుడు చంద్రకేతువు వీరెవరన (రాముని నుద్దేశించి) అందుకు చంద్రకేతువు, ప్రియవయస్యా మీరు మా తాతపాదులు, "నను తాత పాదాః" యని బహువచన ప్రయోగమువల్ల వీరిరువురికి తాత పాదులని ధ్వనించుచున్నది అందుకు లవుడు రామునికి నమస్కార మాచరించి రామాయణ కథాపురుషులలో వీరెవ్వరని యడుగును సంతోషముతో "కథందేవో రఘునందన ఏవ, దిష్ట్యా సుప్రభాతమ్ అద్య యదయం దేవో దృష్టః" యని వ్యాఖ్యానించుకొని

"తాత! ప్రాచేతసాంతేవాసీ లవో అభివాదయతే" యనును. రాము డాయుష్మంతుడా రమ్మనమని యాతని నాలింగనము జేసుకొనియెను ఈ సౌహార్దము ననుభవించిన తర్వాత కించవడి తాను చేసిన తప్పును క్షమించుమని యడిగెను రాముడు నీవు చేసిన యపరాధ మేమని యడుగగా, గుఱ్ఱముగా వచ్చిన యోధులు నాయనగారి ప్రతాపము ప్రకటింపగా విని వీరునివలె ప్రవర్తించినావని లవుడుప్రత్యుత్తర మిచ్చెను అందుకు రాముడు యది క్షత్రియుని కలంకారమేకదా యని కుమారా యని సంబోధించినాడు ఈ స్వతంత్రము నిచ్చినది భవభూతియే ఇంతలో కుశుడు భరతాశ్రమము నుండి తిరిగి వచ్చును అతడు రాముని కెఱిగి వికటముగా నడచును దానికి రాముడే మీ క్షత్రియకుమారుని పౌరుషాతిరేకమని యచ్చెరు వొందును కుశుని సౌజన్యముకూడ ప్రశంసనీయమే రఘునందనునికి పరిచయము చేయగా యాతని దర్శన మాత్రము ననే

'అహో ప్రాసాదికం రూప మనుభావశ్చ పావనః
స్థానే రామాయణ కవిర్దేవం వాచమపీ ధృత్.

యని యచ్చెరు వొందినాడు ఇట్టి గురువును మరువని శిష్యుడుండుట వల్ల వాల్మికి జన్మము సార్ధక మయినది నేపథ్యమున నున్న భవభూతి తన జన్మకూడ ధన్యమయినదని యుబ్బిఌబ్బూరినాడు ఇతడు కూడ తాత! ప్రాచేతసాంతే వాసీ కుశోఽభి వాదయతే" యనును రాము డితనినికూడ నాలింగనము చేసికొని సహజమగు పుత్రగాత్ర పరిష్వంగ సుఖము ననుభవించును రాముడు గత స్మృతులతో దుఃఖితుడు కాగా,

బాష్పవర్షేణ నీతంవో జగన్మంగళమాననం
అవశ్యా యావసిక్తస్యపుండరీకస్యచారుతాం,

ఏమిది మహానుభావా యని లవుడు శ్రీరాముని ప్రశ్నించెను దానికి కుశుడు సీతలేని రాముని జీవిత మిట్లేయని, ప్రేయసి లేకున్నచో ప్రపంచ మరణ్య సమానమని, వారిప్రేమ యపారమని, విరహసింధు వపారమని రామాయణ మెన్నడును జదువనట్టు ప్రశ్నింతువేలయని ప్రత్యుత్తర మిచ్చును రామాయణ ప్రసక్తి వచ్చుటవల్ల యందులోని భాగము నేదేని చదువుమని కుశలవులను రాము డడిగెను వారు తత్సందర్భోచితముగా తమకు జ్ఞాపకమున నున్న రెండు శ్లోకములను చదివిరి అవి వజ్రఘాత

ములవలె రామునికి దుఃఖోపకరణము లయ్యెను.

ఈవిధముగా తృతీయాంకము వలెనే షష్ఠాంకము కూడ రక్తి కట్టినది అందు యదృశ్యయగుజానకియుందుజానకితనయులు

సప్తమాంకమున వాల్మీకి రంగ స్థలమున నభినయించ దలచిన నాటకమును ప్రదర్శించును రంగస్థలము గంగాతీరము సీత సాధు చరిత్రయని ప్రజల నుద్దేశించి పలుకుటకన్న సీతా చరిత్రమును లక్ష్మణుడు పరిత్యజించి నప్పటిని ప్రదర్శించి కరుణరస ముప్పతిల్ల జేసి వారి సానుభూతిని సంపాదించినప్పుడు సీత సాధుచరిత్రయని చెప్పిన యందఱు నమ్ముదురు అందులకే యీ యంతర్నాటకము ప్రేక్షకులను చూచుచు రాముడు లక్ష్మణు నుద్దేశించి 'యంద ఱాసీనులైరా' యని ప్రశ్నించెను అంటే కుశలవులు కూడ కూర్చుండిరాయని యాతని భావము

"రా ఈ కుమార కుశలవులు కుమార చంద్రకేతువుతో సమానముగా నర్హస్థానమున కూర్చుండబెట్టదగినవారు.

లక్ష్మణుడు దేవరకీ పిల్లలమీద నున్న ప్రేమనుబట్టి యట్లే యేర్పాటు చేసినాను. ఇదిగో రాజపీఠము మీరిందుదయచేయుడు" దీనితర్వాత నాటకము ప్రారంభమగును. ఈ నాటకమును దర్శించుచున్న రాముడు, సీత గంగలో పడుచుండెననగానే లక్ష్మణుని రక్షింపుమనెను దానికి లక్ష్మణుడు 'అన్నా ఇది నాటక'మని యభయమిచ్చెను నాటకమును చూచి రాముడు మూర్ఛిల్లెను అప్పుడు గంగ, భూదేవి, సీత నాటక స్థలమునకు వత్తురు మూర్ఛిల్లిన రాముని తాకి సీత సేద దీర్చును జనకుడు, అరుంధతి, కౌసల్యా, వాల్మీకి మొదలగువారు వత్తురు నాటకము సుఖాంతముగా పూర్తియగును.

ఉత్తర రామచరిత్ర ప్రాశస్త్యమును గుఱించి వేదము వారి యభిప్రాయము నిందు బొందుపరచుచున్నాను

"ఈ నాటకమందు ప్రధానులగు స్త్రీపురుషులు ఉత్తమోత్తములును లోకాతీతులును, నాయికా నాయకులు నరత్వాభిమానమందున్నను సాక్షాత్ లక్ష్మీనారాయణులు, అంతకన్న నుత్తము లెట్లుందురు? శ్రీరాముని మించిన ధీరోదాత్త నాయకుని, సీతకన్న పతిపరాయణను ధర్మప్రవణను ఊహింపలేము. అరుంధతి,పృథ్వి, భాగీరధి,వాసంతి, ఆత్రేయి, తమస, వాల్మీకి, జనకుడు వీరి చరిత్రమును, వీరు మెచ్చిన సీతారాముల చరిత్రమును, బోధించు నీ రూపకము ఆర్యావర్తమునకు ఉత్తమోత్తముల సూక్ష్మధర్మాచరణమునకు లక్ష్యభూతముగా నున్నది.

కాళిదాసువలె భవభూతి,తండ్రిని పుత్రుని కడకుం దెచ్చియు ఆ సంబంధమును ఒక్కుమ్మడింగాక క్రమక్రమముగా వెలువరించి నాడు ఇందలి నాయికా నాయక సర్వ లోకాతిశాయి సముత్కర్షోచితముగా గ్రంథ నిర్వహణము.

దుష్యంతుడు విదూషకునితో శకుంతలా వృత్తాంత మంతయు జెప్పి పరిహాసోక్తులను నిజమని నమ్మకుమని బొంకినాడు. రాముడిట్లు బొంకలేదు శకుంతల మహాపతివ్రత యయ్యును దుష్యంతుని యనార్యా యని తిట్టినది సీత యెక్కడైనను కుపితోక్తి వచించలేదు సీత జగద్వంద్య యనియు తనకు ఆమెయందు భక్తి యనియు అరుంధతి వక్కాణించుచున్నది కావున శాకుంతలము గంగయగునేని, ఉత్తర రామచరిత్ర మందాకిని యగును కాళిదాసు యా గంగను సారాయి సాక్ష్యముగా సఖ్యము చేయుట లోనగు నోడిక వాగులతోజేర్చి మర్త్యమునం బాఱుదల జేయించినాడు భవభూతి మందాకినిని ఆ యౌన్నత్యమున కర్హముగా కల్మషములు చేరనీయక స్వర్గమందే ప్రవహింప జేసినాడు కవనమును తత్తదను గుణమైనందున యుత్తరరామ చరిత్ర నాటక రాజమై వెలుంగుచున్నది"

కుందమాలకునుత్తరరామచరిత్రకు చాలా వరకు పోలిక లున్నవనియు, భవభూతి కవిత్వమున కేమాత్రము తీసిపోదని కొందఱి విమర్శకుల యభిప్రాయము కుందమాలను రచించినది దిజ్నాగుడు మరికొంద ఱుత్తర రామ చరిత్రకును, కుందమాలకును పోలిక లుండుటచే నుత్తరరామ చరిత్ర దానిని చూచిన తర్వాత వ్రాయబడెనని యభిప్రాయ పడుచున్నారు దిజ్నాగు డైదవ శతాబ్దాది వాడని కీ. శే మానవల్లి రామకృష్ణకవిగా రభిప్రాయ పడిరి ఇక కుందమాలకు నుత్తర రామచరిత్రకుగల తారతమ్యముల నుగ్గడించెదను.

1) రెండు నాటకములు యథామాతృకలుగావు ఇరువురు నలతి మార్పులు గావించినారు

2) కుందమాలలో మొదటి యంకమున సీతా వివాసనము ప్రత్యక్షముగా చూపింపబడినది లక్ష్మణుడామె నరణ్యమందు గంగానది సమీపమున వదలెను ఉత్తరరామ చరిత్రమున మొధటి యంకము చిత్రపట దర్శనముతో ప్రారంభమైనది అయినను కుందమాల యుత్తరరామ చరిత్రవలె రక్తి కట్టలేదు

3) కుందమాలలో గంగా సమీపమున వదలబడిన సీత, వాల్మీకి యాశ్రయ మిచ్చి సుఖప్రసూతయైన పిదపగూడ యందేయుండినది కాని యుత్తరరామ చరిత్రలో సీత గంగాప్రవేశము చేసి, పుత్రులనుకన్న పిదప లవకుశులు విద్యాబుద్ధులు గరుపుటకు వాల్మీకికి అప్పగింపబడిరి

(4) సీత మల్లెపూల మాలలు కట్టుటయని దిజ్నాగుని భావము అందుకే సీత తాను ప్రసవించునంతవరకు ప్రతిదిన మొక కుందమాలను సమర్పింతునని వాగ్దానము చేసియుండెను రాముడు గోమతీ తీరమునకు వచ్చినప్పుడొక కుందమాల యతని చెంతకు వచ్చును ఆ కుందమాల గ్రథనము చిరపరిచితమని సీత జీవించియే యున్నదని రామునికి విశ్వాసము కల్గును ఆ కుందమాల ననుసరించి వెళ్ళగా యొక దీర్ఘికవద్ద యాతడు మూర్ఛిల్లును సీత యా దీర్ఘిక మహాత్మ్యమువల్ల నొరులకు కానిపించక రాముని సేద దీర్చెను రాముని వెంట లక్ష్మణుడు విదూషకుడు కూడ యున్నారు ఇందు సీత చేలము రాముని చేతికి వచ్చుట, రాముని యుత్తరీయము సీతకు పోవుట జరుగును మరల యీ సీత వస్త్రమును చూచి పరులేమందురో యని భయపడినాడు ఇది కుందమాలకారుడు చేసిన నాటకము భవభూతి యిట్లు చేయలేదు శంబూకునివధ నెపమున రాముని దండకారణ్యమునకు రప్పించి యందు తమసా సహితముగ విహరించుచున్న సీతకు రాము డగుపించును పంచవటీ దర్శనమున రాముడు ముమ్మారు మూర్ఛిల్లి నపుడు సీతాపాణి పద్మసంస్పర్శచే సేదదీరును, రాముడు శంబూకుని వధించిన పిదప యేకాకిగా వచ్చెను తమస రాముని హృదయమును గ్రహించుచుండగా సీత కూరట గల్గెను. అంతేగాక కుందమాలలో విదూషకుడు సీతను ప్రత్యక్షముగా చూచెను అతడు రామభద్రునకు చెప్ప నుంకించుచుండగా యాతడు వినలేదు వినినచో నాటకము రెండంకములతో పూర్తియయ్యేడిది. కుందమాల సీత సాంద్రారణ్య భయవిహ్వల కాని భవభూతి సీతారాములకు 'యత్రద్రుమా అపి మృగా అపి బాంధవామే, యాని ప్రియా సహచరశ్చిర మధ్యవాత్సం' భవభూతి నాటక మందలి తృతీయాంకము కరుణ రసౌన్నత్యమును పొందినట్లు కుందమాల ద్వితీయాంకము రక్తి కట్టలేదు

5) రామాయణము విన్పించవచ్చిన లవకుశులు శ్రీరామచంద్రుని సింహాసనముపై కూర్చొనరు కుందమాలలో వారు రామదర్బారులో రాజసింహాసనముపై కూర్చుండినట్లు, యన్యులు సింహాసన మధిష్ఠించినచో సర్పములు కాటువేయునని, యట్లు కాలేదు

కనుక వారు రామపుత్రులనియో సూర్య వంశ సంబంధీకులో యని చూచాయగా తెలిసినది రామునికి

భవభూతి యిట్టి యనుమానములకు తావీయలేదు తండ్రియని తెలియకయే పితృభక్తి, కుమారుడని తెలియకయే పుత్రవాత్సల్యము, భ్రాతయని తెలియకయే సహోదరానురాగము భవభూతిపాత్రల కవ్యాజానురాగము కల్గినది భవభూతి పాత్రలు సహజములు. కుందమాల పాత్రలు కృత్రిమములు

రెండు నాటకములు మోదాంతములే యైనను జీవలోక పరిభావము నోర్వజాలని సీత మరల పాతాళమున కేగినట్లే కుందమాలలో ధ్వనించుచున్నది ఉత్తరరామ చరిత్రలో సీత సాక్షాత్తుగా నాటక రంగమునకు వచ్చి వాల్మీకి విరచిత నాటకమును చూచి మూర్ఛిల్లిన రాముని సేదదీర్చెను భవభూతి సీతకు తన కుమారులు దూరముగా నుండిరి కాని కుందమాల సీత, తన కుమారులు వాల్మీకి యాశ్రమమందే యుండిరి కుందమాలకారు డిన్ని మార్పులు గావించియు తన నాటకమును రసవంతముగ చేయలేకపోయినాడు దిఙ్నాగుడు గొప్పకవియని కవిత్వము తెలుపుచున్నది కాని యీ నాటకమందతని ప్రతిభా విశేషము జాలువారలేదు రామాయణ నాటకములందు కుందమాల యొక నాటక మనుట తప్ప, సాదృశ్య దృష్టిలో నుత్తర రామచరిత్రకు సాటిగాదు శబ్దాడంబర మున్నను భవభూతి ప్రౌఢ కవిత్వము ముందు కుందమాల దిగదుడుపే

ఇక శాకుంతలమును నుత్తరరామ చరిత్రమును పరిశీలింతము

రెండునాటకములలోను నాయిక లరణ్యావాసమందే యుండిరి వారికి కలిగిన సంతానమే వారి పునస్సమాగమమునకు కారణమైనది వియోగము జరిగిన పిమ్మటనే సీతకు, శకుంతలకు సంతానప్రాప్తి కలిగెను అయితే రామునకు సీతావర్తన మేమియు తెలియదు దుష్యంతునికి తన భార్యసంగతి, తన కుమారుని సంగతి తెలియును శాకుంతల నాయకుడు కాముకుడు ఉత్తర రామచరిత్ర నాయకు డేకపత్నీవ్రతుడు, కర్తవ్య పరాయణుడు శాకుంతలమున తొలుతటి యుద్వేగము, నుత్తరరామ చరిత్రలో సుపరిచితమైన ప్రేమయొక్క గంభీరభావము కాళిదాసుని దుష్యంతుడు,శకుంతల నచిరకాలములోవిస్మరించు, భవభూతి రాముడు సర్వసర్వావస్థలయందును సీతనే స్మరించును దుష్యంతుడు బహువల్లభుడు, రాము డేకపత్నీవ్రతుడు

ఈ కారణముల చేతనే 'ఉత్తరే రామ చరితే భవభూతిర్విశిష్యతే, యనునా భాణకము వాడుకలోనికి వచ్చినది నీలకంఠ దీక్షితుడు భవభూతి నీగతి కీర్తించినాడు

"ప్రాచేతసేన యానీతాపాలితా భవభూతినా
సర్వతశ్చర్వ్యతే వాణీసైవాద్య కవిమానిభిః"

ఇందాతడు కేవలము వాల్మీకిని భవభూతినిమాత్రమే స్మరించి వారు వాణీ స్వరూపులని నిరూపించినాడు ఉత్తరరామ చరిత్రలోని సూక్తులు కొన్ని నుడివి యీ వ్యాసమును ముగింతును

1) యథాస్త్రీణాం తథావాచాం సాధుత్వే దుర్జనోజనః
2) ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోను ధావతి
3) నైసర్గి కేసురభిణః కుసుమస్య సిద్ధా మూర్ధ్ని స్థితిర్నచరణై రవతాడనాని
4) తీర్థోదకం చ వహ్నిశ్చనాన్యత శ్శుద్ధిమర్హతః
5) సతాం కేనాపి కార్యేణ లోకస్యారాధనం మతం
6) శ్రితాసి చందన భ్రాంత్యా దుర్విపాకం విషద్రుమమ్
7) సతాంసద్భిస్సంగః కథమపిహి పుణ్యేన భవతి

8) లోకోత్తరాణాం చేతాంసి కోహివిజ్ఞా
తు మర్హతి
9) తత్తస్యకిమపి ద్రవ్యం యోహియస్య
ప్రియోజనః
10) సాంసారికేషు విషయేషు వయం
రసజ్ఞాః
11) పుటపాక ప్రతీకాశో రామస్య
కరుణో రసః
12) గుణాః పూజాస్థానం గుణిషు నచ
లింగం నచవయః
13) పురంధ్రీణాం చిత్తం కుసుమ సుకు
మారం హిభవతి
14) మహార్ఘస్తీర్థా నామివ హిమహతాం
కోప్యతిశయః
15) ద్రవతిచ హిమరశ్మా వుద్గతే చంద్ర
కాంతః
16) హృదయంచైవ జానాతి ప్రీతియో
గం పరస్పరం
17) తేజస్తే జసి శామ్యతు
18) కోనామ పాకాభి ముఖస్యజంతుర్ద్వా
రాణి దైవస్య పిధాతు మీష్టే
19) రహస్యం సాధూనా మనుపధి
విశుద్ధం విజయతే.
20) సత్సంగజాని నిధనాన్యపి తార
యంతి
21) ధవళ మధుర ముగ్ధా దుగ్ధ కుల్యేవ
దృష్టిః
22) అహేతుః పక్షపాతో యస్తస్యనాస్తి
ప్రతిక్రియా
సహిస్నేహాత్మ కస్తంతు రంతర్భూ
తాని సీవ్యతి.

ఇట్టి యుత్తమ నాటకమునకు గా రకుగా
భరత వాక్యముగా
"తామేనాం పరిభావయంత్వ భినయైర్వి
న్యస్త రూపాంబుధా
శ్శబ్ద బ్రహ్మావిదః కవేః పరిణతాం ప్రా
జ్ఞస్యవాణీ మిమామ్"
అని వ్రాసుకొనినాడు 'ఏనామ కేచిత్'
యని మాలతీమాధవాది యందు
వ్రాసిన శ్లోకమునకు సమానమగు నుజ్జీ
యీ భరత వాక్యము.

★

ఆంధ్రతర్క సంగ్రహము

శ్రీ కుప్పా బైరాగిశాస్త్రి

౪

సర్వవ్యవహారహేతుః బుద్ధిః జ్ఞానం

సర్వవ్యవహారములకు కారణము జ్ఞానము. "అర్థం బుద్ధ్వాశబ్దరచనా" (అర్థమును తెలుసుకొని శబ్దప్రయోగము చేయవలయును)అను న్యాయముచేత యేశబ్దప్రయోగమైనను అర్థము తెలుసుకున్న తరువాతనే జరుగుచుండుటచేత అర్థము తెలుసుకొనుట అనగా అర్థజ్ఞానమే గాన, జ్ఞానము ఉన్న తరువాత శబ్దప్రయోగము జరుగుచున్నది. అందుచేత శబ్దప్రయోగమునకు జ్ఞానము కారణము. వ్యవహార మనగా శబ్దప్రయోగము. సర్వశబ్ద ప్రయోగములకు కారణము-జ్ఞానము సర్వవ్యవహారమందలికార్యతచే నిరూపితమైన కారణతకలిగియుండుట జ్ఞానమునకు లక్షణము-సర్వవ్యవహారమందలి కార్యత యేదియన సర్వవ్యవహారముల యందు ఉన్న కార్యత, దానిచేత నిరూపితమైన కారణత జ్ఞానమందు ఉండుటచే ఆకారణత కలిగియుండుట జ్ఞానమందు ఉండుటచేత లక్షణసమన్వయము అయినది. సర్వవ్యవహారములనగా, లోకములో అన్ని వ్యవహారములు(శబ్దప్రయోగములు) అనియా లేకసర్వం (సర్వము) అను శబ్దప్రయోగము మాత్రమా ఎటుల చెప్పినను యీ లక్షమునకు దోషములేవచ్చును. ఎటులననగా, సమస్తశబ్దప్రయోగములకు కారణమైన జ్ఞానము లోకములో అప్రసిద్ధము. ఘటము అను జ్ఞానము ఘటము అను శబ్దప్రయోగమును గురించి కారణము పటము (వస్త్రము) అను జ్ఞానము పటము అను శబ్దప్రయోగమును గురించి కారణము. గాన అన్ని శబ్ద ప్రయోగములను గురించి కారణమైన జ్ఞానము ఒకటి లేదుగనుక లక్షణములో సమస్తశబ్దప్రయోగముల యందలి కార్యతచే నిరూపితమైన కారణత కలిగియుండుట అని చెప్పిన యే జ్ఞానమందు యీ లక్షణములేదు గనుక అసంభవము అను దోషము వచ్చును. లక్ష్యమైన దేనియందు లక్షణము ఉండకపోవుట అసంభవమని చెప్పుదురు. ఆ దోషమును హరించుటకొరకు సర్వము అను శబ్దప్రయోగమందలి కార్యతచే నిరూపితమైన కారణత కలిగియుండుట అను లక్షణముచెప్పిన సర్వము అను జ్ఞానమందు లక్షణ సమన్వయముఅగును అందుచేత అసంభవ రూపదోషములేదు. అయినప్పటికి ఘటము అను జ్ఞానమందు యీ లక్షణము సమన్వయము కాకపోవుటచేత లక్ష్యములలో ఒకటి అయిన ఘటజ్ఞానమందు అవ్యాప్తి వచ్చును. అందుచేత లక్షణము సర్వము అను వ్యవహారమందలి యే కార్యతకలదో ఆ కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమైన దానియందలి జాతి కలిగియుండుట జ్ఞానమునకు లక్షణము అని చెప్పవలయును. ఇప్పుడు అవ్యాప్త్యాదిదోషములు రావు.

సర్వము అను వ్యవహారమందలి కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయము ఏదియన సర్వము అను జ్ఞానము, దానియందలి జాతి ఏదియన జ్ఞానత్వము అను జాతి ఆజాతి ఘటజ్ఞానమందు సర్వము అను జ్ఞానమందు మొదలగు అన్ని జ్ఞానములయందు ఉండుటచేత లక్షణసమన్వయము అయినది.

తద్ద్వివిధం స్మృతిరనుభవశ్చేతి.

ఆ జ్ఞానము స్మృతిత్వ అనుభవత్వరూపములైన రెండు విభాజకధర్మములలో యేదియో ఒకటి కలిగినటువంటిది ద్వివిధం అను పదమునకు సమాసము ఎటులననగా ద్వేవిధేయస్యతత్ ద్వివిధం,అనిబహువ్రీహిసమాసముచెప్పవలయును. బహువ్రీహిసమాసములో ఉత్తరపదమునకులక్షణము చెప్పుకొనిపూర్వపదమును తాత్పర్యగ్రాహకముగా చెప్పవలయును అందుచేత ద్వివిధం అను సమస్తపదములో ఉత్తరపదమైన విధం అనుదానికి రెండు విభాజక ధర్మములలో ఒకటి కలిగినటువంటిది అని లక్ష్యార్థము చెప్పవలయును ద్వి అను పదము

రెండు విభాజకధర్మములలో ఒకటి గలది అని అర్థము చెప్పుటకు తాత్పర్యమును గ్రహింప చేయునది గాని అర్థములేదు స్మృతిపదము స్మృతిత్వమును అనుభవపదము అనుభవత్వమును బోధించును. స్మృతిత్వము అనుభవత్వమువిభాజకధర్మములలోఅభేదసంబంధముచే అన్వయించును. గాన స్మృతిత్వ అనుభవత్వములతో అభిన్నములైన యే రెండు విభాజక ధర్మములు గలవో ఆ విభాజక ధర్మములలో ఒకటి గలది జ్ఞానము అని అర్థము విభజించి చెప్పుకొనవలయును.

మూ॥ సంస్కారమాత్ర జన్యం జ్ఞానంస్మృతిః.

సంస్కారమాత్రము చేతనే పుట్టిన జ్ఞానము స్మృతి అని చెప్పబడును. ఒక వస్తువును మనము చూచిన వెంటనే కలుగు జ్ఞానమును అనుభవము అని అందుము. ఆ అనుభవము రెండు క్షణములు మాత్రమే ఉండి తదుపరి నశించును. అప్పుడు సంస్కారము పుట్టును. ఆత్మయందు కాలాంతరమందు ఉద్బోధక సామగ్రి వలన సంస్కారము ఉద్బుద్ధమై స్మృతిని కలుగజేయును ఉదాహరణము - ఏనుగును దానిమీదనున్న మావటివానినిచూచిన తరువాత కొద్దిరోజులకు మావటివానిని ఒంటరిగా చూచినంతమాత్రమున ఏనుగుయొక్క స్మృతి కలుగును, ఏనుగు ఆకాలమున లేదు గాన ఏనుగ ప్రత్యక్షము అని చెప్పగూడదు. విషయమైన ఏనుగ లేనప్పుడు ప్రత్యక్షము గూడా ఉండదు. అప్పుడు కలిగిన జ్ఞానమును స్మృతి అని చెప్పుదురు. దానికి కారణము మొదట ఏనుగును మావటివానిని చూచినప్పుడు కలిగిన ప్రత్యక్షము వలన కలిగిన సంస్కారమే. ఆ సంస్కారము "ఏకసంబంధి జ్ఞానం అపరసంబంధిస్మారకం" ఒక సంబంధి జ్ఞానమును రెండవసంబంధిస్మృతిని కలుగజేయును అను న్యాయముచేత ఒక సంబంధి అయిన మావటివాని జ్ఞానము సహకారిగా గలదై ఏనుగ యొక్క స్మృతిని కలుగజేయుచున్నది. ఏనుగను ఎక్కిన మావటివానికి ఏనుగకు గల సంబంధము సంయోగరూపమైనది, ఆసంయోగ సంబంధమునకు ఏనుగ ఒకసంబంధి (సంబంధము గలది) మావటివాడు ఒక సంబంధి. ఒక సంబంధి అయిన మావటివానియొక్క జ్ఞానము సహకారిగా గల సంస్కారము రెండవ సంబంధి అయిన ఏనుగయొక్క స్మృతిని కలుగజేయుచున్నది.

అందుచేత సంస్కారము వలన పుట్టినదియు, సంస్కారము కంటె వేరయిన దాని వలన పుట్టనిదియు,జ్ఞానము అయినదియు స్మృతియని చెప్పబడును.

స్మృతికి లక్షణము ఏమియన, సంస్కారము వలన పుట్టుటయు సంస్కారము కంటె యితరమైన దానివలన పుట్టకపోవుటయు జ్ఞానమగుటయు.

మావటివానిని చూచిన తరువాత కలిగిన ఏనుగ స్మృతియందు సంస్కారము వలన పుట్టుటయు, సంస్కారముకంటె ఇతరము వలన పుట్టకపోవుటయు, జ్ఞానమగుటయు కలదుగాన లక్షణ సమన్వయమైనది కేవల జ్ఞానమగుటయే స్మృతికి లక్షణముగా చెప్పిన అనుభవమందు అతివ్యాప్తి వచ్చును అందు కొరకు విశేషణములు అవసరము సంస్కారము వలన పుట్టుటయే లక్షణముగా చెప్పిన సంస్కార ధ్వంసయందు అతివ్యాప్తి వచ్చును. ధ్వంసను గురించి ప్రతియోగి కారణముగాన సంస్కార ధ్వంసలో ప్రతియోగి యయిన సంస్కారము కారణమగుచున్నది. ఆ అతివ్యాప్తి వారణ కొరకు జ్ఞానమగుటయ విశేష్యము అవసరము. సంస్కారమువలన పుట్టుటయు జ్ఞానమగుటయు స్మృతికిలక్షణముగా చెప్పిన ప్రత్యభిజ్ఞయందు అతివ్యాప్తివచ్చును "సోయందేవదత్తః"కాశీలో చూచిన దేవదత్తుడు ఇతడే అనునది ప్రత్యభిజ్ఞ. సంస్కారముకంటె ఇతరమైన దానివలన పుట్టకపోవుట అను విశేషణము గూడా లక్షణములో ఉన్నచో సోయం దేవదత్తః అను ప్రత్యభిజ్ఞ సంస్కారముకంటె వేరయిన ఇంద్రియమువలన కలుగుచుండుటచేత, పుట్టకపోవుట అను విశేషణము లేనందున అతి

వ్యాప్తి నివారించబడుచున్నది. సంస్కారము వలన పుట్టుటయు, సంస్కారేతరముచే పుట్టక పోవుటయు జ్ఞానమగుటయు స్మృతికి లక్షణమని చెప్పబడును.

మూ॥ తద్భిన్నం జ్ఞానమనుభవః

తత్ అనగా స్మృతి. స్మృతికంటె వేరయినదియు జ్ఞానమయినదియు అనుభవము. ఒక పాత్రను. చూచిన తరువాత ఇది ఒకపాత్ర అను ప్రత్యక్షము కలుగును. ఆ ప్రత్యక్షమందు జ్ఞానమగుటయు స్మృతికంటె వేరగుటయు కలదుగాన లక్షణ సమన్వయము అయినది. జ్ఞానమగుటయే లక్షణముగా చెప్పిన స్మృతియందు అతివ్యాప్తి. స్మృతికంటె వేరగుట అను విశేషణము స్మృతియందు లేదు గనుక అతివ్యాప్తిలేదు. అంతమాత్రమే లక్షణముగా చెప్పిన ఘటమందు అతివ్యాప్తి జ్ఞానమగుట అనువిశేషణము ఘటమందు లేదుగాన అతివ్యాప్తి లేదు.

మూ॥ సద్వివిధః యథార్థోఽయథార్థశ్చేతి। సః = ఆ అనుభవము ద్వివిధః ద్వే విధేయస్య సఃద్వివిధః, విధాశబ్దమునకు విభాజక ధర్మద్వయములో ఏదోఒకటి కలిగినటువంటిది అను లక్షణముచేత అర్థము చెప్పుకొనవలయును. ద్వి అను పదము పైవిధముగా విధాశబ్దమునకు అర్థము చెప్పవలయును అను తాత్పర్యమును కలుగచేయును. యథార్థ పదమునకు యథార్థత్వము అని అర్థము. అ యథార్థ పదమునకు అయథార్థత్వము అని అర్థము. యథార్థత్వము అయథార్థత్వము అభేద సంబంధముచే విభాజక ధర్మద్వయమందు అన్వయించును. గాన యథార్థత్వ అయథార్థత్వ రూపమైన యే విభాజక ధర్మద్వయము గలదో ఆ విభాజక ధర్మద్వయములో ఏదోఒక ధర్మముగలది ఆ అనుభవము, అనిశాబ్దబోధ చెప్పవలయును యథార్థానుభవమునకు లక్షణము చెప్పుచున్నాను.

మూ॥ తద్వతి తత్ప్రకారకానుభవో యథార్థః

తద్వతి = ఆధర్మము కలదానియందు తత్ప్రకారకానుభవః = ఆ ధర్మము విశేషణము గాగల అనుభవము యథార్థానుభవము-వెండిని చూచి ఇది వెండిఅను (నిజమైన) యథార్థ అనుభవము కలిగినప్పుడు ఆ అనుభవములో ఇది అనునది విశేష్యము, వెండి అనినప్పుడు వెండి అగుట అనునది విశేషణము లేక ప్రకారము. ప్రకారమందు ప్రకారత అను ధర్మముండును ప్రకారత విశేషణతలు సమానార్థకములు. విశేష్యమందు విశేష్యత ఉండును, ప్రకారతా నిరూపితము విశేష్యత. వెండిఅగుటయందలి ప్రకారతచే నిరూపితమైన విశేష్యత వెండియందు గలదుగాన వెండినిచూచి ఇది వెండిఅను యథార్థానుభవమందు లక్షణ సమన్వయము అయినట్లే. యథార్థానుభవమునకు సామాన్య లక్షణ మేమన ఆ ధర్మము కలదానియందలి విశేష్యతచే నిరూపకమై, ఆ ధర్మమందలి ప్రకారతచే నిరూపకమై అనుభవమగుట. వెండినిచూచి ఇదివెండి అను అనుభవము యథార్థానుభవము. ఇది యను పదార్థమందలి విశేష్యతా నిరూపకమై వెండిఅను పదార్థమైన వెండి యగుటయందలి ప్రకారతా నిరూపకమై అనుభవమగుట, ఇది వెండియని యథార్థజ్ఞానమందు కలదు గాన లక్షణ సమన్వయమైనది.

మూ॥ సైవప్రమే త్యుచ్యతే.

ఆ యథార్థానుభవమే ప్రమయని చెప్పబడును.

మూ॥ తదభావవతి తత్ప్రకారకానుభవోఽయథార్థః.

తదభావవతి = ఆ ధర్మముయొక్క అభావము కల దానియందు (ఆ ధర్మము లేనిదానియందు) తత్ప్రకారకానుభవః = ఆధర్మము విశేషణము గాగల అనుభవము. అయథార్థః = అయథార్థానుభవమని చెప్పబడును.

తదభావవతి అనుచోట సప్తమీ విభక్తికి విశేష్యత్వము అర్థము. విశేష్యత్వము నిరూపకత్వ సంబంధముచే అనుభవమందు అన్వయించును. తత్ప్రకారకః అనగా దానియందలి ప్రకారతా నిరూపకము అని అర్థము.

ఆధర్మాభావముకలదానియందలి విశేష్యతకు నిరూపకమై ఆ ధర్మమందలి ప్రకారతకు నిరూపకమైన అనుభవము అయథార్థానుభవము.

ముత్యపుచిప్పను చూచి ఇది వెండిఅని అను కున్నవానియొక్క ఇదివెండి అను అయథార్థానుభవమందు లక్షణ సమన్వయము చేయవలయును.

ముత్యపు చిప్పను చూచి ఇది వెండి అను కున్నప్పుడు ఇది అను పదమునకు ముత్యపు చిప్ప అని అర్థము. ఇది అను పదముయొక్క అర్థము విశేష్యము వెండిఅగుట అనునది విశేషణము. అయథార్థ లక్షణములో అధర్మము అనునప్పుడు విశేషణమైన ధర్మమును తీసుకొనవలయును గాన ప్రస్తుతములో విశేషణమైన ధర్మము వెండిఅగుట అనునది యీ వెండిఅగుట అనునది వెండియందు ఉండును గాని ముత్యపు చిప్పయందు ఉండదు. ముత్యపు చిప్పయందు వెండిఅగుట అనుధర్మముయొక్క అభావము కలదు వెండి అగుట అను ధర్మము యొక్క అభావముకల ముత్యపుచిప్ప యందలి విశేష్యతకు నిరూపకమైనదిన్నీ వెండియగుట యందలి విశేషణకు నిరూపకమైనదిన్నీ అనుభవమైనదిన్నీ ముత్యపు చిప్పను చూచి ఇది వెండిఅను అయథార్థానుభవమందు ఉండుటచేత లక్షణ సమన్వయమైనది.

మూ॥ సైవ అప్రమే త్యుచ్యతే.

ఇదియే అప్రమాఅని అయథార్థానుభవమని చెప్పబడును

మూ॥ యథార్థానుభవ శ్చతుర్విధః, ప్రత్యక్షాను మిత్యుపమితి శాబ్దభేదాత్.

చతుర్విధః అనుచోట విధాశబ్దమునకు నాలుగు విభాజక ధర్మములలో యేదియో ఒక విభాజక ధర్మము కలదిఅని అర్థము. చతుః అనుపదము ఇటుల అర్థము చెప్పుకొనవలయును అను తాత్పర్యమును కలుగజేయును. ప్రత్యక్షాను మిత్యుపమితి శాబ్దభేదాత్ అనునప్పుడు భేదశబ్దమునకు అన్యోన్యా భావము అర్థము. పంచమీ విభక్తికి ప్రయోజ్యత్వము అర్థము. ప్రత్యక్షముయొక్క అనుమితియొక్క ఉపమితియొక్క శాబ్దముయొక్కయే అన్యోన్యాభావములు కలవో ఆ అన్యోన్యాభావ ప్రయోజ్యమైనయే నాలుగు విభాజక ధర్మములు కలవో ఆ నాలుగు విభాజక ధర్మములలో ఏదియో ఒక ధర్మము కలది యథార్థానుభవము అని శాబ్దబోధ.

మూ॥ తత్కారణమపి చతుర్విధం ప్రత్యక్షాను మానో పమానశబ్ద భేదాత్.

యథార్థానుభవ కరణములున్నూ ప్రత్యక్షమని అనుమానమని ఉపమానమని శబ్దమని నాలుగు విధములు. లోగడ చెప్పినట్లుగా ప్రత్యక్షముయొక్క అనుమానముయొక్క ఉపమానముయొక్క - శబ్దముయొక్కయే అన్యోన్యాభావములుకలవో ఆ అన్యోన్యాభావ ప్రయోజ్యమైనయే నాలుగు విభాజక ధర్మములుకలవో ఆ విభాజక ధర్మములలో యేదియోఒకధర్మము కలది యథార్థానుభవముయొక్క కరణము. అని శాబ్దబోధ.

మూ॥ అసాధారణకారణం కరణం.

కరణము అనగా ఏమియో చెప్పుచున్నాను. అసాధారణమను మూలములో వ్యాపారవత్ అనిగూడా జేర్చవలయును.వ్యాపారవత్ అయిన అసాధారణకారణము కరణము అనబడును. కుండను గురించి కఱ్ఱకరణము. కుమ్మరివాడు చక్రముమీద మట్టిని ఉంచి కఱ్ఱతో ఆ చక్రమును త్రిప్పి చక్రము తిరుగుచుండగా చక్రము మీదనున్న మట్టిని కుండగా తయారుచేయును. కఱ్ఱవలన చక్రమును త్రిప్పును చక్రము తిరుగుటవలన కుండ తయారగును. ఇందులో కఱ్ఱవలన చక్రము తిరుగుట దానివలన కుండ తయారగుట సంభవించుచున్నవి. చక్రము తిరుగుట కఱ్ఱవలన పుట్టుచూ కుండను పుట్టించుచున్నది అనగా కుండకు కారణమగుచున్నది కఱ్ఱవలన పుట్టిన చక్రభ్రమణము (తిరుగుట)చే కలిగిన కుండకు కఱ్ఱగూడా కారణమే. అనగా కఱ్ఱవల్ల చక్రభ్రమణము కలుగుచున్నది. కుండ కలుగుచున్నది. చక్రభ్రమణము కఱ్ఱవలనపుట్టి (జన్యమై) కఱ్ఱవలన పరంపరగా పుట్టినకుండకుకారణమగుచున్నది. (జనకమగుచున్నది) అందుచే తజ్జన్యము, తజ్జన్యజనకము భ్రమణము. తత్ అనగా కఱ్ఱ, తజ్జన్యమనగా కఱ్ఱ

వలన పుట్టుట. తజ్జన్యజనకము అనునప్పుడు తత్ అనగా కఱ్ఱయే తజ్జన్యము ఆ కఱ్ఱవలన పుట్టినది పరంపరగా కుండ దానికి జనకము అనగా కారణమైనది భ్రమణము. గాన తజ్జన్యమై తజ్జన్యజనకమైనది భ్రమణము. ఇదియే వ్యాపార మనగా తజ్జన్యత్వే సతి తజ్జన్యజనకత్వం వ్యాపారత్వం. అసాధారణ కారణమనగా కార్యత్వముకంటె అతిరిక్తమైన ధర్మముచే అవచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమగుట. కార్యత్వముకంటె వేరయిన కుండఅగుట అను ధర్మముచే అవచ్ఛిన్నమైన కుండయందు యే కార్యత గలదో ఆ కార్యతచే నిరూపితమైన కారణత దండమందు (కఱ్ఱయందు) కలదు గాన అసాధారణ కారణమై లోగడ చెప్పిన తజ్జన్యమై తజ్జన్య జనకమై రూప వ్యాపారమైన భ్రమణముగూడా కలిగియున్నందున కుండను గురించి కరణమైన దండమందు వ్యాపారవత్తుఅయి అసాధారణ కారణమగుట కలదుగాన లక్షణ సమన్వయము అయినది.

మూ॥ కార్యనియతపూర్వవృత్తి కారణం

కరణ లక్షణములో కారణ పదము కలదు. ఆ కారణము ఏమియనగా చెప్పుచున్నారు కార్యనియతమని.

కార్యనియతమై కార్యపూర్వవృత్తి అయినది కారణము. కార్యపూర్వవృత్తి అనగా కార్యముకంటె ముందు ఉండుట - నియతము అనగా వ్యాపకము, వ్యాపకత్వమనగా, దాని ఆశ్రయమందుఉన్న అభావమునకు ప్రతియోగి కాకపోవుట. కుండకు కారణమైన దండమందు కుండ పుట్టక పూర్వమందు ఉండుట అను కార్య పూర్వవృత్తి అగుట అను లక్షణము పట్టినది. అటులనే కార్య నియతత్వముగూడా సమన్వయము చేయవలయును.

దాని అధికరణము (ఆశ్రయము) అనగా కుండయొక్క ఆధారము కపాలములు అక్కడ ఉన్న అభావము కఱ్ఱయొక్క అభావముగాదు. కపాలములయందు కఱ్ఱ స్వజన్య భ్రమజన్య భ్రమవత్తా సంబంధముచేత ఉన్నది. స్వపదమునకు కఱ్ఱ స్వజన్య అనగా కఱ్ఱవల్లను పుట్టినది చక్రభ్రమణము దానివల్ల కపాలముల (చిల్లపెంకులు) భ్రమణము కలుగును ఆ భ్రమణము క్రియగాన కపాలములయందు ఉండును. ఆ స్వజన్య భ్రమజన్య భ్రమవత్తా సంబంధముచేత కఱ్ఱ కపాలములయందు ఉన్నది. అక్కడ ఉన్న అభావము వస్త్రాదుల అభావము. దానికి ప్రతియోగులు వస్త్రాదులు. అప్రతియోగి కానిది దండము. గాన కార్యనియతమై కార్యపూర్వవృత్తి గూడా అయినందున ఘటకారణమైన దండమందు లక్షణ సమన్వయమైనది. కారణ లక్షణములో కార్యపదము ఘటితమై యున్నది. ఆ కార్యమనగా యేమిటో చెప్పుచున్నారు

మూ॥ కార్యం ప్రాగభావ ప్రతియోగి

కుండ తయారుకాక మునుపు "ఇహఘటో భవిష్యతి" ఇప్పుడు ఘటము తయారగును అను ప్రతీతి సిద్ధమైనది ఘటముయొక్క ప్రాగభావము. దానికి ప్రతియోగి ఘటము. గాన ప్రాగభావమునకు ప్రతియోగి యగుట కార్యతకు లక్షణము. ఇటువైన ఘటము పుట్టును అను ప్రతీతి సిద్ధమైన ఘటప్రాగభావమునకు ప్రతియోగి ఘటము గాన కార్యమైన ఘటమందు లక్షణ సమన్వయము అయినది,

మూ॥ కారణం త్రివిధం సమవాయి అసమవాయి నిమిత్త భేదాత్.

సమవాయముయొక్క అసమవాయము యొక్క నిమిత్తముయొక్క అన్యోన్యాభావములవల్ల ప్రయోజ్యమైన మూడు విభాజక ధర్మములలో ఏదియో ఒక ధర్మము గలది కారణము అని శాబ్దబోధ

ఉపనిషత్తులు

న్యాయ, సాహిత్య విద్యాప్రవీణః ధూళిపాళ రామచంద్రశాస్త్రి.

శ్లో॥ ఉప నీయే మమాత్మానం బ్రహ్మోపాస్త
ద్వయం స్వతః।
నిహంత్యవిద్యాం తజ్జంచ తస్మాదుపని
షద్భవేత్॥

అజ్ఞానమును, అజ్ఞానకార్యమగు సంసారమును, తొలగించి ఆత్మకు పరమేశ్వర సామీప్యమును చేకూర్చు విద్యను బోధించు గ్రంథము ఉపనిషత్తని వ్యవహరింపబడుచున్నది

ఉ ఓం శంనోమిత్ర శ్శం వరుణః। శంనోభవత్వర్యమా। శంన ఇంద్రోబృహస్పతిః। శంనోవిష్ణు రురుక్రమః.

దీనియర్థము - మిత్రః = అహస్సునకును, ప్రాణవృత్తికిని, అభిమానియగు మిత్రుడను దేవుడు నః = మాకు శం = సుఖకరు డగుగాక.

ఈ విధముగనే-వరుణః = రాత్రికిని, అపానవృత్తికిని, అభిమానియగు వరుణుడు మాకు సుఖకరు డగుగాక.

అర్యమా = చక్షురింద్రియమునకును, ఆదిత్యమండలమునకును, అభిమాని యగు సూర్యుడు మాకు సుఖకరుడగుగాక.

ఇంద్రః = బాహువులకును,బలమునకును, అభిమానియగు ఇంద్రుడు మాకు సుఖకరు డగుగాక.

బృహస్పతిః = వాగింద్రియమునకును, బుద్ధికిని, అభిమానియగు బృహస్పతి, మాకు సుఖకరు డగుగాక.

ఉరుక్రమః = త్రివిక్రమావతారమున విస్తృతములగు పాదవిన్యాసములు గల విష్ణుః = విష్ణువు మాకు సుఖకరు డగుగాక

ఈ మంత్రమునకు ఉపోద్ఘాతము

తైత్తరీయోపనిషత్ మూడు విధములు. సాంహితీ, వారుణీ, యాజ్ఞకీయని ఇందు ప్రథమ ప్రపాఠకమున సంహితాధ్యాయము ప్రతిపాదిత మగుటంబట్టి దీనికి సాంహితీ యనియు, ద్వితీయ తృతీయ ప్రపాఠకముల యందు ప్రతిపాదితమగు బ్రహ్మవిద్య వరుణ సంప్రదాయమునుబట్టి ప్రవర్తిత మగుటచే దీనికి వారుణీ యనియు, నాల్గవ ప్రపాఠకమున యజ్ఞోపయుక్తములగు మంత్రములు గూడ ఆమ్నాతము లగుటచే దీనికి యాజ్ఞికీ యనియు సమాఖ్యలతో ఈ ఉపనిషత్తులు వ్యవహారమును బొందియున్నవి ఈ మూడు విధములగు ఉపనిషత్తులలోను ద్వితీయ, తృతీయ ప్రపాఠకములయందు బ్రహ్మప్రాప్తి లక్షణమగు పరమ పురుషార్థమునకు సాక్షాత్సాధనమగు బ్రహ్మవిద్య ప్రతిపాదిత మగుటచే వారుణీ ఉపనిషత్తు ముఖ్యమైనది అందు అధికార సిద్ధికొరకు మొదటసాంహితీ ఉపనిషత్తు ప్రవర్తించినది

జిజ్ఞాసువునకు కర్మానుష్ఠానముచే బ్రహ్మవిద్యయం దధికారము సంప్రాప్తమైనను, ఆలోచింపగా కర్మానుష్ఠానమువలన చిత్తైకాగ్రతకంటె ప్రవృత్తి బాహుళ్యమువలన చిత్త విక్షేపవాసనలే ఎక్కువగ సంభవించును

చిత్తైకాగ్రతకు బ్రహ్మసాక్షాత్కార సాధనత్వము కఠప్రశ్నయందు వివరింపబడియున్నది "దృశ్యతేత్వగ్ర్యా బుద్ధ్యాసూక్ష్మయా సూక్ష్మదర్శిభిః"అని. ఏకాగ్రత యనునది ధ్యానాభ్యాసాదులవలన బుట్టును గనుకనే పతంజలి యోగస్వరూపమును, తత్సాధనమును సూత్రములచే వివరించెను "యోగ శ్చిత్తవృత్తినిరోధః" "అభ్యాస వైరాగ్యాభ్యాంతన్నిరోధః" అని ఇట్లుండగ "శ్రేయాంసి బహువిఘ్నాని" అను లోక న్యాయమునుబట్టి బ్రహ్మవిద్యా ప్రాప్తి యందు దేవకృతమగు విఘ్నబాహుళ్యము గూడ సంభవించును గనుక జిజ్ఞాసువుముందు ఆ విఘ్నముల ఉపశాంతికొరకు ప్రయత్నించవలెను బ్రహ్మవిద్యాప్రాప్తియందు దైవికములగు విఘ్నములుగూడ సంభవించగలవను విషయము బృహదారణ్యకమున స్పష్టముగ నిరూపింపబడియున్నది

బృహదారణ్యక భాగము. "అథయోఽన్యాందేవతాముపాస్తే ఽన్యోఽసావన్యోఽహమస్మీతి నసవేద యథాపశురేవం సదేవానాం యథాహ వై బహవః పశవో మనుష్యం భుంజ్యురేవ మేకైకః పురుషో దేవాన్ భునక్త్యేకస్మిన్నేవ పశావాదీయమానేఽప్రియం భవతి కిముబహుషుత స్మాదేషాంతన్నప్రియం యదేతన్మనుష్యా విద్యుః"

ఈ ప్రస్తావమున పూర్వము బ్రహ్మవేత్తకు పరమపురుషార్థప్రాప్తి యగునని ఉపదేశించి, విద్యారహితునికి పరమపురుషార్థము సంభవించుటకు అవకాశము లేదని బోధించుటకు ఈపై వాక్యము ప్రవర్తించినది బ్రహ్మవిద్యా మహిమను వర్ణించిన తరువాత అవిద్యామహిమ ఈ వాక్యముచే ఉపదేశింపబడుచున్నదని భావము అవిద్యా మహిమ ఎట్టిదనగా, అవిద్యగల ఏ పురుషుడు స్వాతిరిక్తమగు దేవత నుపాసించుచున్నాడో అతనికి ఉపాస్యమగు దేవత నాకంటే అన్యుడనియు, ఉపాసకుడనగు నేను దేవునికంటే అన్యుడననియు, ఈ రీతిగ భేదబుద్ధి గలవాడై బ్రహ్మాత్వ లక్షణమగు ఉత్కృష్ట మహిమను దెలిసికొనుటకు అసమర్థుడగును ఎట్లనగా, గజాశ్వాది రూపములగు పశువులు తమయందుండు అధికమగు శక్తిని దెలిసికొనక అల్పశక్తిగల మానవులకు ఎట్లు స్వాధీనమగుచున్నవో అదేవిధముగ అజ్ఞానియగు ఉపాసకుడు దేవతలకు అధీనుడగును మరియు గోవులు, అశ్వములు, బలీవర్దములు, మహిషములు మొదలగు పశువులు క్షీరములను ఇచ్చుట, భారమును వహించుట, మొదలగు స్వోచితములగు వ్యాపారములచే ఒకే మానవుని ఏ రీతిని పాలించుచున్నవో, అదే ప్రకారమున అజ్ఞానియగు పురుషుడు ఏకైకుడై అగ్నీంద్రాది దేవతలను హవిర్ద్రవ్య ప్రదానాదులచే పాలించుచున్నారు. ఆ కారణమున ఏకైక పురుషుడు దేవతలకు సర్వపశుస్థానీయుడు అని భావము

మరియు, అనేకములగు పశువులను పాలించుచున్న పురుషునికి దన పశువులలో ఒక పశువైనను, చోరులచేతగాని, వ్యాఘ్రాది క్రూరమృగములచేత గాని అపహరింపబడినచో అప్రియము అధికముగ తలుపబడును, ఇట్టి స్థితిలో దనపశు సంతతి యంతయు అపహృతమైనయడల సంభవించు అప్రియమును వేరుగ వర్ణింప నవసరములేదు గనుక మనుష్యులు పరమేశ్వర తత్త్వమును దెలిసికొనుచున్నారను విషయము దేవతల కత్యంతము అప్రియమై యుండునని భావము ఈ విధముగ బృహదారణ్యకమున ప్రతిపాదిత మగుటచే బ్రహ్మవిద్యయందు దేవకృత విఘ్నములూహింపబడుచున్నవి గనుకనే వార్తిక సారమునగూడ ఈ విషయము స్పష్టముగా నిరూపింపబడి యున్నది.

వార్తిక సారము

శ్లో॥ స్వస్యతత్త్వ మవిజ్ఞాయ యాగదానాది కర్మభిః।
(1) స్వతోఽన్యా దేవతాః పాతిహ్యానడ్వాన్ వణిజంయథా॥
(2) అపిభూరిపశోః పుంస ఏకస్మిన్న పితస్కరైః।
హ్రియమాణేపశౌ దుఃఖం కిమునర్వాపహారతః॥
(3) సర్వస్వతుల్యే నృపశౌ బ్రహ్మధీపరిఘోషిణా।
హ్రియమాణే మహద్దుఃఖం స్యాత్సర్వేషాం దివౌకసామ్॥

అని యున్నది

మరియు

శ్లో. మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాంవేత్తి తత్త్వతః॥

ఈవిధము కృష్ణభగవానుడు గీతలయందు వివరించిన ప్రకారము పరమేశ్వర తత్వమును దెలిసికొనుటకు వేయికి ఒకడు ప్రయత్నించుచున్నాడనియు, యత్నించువారల

యందుగూడ ఒకడే దనరహస్యమును దెలిసి కొనుననియు, భావమునుబట్టి పరమ పురుషార్థ సాధనమగు బ్రహ్మవిద్యా ప్రాప్తి యందు దైవికములు, తదితరములు నగు విఘ్నములు ప్రాయకముగ సంభవించగలవని తేలుచున్నది. గనుక అట్టి విఘ్నశాంతికొరకు ఈసాంహి త్యుపనిషత్తున ఆద్యానువాకమున జప్యమగు మంత్రము ఆమ్నాతమైనది గనుక ఈ మంత్రమందు ప్రతిపాదితములగు మిత్రవరుణాది దేవతలు ప్రసన్నులై నాకు సంభవించు విద్యాప్రతిబంధకములను దొలగించి, నాకు బ్రహ్మవిద్యా ధికారమును ప్రసాదించి తద్వారముగ బ్రహ్మత్వ లక్షణమగు పరమ పురుషార్థము లభింపచేయుదురుగాక యని ఆ దేవతలను జిజ్ఞాసువు ఈ మంత్రద్వారముగ ప్రార్థించుచున్నాడని భావము

శ్రీ మదాంధ్ర వేదాంత పంచదశి

[మహాభూత వివేక ప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౨

నిగమముల యందు మిగుల వర్ణితమునైన
అద్వయంబును సద్రూపమైన బ్రహ్మ
మెల్లభూతంబుల నెఱుంగ, నెఱుఁగ నగును,
అందుచే భూత పంచక మరయఁబడెడు.

శబ్దమును స్పర్శ రూపు రసమ్ము మఱియు
గంధమను భూత గుణములు క్రమము గాఁగ
ఆకసం బాదియై యుండునట్టి పంచ
భూతములయందు వర్తిల్లి పొలుచుచుండు

ఆకసమున శబ్ద గుణంబు, ననిలమందు
బిసి యనెడు నట్టి శబ్దమున్, వేఁడి గాని
చలియుఁగాని స్పర్శమ్మునఁ గలుగుచుండు
ననల మందున భుగభుగ ధ్వని యొకండు.

జలములందు నుష్ణ స్పర్శ కలిగి, కాంతి
రూపమై బుల్బులుధ్వని యేపుసెందు,
చల్లనయుఁ దెల్లనైన రసమ్మెసంగు
నెలమి మాధుర్యమనఁగ నిక్కలము గాఁగ.

అవనియందునఁ గడకడ యనెడు ధ్వనియు,
అతి కఠినమైన స్పర్శ, నీలాదికమ్ము
చిత్రరూపమ్ము మఱియు విచిత్రరూప
సుమధురాహ్లాది రసములు నమరియుండు.

అమర సురభి తదన్య గంధము లెసంగు,
నెలమి సమ్యగ్వివేచితమ్ములగు గుణము
లివియ శ్రోత్రమ్ము త్వక్కు చక్షువును జిహ్వ
ఘ్రాణమను నింద్రియమ్ముల గలుగుచుండు.

అట్టి జ్ఞానేంద్రియములు కర్ణాదులందు
నుండి శబ్దాదుల గ్రహించుచుండు నెపుడు,
అవియు సూక్ష్మమ్ము లూహింప నైన వగుచు
ప్రాయికమ్ముగ బయటికే పరుగులిడును.

ఒక్కయెడఁ గర్ణముల మూసియున్న యెడల
ప్రాణవాయువందు జఠర వహ్నియందు
జలము గొనుటందు నన్న భక్షణమునందు
మనకు లోపలి శబ్దమ్ము వినఁగ వచ్చు

ఆంతరపు స్పర్శనము మన కనుభవంబె
కనులు మూసిన లోని చీకటులు దోచు,
త్రేచునెడ రసగంధముల్ దెలియు, నిట్టు
లాంతరమ్ముల జ్ఞానేంద్రియము లెఱుంగు.

పలుకుటయు నిచ్చి కొనెడు పనులు గొనుటయు
గమనము విసర్జనమ్ము సౌఖ్యగ్రహణము
కృషియు వాణిజ్యసేవాది క్రియల వెల్ల
నయిదు కర్మేంద్రియమ్ములయందె యుండు

వాక్కు పాదము పాణియు పాయువును ను
పస్థయను నింద్రియములచేఁ బైనిఁ జెప్పఁ
బడిన పనులు గలుగు; నట్టి పంచకంబు
నోరు మొదలైన యేనింటఁ జేరియుండు.

మనసు స్పర్శేంద్రియాధ్యక్ష తను వహించి
హృదయ పద్మమ్ము నందున నధి వసించు,
నదియె యంతః కరణ మింద్రియములు లేక
నిదియు స్వాతంత్ర్యమేమి లేనిదియ యగును.

ఇంద్రియమ్ములు శబ్దాదులందుఁ జొఱఁగ
మనసు గుణదోషముల విచారణ మొనర్చు,
మనసునకును సత్త్వాది త్రిగుణములుండు
వానిచే వికారము నొందు మానసంబు

ఓర్పు వైరాగ్యమును దాన మొసఁగుటాది
సద్గుణంబులు తత్సత్త్వ సంభవములు
కామమును క్రోధలోభాదికమ్ములైన
సకల గుణములు తద్రజ స్సంభవములు.

భ్రాంతి యాలస్యమును గూర్కుపాటు నాఁగ
సర్వగుణములు తత్తమ స్సంభవములు,
సాత్త్వికమ్ములఁ బుణ్యమ్ము సంభవించు,
సంభవించుఁ బాపమ్ము రాజసముచేత

తామసమ్ముల నుభయ ముద్భవముగాక
వ్యర్థముగ నాయువెల్లను వ్యయము సెందు,
ఇవ్విషయములఁ గర్తను నేనెయంచు
నెంచువాఁడె జీవుఁడు; లోక వృత్తమిట్లు.

అరయ శబ్దాది యుక్తమునైన వానఁ
దెల్లముగ భౌతికత్వ మతిస్ఫుటంబు,
ఆ దశేంద్రియాల్ భూత జన్యంబులగుట
శాస్త్రయుక్తులచేత నిశ్చయమె యయ్యె.

పదు నొకండింద్రియములచే బహువిధమ్ము
లైన యుక్తులచేత వేదాంతములగు
వాక్యములచే నిరూపింపఁబడిన ఈ జ
గంబె శ్రుతి "నిది" యనుచుఁ బల్కంగఁబడియె.

సృష్టికిని పూర్వ 'మిది' సర్వమేక మద్వి
తీయకంబు సదాత్మకంబై యనామ
కం బరూపంబునై యొప్పుగాంచెననుచు
వేదములు సెప్పు తత్త్వ ప్రవృత్తి చొప్పు.

[తత్ప్రమాణము లష్టవిధాలు చూవె
తాను జూచిన యదియ [1] ప్రత్యక్ష మగును,
తాను నూహించునది [2] యనుమాన మగును,
ఒక్క వస్తువుఁబోలి వేఱొక్కవస్తు
వుండుటది [3] యుపమానమై యొప్పుచుండు,
శాస్త్రమున వేదమందున్న [4] శబ్దమగును,
పైని గల లక్షణమ్ములఁ బట్టి యిట్టి
యంశ మిట్టులుండగ వచ్చునంచు నిర్ణ
యంబొనర్చు [5] టర్థాపత్తి యనఁగఁ బరగు,
ఒక పదార్థము నొక యెడ నుండకుండు
టెఱుఁగుటె [6] యనుపలబ్ధిగా నెంచవలయు,
పందలోఁ బదియుంట [7] సంభవము చూవె,
ఒక్క చెట్టున రక్కసియున్న దనఁగ
దాన భీతి [8] యైతిహ్య ప్రమాణ మగును.]

అవనిజమున కందుండు ఫలాదికమున
కైన భేదము స్వగత భేదాఖ్యమగును,
ఒక్క వృక్షంబునకును నింకొక్క వృక్ష
మునకు నగును సజాతీయ మనఁగభేద,
మట్లె శిలలకుఁ దరువులకైన భేద
మది విజాతీయమగు భేదమనఁగఁబరగు

ఏకమనుట చేతను ద్వైతమేమి లేని
దనుటచే నట్లు నిశ్చయ మగుటచేత
తత్పర బ్రహ్మమునకు భేదత్రయంబు
నించుకేనియు నెందు నూహింపరాదు.

అవయవమ్ములు లేవు బ్రహ్మమ్ము నందు
అందుచేత స్వగత భేదమందు లేదు
సృష్టికంటెఁ బూర్వము జనియింపకుంట
అంశములు కావు నామ రూపాదికములు.

నామ రూపాదికముల జన్మమ్మె సృష్టి
యగుటచేత, సృష్టికిఁ బూర్వమందు నామ
రూపములు లేవు, దాని నిరూపణమున
నాకసముగ బ్రహ్మంబు నిరంశ మగును.

భేదమేమి నిరూపింపరాదు గాన
ఆత్మకు సజాతి వస్తువటంచు లేదు,
నామరూప భేదము లేదదేమి, సత్ప
దార్థమున కెట్టిదైన భేదమును లేదు

సత్పదార్థాన కన్య మసత్తొకండె
అయ్యదియును లేనేలేనిదైన కతన
ఆత్మ కన్య పదార్థ మటంచులేదు
దానిచే విజాతీయ భేదమ్ము లేదు.

ఆత్మ యొకఁడె యన్యంబు లేదంచు సిద్ధ
మయ్యె, నిందు కొందఱు విమోహాత్ములగుచు
సృష్టికిని బూర్వమందున నీ జగమ్ము
శూన్యరూపాన నుండె నంచును వచింత్రు.

సంద్రమునమున్గు మానవు నింద్రియములు
ఏవిధముగఁజెదరిపోవు నా విధముగ
అజ్ఞుని మనంబు ఏకమైనట్టి బ్రహ్మ
మందుఁ జరియింపలేక భయంబునొందు.

నిర్వికల్ప సమాధిలో నిలిచియుండి
శివుఁడనియు విష్ణు వని యుపాసించు కర్మ
యోగులును భక్తి యోగులు నొక్క రీతి
భయపడుదు రంచు నల గౌడపాదులనిరి,
ఇక నసద్వాదులను గూర్చి యేమిచెప్ప?

అవని నస్పర్శ యోగ సమాఖ్య లివ్వి
జ్ఞానయోగికిఁ దక్కనసాధ్యములగు,
అభయమైన యిట్టి సమాధి యందు ధ్యాన
కర్మయోగు లుభయమును గాంచు చుంద్రు.

శుష్కతర్క వాదమునందు శూరులైన
బౌద్ధులును, అసద్వాదులు బ్రహ్మమందు
భ్రాంత చేతస్కులైనట్టి వారలంచు
జ్ఞానధుర్యుండు శంకరాచార్యు డనియె,

శోచ నీయులు బౌద్ధులు శ్రుతిని మౌర్ఖ్య
మున ననాదరించియు, సర్వము ననుమాన
ముననె సాధింపఁగాఁ దలంపూని, 'శూన్య
మే జగద్ధేతు' వని వచియించు చుంద్రు.

ఆదియందు శూన్యమై యుండెననియు, మఱియు
నదియు సద్యోగమును సన్మయంబ యనిన
ఉభయమును విరుద్ధం బయియుండు కతన
శూన్యమందున నా రెంటిఁ జూడఁ బోము.

అర్కుఁడా తమో యుక్తుఁ డౌననఁగ రాము,
ఆతఁడా తమోమయుండని యనఁగరాదు,
పొందు గల్గునె సమ్మాన్యములకు నెందు?
కాన శూన్యమెట్టుల నుండ గలదొ చెపుమ.

ఆకసమునకు నామ రూపాది కమ్ము
మాయ చేతనె కల్పిత మగుచు నుండు
అట్లె నామ రూపములు శూన్యంబునకును
కల్పితములన్న మాకు భంగంబు లేదు.

బ్రహ్మమునకును నామ రూపములు కల్పి
తమ్ములందు రేనెట కల్పితములొ చెపుము,
ఎట్టి యాధారమునులేని యట్టి దెందు
భ్రాంతి చేతను జూడంగఁ బడెనొ చెపుము.

సత్తునకును నాసీత్తుకు శబ్దసరణి
కలదు భేదమన మత భంగమ్ము గలుగు,
కలుగుఁ బునరుక్తి భేదము గలుగ దనిన,
సందువేని నవ్విధమున ననఁగరాదు

చేయఁదగు దానిఁ జేయును, జెప్పఁదగిన
దానిఁ జెప్పును, ధరియింపఁదగిన దాని
ధారణ మొనర్చు ననుట సాధారణంబె
అటె 'సదాసీ'త్తనుట దోషమనఁగరాదు

ఏకమగు సత్పదార్థ మందెట్టి కాల
భేదమును లేక యున్నను, భేద భావ
మొనరు శిష్యునితోఁ బూర్వమున నటంచు
ననెడు నెడ ద్వితీయము గలదనఁగరాదు.

ప్రశ్నమే గాని ప్రత్యుత్తరమ్ము గాని
ద్వైతముండిననే సంభవమ్ము గాని
అద్వయ విచారణము చేయునట్టి యెడల
ప్రశ్నమునులేద, ప్రత్యుత్తరమును లేద.

సృష్టికిని బూర్వమందున స్థిమితమును, గ
భీరమును, నతేజము, తమో భిన్నమును, న
నాఖ్యమును, నగోచరమును, వ్యాపకమ్ము
నైన సత్పదార్థం బేకమగుచు నుండు

అణువు మొదలు భూమి నశించునవియె గాన
మొదట నవి లేక పోయినఁ బోవుఁగాక,
అవయవములు లేకుండు నీయాకసంబు
ఎట్లు లేకుండు ననుచు నీవెంతు - వనిన

ఈజగములేని యాకాశ మెట్లు మొదట
నుండె ననియూహించుచు నుందురొక్కొ
అట్లె యాకాశమును లేని యట్టి దైన
ఈ పరబ్రహ్మముండె నంచెంచరాదె ?

చందాదారులకు వినతి

"నవభారతి" పత్రికకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియజేస్తున్నాము,

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యథాతథంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము

మేనేజరు, నవభారతి

స్వర్గ సరమ

ఫ్రాన్సిస్ థామ్సన్

తెలుగు · 'అమరేంద్ర'

పగలూ రాత్రీ కూర్చిన సోపానపంక్తి వెంబడి వత్సరాల తోరణాలు దాటుతూ
పరుగు తీశాను ఆయనకి దూరంగా పారిపోయాను
నా మనస్సులోని పద్మవ్యూహాల తికమకలోకి పరిగెత్తి పోయాను
నా కన్నీటి మంచుతెరలలో నా నవ్వుల తరంగాలలో
కనబడకుండా దాక్కున్నాను ఆశల సుదూర సీమలకు సాగిపోయాను
అగాధమైన భయాల పాతాళ తిమిరాలలోకి చరచరాజారి దొర్లిపడిపోయాను
నన్ను తరుముతూవచ్చే ప్రబల పదధ్వనికి దూరమైపోవాలని తపించాను
కాని నన్ను వీడదా అడుగుల సవ్వడి గంభీర గమనం
నిశ్చల నిర్భయయానం తొందర నెరుగని హుందానడకలతో
నా వెనువెంటనే వస్తూంది పాదాల ధ్వనికంటె గట్టిగా పదాలధ్వని
'నన్ను వంచించావా నిన్ను అందరూ వంచిస్తారు'/ బహిష్కృతుడైన శరణార్థిలాగా
బద్ధహృదయ కవాటాలవద్ద నరాల అల్లిక వలలు వ్రేలాడే
ఎరుపుతెరల హృదయ గవాక్షాలముందు ఎలుగెత్తి పిలిచాను
ఆయన ప్రేమతో నన్ను వెన్నంటి వస్తున్నాడని తెలుసు అయినా చెడ్డభయం నాకు
ఆయన ప్రేమనన్ను, ఆక్రమిస్తే అన్నిటినీ నేను కోలుపోతానని భయంనాకు
ఓరవాకిలిగా కవాటం తెరుచుకుంటే తరుముకువచ్చే ఆయన ఆగమనం
చరాలున మూసివేసే తీవ్రపవనం ప్రీతి తరుముతూ వస్తుండగా
భీతిదూరంగా పరుగెత్తలేదు కాబోలు లోకాల ప్రాకారాలుదాటి శూన్యంలోకి
దూసుకు పోయాను

చంద్రలోకపు స్వర్ణద్వారాలవద్ద శరణు వేడుతూ
నక్షత్రాల బంగరు చువ్వలను నా చేతులతో ఊగిసలాడించి
మధుర స్వరాలు సాగేలాగున కదిపి కుదిపి పిలుస్తూ అన్నాన
"ఓ ప్రభాతమా! త్వరగా రా' ఓ సంధ్యా! ఆలసించకు
లేత మబ్బుల పూలమాటున దాగనీవా?
నావెంట తరిమే ప్రియుడు కడు భయంకరుడు!
ఆయనకంట బడకుండా దాచవా నీ నీలిముసుగుల్లో!"
ఆయన సేవకు లందరికి లంచం ఆశపెట్టాను
కాని నన్నెవరూ చేరనివ్వలేదు
నా కృతఘ్నతని వేలెత్తి చూపింది వాళ్ళ విధేయత
ఆయనపట్ల విశ్వాసం నాకుచేసిన ద్రోహం మోసం
ఇంకా వేగం కావాలని ఆవేగంతో అందరిని అర్థించాను
ఈలలువేసే కదనుల గాలిగుఱ్ఱాల జూలు పట్టుకుని వ్రేలాడాను
నీలాంబరపు మైదానాలమీద మెత్తగా పరిగెత్తే వేళ
కాలిడెక్కలు తాకి చిత్తడి దారిలో మెరుపులు చిమ్ముకుంటూ పైకిచిందే వేళ
గగన పథంలో పిడుగుల మోతతో ఆయన రథంసాగే వేళ

గాలి గుఱ్ఱాల జూలు వీడలేదు నేను.
ప్రీతికి తరుముకుంటూ రావటం తెలుసు
భీతికి దూరంగా పోయేదారి దొరకదు.
తొందర నెరుగని హుందా నడకతో మందగంభీర గమనంతో
వెంబడించే అడుగుల సవ్వడి పాదాల ధ్వనికంటే బిగ్గరగా పదాలధ్వని
"నాకు ఆశ్రయం ఇవ్వని నీకు ఎక్కడా దొరకదు నిలువ నీడ"
నరనారుల వదనాలలో హృదయాలలో నెలవుకోసం వెంపరలాట విరమించాను.
కాని శిశువుల చిన్నారి కళ్ళలో కలదు నాకు బదులు పలుకు శక్తి
కలదు నన్ను ఆదరించు రక్తి
వాళ్ళ చిన్నారికళ్ళు ఉదయించే అభిమానంతో మెరుస్తూవుంటే
వాళ్ళని జుట్టు పట్టుకుని దూరంగా గుంజుకుపోయింది దేవదూత వాళ్ళ ప్రియమాత.
'పోనీ, మీరైనా రండి' అన్నాను నేను
'ప్రకృతి మాతప్రియ శిశువులారా! పంచు కోనివ్వండి మీ కోమల స్నేహాన్ని
పెదవులుచేర్చి ముద్దాడుతాను కరాలు పెనవేసి కౌగిలించుతాను
గాలికి కదిలే అమ్మ ముంగురులు సవరిస్తాను
నీలాకాశపు వేదికకింద నాలుగు దిక్కుల భవనంలో
ఉదయవేళ విచ్చిన పూలగిన్నెలతో మధురమైన మంచు బిందువులు
ఆస్వాదించనివ్వండి మీతోబాటు, అల్లాగే జరిగింది.
వారి కోమల సాహచర్యంలో లీనమైపోయి
ప్రకృతి రహస్య ద్వారపు గొళ్ళెం తీశాను
ఆకాశపు వదనంమీద పోరాడే భావపరంపర అవగాహన చేసుకున్నాను.
కల్లోల సాగరం ఎగజిమ్మే తరంగాల నురుగు
గగనవీధి మేఘపటలి రూపం పొందిందని
ఉదయాస్తమయాలలో హృదయం పొంగి క్రుంగింది
ప్రకృతిలోని వికాస వినాశాలు నా భావాలకి ఆకారందిద్ది రంగు లద్దినవి.
ప్రకృతి నవ్వినప్పుడు మురిసిపోతాను
ప్రకృతి కన్నీరు చిందితే విలపిస్తాను.
సంధ్యాదేవి గతించిన దినపురుషుని దేహంచుట్టూ
మిణుకుమనే నక్షత్ర జ్యోతులు వెలిగించినప్పుడు
విషాదంతో నా హృదయం బరువెక్కుతుంది.
ప్రభాతపు కళ్ళలో నవ్వునై మెరుస్తాను గగనమూ నేనూ ఒకటైపోయావ
ఆమె మధురాశ్రువులు నా బాష్పాలు కలిసి ఉప్పు ఊరినయి.
గగన భామిని హృదయం అస్తమయంలో రుధిరం
చిమ్ముతుంటే నా హృదయానికి హత్తుకుని ఆ వేడిని పంచుకున్నాను.
ఆమె హృదయంతో నా హృదయం మేళవించాను.
కాని నా మానవ హృదయావేదన శమించలేదు
గగనభామిని చెక్కిళ్ళపై నా బాష్పాలు నిష్ఫలంగా జారినయ్.
ఎంత దురదృష్టం! ఒకరిభాష ఒకరికి తెలియదు
నాది భాష నాటిది మూగకదలిక.

ఈ ప్రకృతి నికృష్టమైన సవతితల్లి నాకు
కాదా ? నేను తన కన్నబిడ్డ నైతే
ఒకనాడైనా ఈ నీలిచీర పైట తొలగించి
వాత్సల్యభరితమైన వక్షస్థలానికి అదుముకుని
దప్పికతో ఎండిపోయే గొంతుకులో స్తన్య
పీయూష ధారలు కురిపించి తనివి తీర్చదా ?
దగ్గరికి మరింత దగ్గరికి వచ్చేస్తోంది తొందరలేని హుందా నడకతో
మందగంభీర గమనంతో తరుముతున్న అడుగుల సవ్వడి
పాదాల అలికిడిని మించిన పదాల అలజడి
"నన్ను తనియింపని నీకు సున్నకదా తృప్తి ?"
ప్రభూ ! నగ్నంగా నీ భయద హస్తపు వజ్రాఘాతంకోసం వేచివున్నాను
నా కవచాన్ని నువ్వే ముక్కలు చేశావు
నన్ను పాదాక్రాంతుణ్ణి, చేసుకున్నావు నిద్రమేల్కొని కళ్ళు తెరిచాను
పరికించి చూడగా నిద్రలో నా సర్వస్వమూ ఎవరో దొంగి
లించి నన్ను నగ్నంగా నిలబెట్టి నట్లుంది
ప్రమత్త యౌవన ప్రాయంలో విహ్వలంగా వర్తించి
జీవన సౌధపుమూలస్తంభాలనే కదిలించి
కూలిన భవన భిత్తికల అడుగున అణగారిపోయి
గతజీవిత శిథిలాలలో క్షతగాత్రుడినై,
కళంకధూళి ధూసరితుడినై అసహాయుడినై పడివున్నాను
శిథిలాలనడుమ నాప్రాయం చిరనిద్రపోతున్నది గాయపడిన వికలాంగునివలె
నా జీవనం పేలిన టపాకాయలాగా పొగకక్కుతూ నేల కూలింది
నాప్రాయం వాన నీటిమీది బుడగలలాగా లావెక్కి పుటుక్కుమన్నది
నా స్వప్నం భగ్నమయింది నా శిథిల విపంచి మూగవోయింది
నా ఊహల ఉయ్యాలతాళ్లు తెగిపడినయి ఈ లోకాన్ని నా చేతికి ఆభరణంగా ధరించాను
ఆభరణం బరువెక్కి కట్టిన పట్టుదారాలు పెరిగిపోతున్నాయి
దుర్భర విషాదంతో బరువెక్కిన ఈ విశ్వనౌకని భరించలేక
సుకుమార భావనా సూత్రాలు పట్టుతప్పి పోతున్నాయి
ఓ ప్రభూ ! నీప్రేమ కల్పతరువా ? విషవృక్షమా ?
నీ పొరుగున ఇంకే పుష్పమూ వికసించలేదా ?
ఓ అనంత శిల్పీ ! తప్పదా ? అగ్నిలో మాడ్చి మసిచేస్తే కాని
నేను నీ శిల్పానికి ఉపయోగపడనా ? నా తారుణ్యం మరుభూమిలో కురిసిన వర్షం
నా హృదయం శిథిలమైన జలయంత్రం అందులో కదలని కన్నీరు
మీదికివాలే మానస తరుశాఖలు కదిలి
విషాద పవనంసోకి ఆకుల కొనల నీటిబొట్లు జలజలరాలి పడుతున్నాయి
ప్రస్తుతస్థితి ఇది భవిష్యత్తు ఇంకెంత భయంకరమో ?
పండుపై తోలు ఇంత చేదుగావుంటే గుజ్జు ఇంకెంత విషమో ?
కాలగర్భంలో ఏమి దాగివుందో అస్పష్టంగా ఊహించగలను
అనంతసౌధపు అదృశ్య శిఖరాగ్రాలనుంచి వినబడుతుంది భేరీనాదం,

కమ్మిన మంచుతెరలు కాస్సేపు విడిపోయి ఆ శిఖరాలు మసకగా కనబడి
మళ్ళీ మెల్లిగా కమ్ముకుపోతాయి కాని ఆ మూర్తిని మరుగు పరచలేవు
విషాద వేషధారి, వర్ణకిరీటధారి పూరించి తనభేరి పిలిచేను ననుకోరి
ఎరుగుదు నాతని నామము ఎరుగుదు భేరీనాదము
మానవ జన్మము, మనుజ హృదయము మరణపు ఎరువుల బలిసినకాని బంగరు పంటలు పండవా ?
ముగిసినది వేట దరిసినది వాణి
ఆవాణి కల్లోల మహార్ణవ గర్జనమై ఆవరించినది నలుగడలా
"నీ లోకము భగ్నమయిందా ? శకల శకలములై శిథిల మయిందా ?
నన్నువీడి పరుగిడు నీకు అన్నీ దూరంకావా ?
వింతమనుజుడా ? దయనీయ నిరర్థకుడా! ఎందుకు నిన్ను ఇతరులు ప్రేమిస్తారు ?
నేనుతప్ప కోరగానివారిని మరెవరు ప్రేమిస్తారు అని పలికింది దివ్యవాణి
మానవప్రేమ అర్హతకల మనుజులకే క్షుద్రమానవులందు అధమాధముడవు నీవు
పాపం, నీకు తెలియదు నీవెంత అనర్హుడివో నీ వెరుగవు
నీచుడా! నిన్నెవరు ప్రేమిస్తారు ? నేనుతప్ప నిన్నెవరు గుర్తిస్తారు ?
నీ దగ్గరనుంచి దొంగిలించినవన్నీ నీకోసం భద్రంగా దాచివుంచాను
నిన్ను బాధించటానికి కాదు నీవే వాటిని నా గుప్పెట్లో వెతికి కనుక్కోటానికి
వెర్రి శిశువులాగా పొరబడి కోలుపోయానని విలపించావే ఆ సంపదలన్నీ నీకోసం
భద్రపరిచాను ఇంటివద్ద లేవయ్యా ! రావయ్యా !
ఇదుగో నా చేతిని వదలకు, పదవయ్యా !"
ఆగింది నాచెంత అడుగుల అలికిడి
అంధకారమని నేను భ్రమించానా ? ప్రభువే ఆప్యాయంగాసాచిన అభయ హస్తమేనాఇది?
ఆ చల్లని నీడలో నిలిచానా ? "మూర్ఖుడా! అంధుడా! దుర్బలుడా !
నన్నేకదా నువ్వు అన్వేషించేది? నన్నుదూరం చేసుకుంటే నీకు ప్రేమదూరమైపోతుందికదా!"

గతానుగతం
(నాటిక)

శ్రీ బెల్లంకొండ రామదాసు

[పాడుపడిన పాతభవనం. ఎండిన చెట్టు కొమ్మ విరిగిపడిన చప్పుడు. చెట్టుకొమ్మలనుంచి పక్షులు లేచివెళ్ళిన శబ్దం. గద్దల రెక్కలచప్పుడు. గుడ్లగూబ అరుపులు. ఒకక్షణం నిశ్శబ్దం.నవ్వులు. అరుపులు. కేకలు. హఠాత్తుగా నిశ్శబ్దం. సన్నని పెండ్లిసన్నాయి. శ్రాద్ధమంత్రపఠనం. మళ్ళీ సన్నాయి. పిల్లు గుండాన పడే సమయంలో సన్నాయి. నిశ్శబ్దం. చీట్లపేక కలుపుతున్న శబ్దం. ముక్కలు పంచుతున్న శబ్దం...]

ఒకగొంతు చూస్తావేం ? దిగుముక్క.

మరోగొంతు : ఆలోచించనీ.

మరోగొంతు ఎంతకాలం ? కాలంఆగదు

మరోగొంతు కాలం కదలదు

మరోగొంతు అసలు కాలంలేదు నల్ల మందు.

మరోగొంతు ఇశ్ !

మరోగొంతు అయిందా ఆలోచన ?

మరోగొంతు ఊ

మరోగొంతు తిప్పు

ఎన్నోగొంతులు మూడాసులు

రెండోగొంతు ఇలా నెట్టండి కుప్ప

ఒకగొంతు ఎత్తుకో నక్కను తొక్కివచ్చావ్

రెండోగొంతు ఇహ వెడుతున్నా

ఒకగొంతు ప్రాణాలతో పోవు

ఎన్నోగొంతులు . చస్తావు. జాగర్త. కూచో. మరో ఆట.

రెండోగొంతు నాకు పనుంది. మా ఆవిడ కోప్పడుతుంది

దూరంగా గయ్యాళిగొంతు రా! త్వరగా! మళ్ళీ దిగకు! మోసపోతావు!

రెండోగొంతు · అదుగో. మా ఆవిడ పిలుస్తోంది

ఎన్నోగొంతులు మాదబ్బాంతా మీఆవిడ మొహాన పోద్దామనుకున్నావేం? చంపేస్తాం కూచో

రెండోగొంతు నాడబ్బు నేను గెలిచా.

ఎన్నోగొంతులు నోరు ముయ్ నీలాటి వాళ్ళను లక్షమందిని చూశాం.

రెండోగొంతు · నేవెడుతున్నా

ఎన్నోగొంతులు పట్టండి చంపండి నరకండి

ఒక పెద్దగొంతు సైలెన్స్ !

ఒకగొంతు ఎవరు ఇంగ్లీషు మాట్లాడుతున్నారు?

మరోగొంతు అధ్యక్షుడురా. ఎదిరించకు.

ఒంగొంతు · ఏ అధ్యక్షుడు?

మరోగొంతు · మన రిపబ్లిక్ కి!

మరోగొంతు ఏడిశాడు (నవ్వు)

పెద్దగొంతు సైలెన్స్ నేను విప్లవం సహించను

ఒకగొంతు నీమీద విశ్వాసం పోయింది

పెద్దగొంతు షట్ అప్ మీరు గమనించడం లేదు ఆపద! ఆపద! ఆపద! అపుదాం పద!

ఎన్నోగొంతులు ఏమిటి? ఏమిటి? ఏమిటి?

పెద్దగొంతు అతనొస్తున్నాడు,

ఎన్నోగొంతులు ఎవరు? ఎవరు? ఎవరు?

పెద్దగొంతు అతనే కృష్ణమూర్తి

ఎన్నోగొంతులు ఎవడువాడు?

పెద్దగొంతు ఈ కొంప వాడిదే.

ఎన్నోగొంతులు కాదు మనది కాదు మనది.

పెద్దగొంతు సైలెన్స్! కాదు వాడిదే.వాడి ముత్తాత కట్టించాడు,

ఒకగొంతు నీకెలా తెలుసు?

పెద్దగొంతు వాడి ముత్తాత దివాణంలో నేను గుమాస్తాని. కలపకోసం నన్నే పంపించాడు వాడొస్తున్నాడు

కొన్నిగొంతులు నీవుచూశావా? అలవాటు చొప్పున అబద్ధం ఆడుతున్నావా?

పెద్దగొంతు నేను చూశాను.

ఎన్నోగొంతులు ఎక్కడ?ఎక్కడ?ఎక్కడ?

పెద్దగొంతు తోచక సాయంత్రం షికారు కెళ్ళాను స్టేషన్‌లో వాడురైలుదిగాడు. బండీ మాట్లాడుకున్నాడు. వస్తున్నాడు

ఎన్నోగొంతులు ఎందుకు? ఎందుకు? ఎందుకు వాడికీ విపరీతబుద్ధి?

పెద్దగొంతు: ఇల్లు బాగుచేయించుకుని ఇక్కడే ఉంటాట్ట. వాడి జవానుతో చెబుతున్నాడు

ఎన్నోగొంతులు మనగతి?

పెద్దగొంతు అదే అడుగుతున్నా

కొన్నిగొంతులు ఇల్లు ఖాళీచేదాం

కొన్నిగొంతులు వీల్లేదు! వీల్లేదు! వీల్లేదు!

కొన్నిగొంతులు ఖాళీ చెయ్యాలి!

కొన్నిగొంతులు వీల్లేదు!

పెద్దగొంతు సైలెన్స్!

ఎన్నోగొంతులు పెద్దలు తమరే చెప్పండి

పెద్దగొంతు Yes ఒక్క నిమిషం. ఆలోచించనీండి Yes రైట్ తట్టింది వాడు రాగానే

ఎన్నోగొంతులు రాగానే?

పెద్దగొంతు ఎవ్వరం లేనట్టు గప్ చిప్ ఎక్కడివాళ్ళం అక్కడ నక్కేదాం వాడు రాగానే

ఎన్నోగొంతులు ఒక్కమాటుగా మీదపడి

పెద్దగొంతు No No అది తరహాకాదు ఒక్కొక్కరం వేరు వేరుగా

కొన్నిగొంతులు వంతుల ప్రకారం

కొన్నిగొంతులు ఏడిపించి

కొన్నిగొంతులు పీల్చి పిప్పిచేశి

కొన్నిగొంతులు వేశేద్దాం

పెద్దగొంతు Yes రైట్ అదీ అంతా ఎక్షన్ 1, 2, 3

[నిశ్శబ్దం. జట్కాబండి వచ్చి ఆగినశబ్దం. వర్షం కురుస్తున్న శబ్దం. తాళం తెరుస్తున్నశబ్దం. పెద్దతాళం జారిపడ్డ శబ్దం. రెండు పెద్ద ఇనప తలుపులు తెరిచిన శబ్దం నిశ్శబ్దం. అగ్గిపుల్ల గీచిన శబ్దం దగ్గు. ఒకకుర్చీ జరిపిన శబ్దం 'అమ్మయ్య' అన్న శబ్దం. ఒక గోడపటం ఊడి పడిన శబ్దం లక్ష గుడ్లగూబలు ఒక్కసారిగా అరిచి భయంతో వెంటనే ఆపిన శబ్దం. నిశ్శబ్దం. మళ్ళీ దగ్గు.]

కృష్ణమూర్తి ఇల్లు పెద్దదే

సేవకుడు అవును బాబయ్యా

కృష్ణ ఎన్నాళ్ళైందో కట్టి? ఎవరో కట్టింది?

సేవ మీ ముత్తాతగా రంటారు బాబూ

కృష్ణ ఆయనెన్నడైనా ఉన్నాడా ఈఇంట్లో?

సేవ గృహప్రవేశం చేశిన నెలలోగా తమ ముత్తవ్వగారు పోయారట వెంటనే పాడుపెట్టారు.

కృష్ణ చాలా పాతపడిపోయింది చాలా పాడు పడిపోయింది మరమ్మత్తు కూడా లేదు

సేవ ఎవరికిబాబూ శ్రద్ధ!

కృష్ణ ఊఁ

సేవ నేను వెళ్ళి వంట చేస్తా బాబూ

కృష్ణ ఊఁ

[నిశ్శబ్దం. అగ్గిపుల్ల గీసిన శబ్దం. చుట్ట వెలిగించిన శబ్దం. నిశ్శబ్దం దగ్గు. నిశ్శబ్దం. పరిహాససూచకంగా నొక్కి పట్టిన నవ్వులు. 'ఇస్' అన్న శబ్దం. నిశ్శబ్దం.]

ఎన్నోగొంతులు మహారాజరాజా! మార్తాండ తేజా! స్వాగతము! సుస్వాగతము హిహిహిహి **(F.out నిశ్శబ్దం)**

మళ్ళీ ఎన్నోగొంతులు మహారాజరాజా! మార్తాండతేజా! స్వాగతము! సుస్వాగతము! వంది మాగధుల కై వారములకు మారు పలుకవేల? హిహిహి **(F.out)**

కృష్ణ ఎవరు?

ప్రతిధ్వని ఎవరు?

కృష్ణ ఎవరుమీరు?

ప్రతిధ్వని ఎవరుమీరు **(F out)**

[ఒక క్షణం నిశ్శబ్దం]

ఒక పెద్దగొంతు అబ్బాయీ!

కృష్ణ ఎవరు నీవు?

పెద్దగొంతు ఎవరు నీవు?

కృష్ణ నేను నేను రాధాకృష్ణమూర్తిని రాధాకృష్ణమూర్తిని

ఒకగొంతు మరి రాధ లేకుండా వచ్చావేం?

ఒకగొంతు హిహిహి పెళ్ళికాలా?

కృష్ణ ఆ. ఆ

ఒక దీనమైన
ముసలిగొంతు నాయనా! కృష్ణుడూ.
కృష్ణ ఊ ఊ
ము గొం నేనురా తాతయ్యని. సీతయ్యని
కృష్ణ ఆ. ఆ.
ము. గొం బాగున్నావా? మనవంశ ప్రతిష్ఠ నిలబెడుతున్నావా? మన పదివేల ఎకరాల ఆస్తి పదిసెంట్లయినా తరుగు బడకుండా అలాగే కాపాడుకొస్తున్నావా? వడ్డీలెక్కలు సరిగ్గా చూచుకుంటున్నావా ?
కృష్ణ ఆ ఆ సాధ్యమైనంతవరకు, ప్రతిష్ఠా, బుగ్గి!
ము గొం. ఏడిశావ్, నాకు తెలుసులేవోయ్ అన్నీ మీ అమ్మే మంటగలిపింది
కృష్ణ అమ్మ! అమ్మ! ఆమె సుఖం ఆమె చూచుకుంది! ఎవరి సుఖం వారిది అంతేకదు తాతా
ము గొం. అవునులే అదీ నిజమే తరువాత ఎవరు పెంచార్రా నిన్ను
కృష్ణ నేనే పెరిగాను
ము గొ పిచ్చినాయనా! మీనాన్నకి క్షయ తగ్గిందా?
కృష్ణ క్షయ! క్షయ!
ము గొం ఇప్పుడెక్కడుందిరా మీ అమ్మ
కృష్ణ ఎక్కడో ఎవరిబ్రతుకు వారిది
ము గొం నాకు తెలుసులేవోయ్ మెరినా బీచ్‌లో ఆ యాక్టర్ పక్కన కూచుని కబుర్లు చెబుతోంది. పైగా మీ నాన్నకి పెద్ద స్నేహితుడు వాడు ఇంట్లో చేరి ఇంటికే ఎసరుపెట్టాడు
కృష్ణ అమ్మ! అమ్మ! **(దగ్గు)**
ము గొం కృష్ణుడూ, బి యల్ పట్టా పుచ్చుకున్నావా ?
కృష్ణ ఊ.
ము గొం. మరి ప్రాక్టీస్ పెట్టలేదేంరా? మన వంశంలో ఒక్కడైనా ప్లీడరవుతాడనుకున్నాను
కృష్ణ. **(చిన్న చిరునవ్వు)**
ము గొం కృష్ణుకూ మరిచాను ఇప్పుడు నీకెన్నేళ్ళురా?
కృష్ణ ముప్ఫయి
ము గొం అరె రామ! మరి పెళ్ళాడక పోయావ్ ఈడు మించిపోతే ఏపిల్ల వరిస్తుందిరా నిన్ను?
కృష్ణ పెళ్ళి! పెళ్ళాం! పిల్లలు! ఇల్లు! వాకిలి సంసారం!
ము గొం సంసారం సాగరం దుఃఖం అన్నారు నిజమేలే అయినా తప్పుతుందా? చిన్నతనంలో ఇందిరను ప్రేమించావుకదా? అది ఏమంది?
కృష్ణ ఒక తాసిల్దారును పెళ్ళాడి తాపీగా కాపరం చేస్తోంది
ము గొం. ఎన్నడైనా కనుపించిందా?
కృష్ణ ఊ ఎప్పుడో ఒకప్పుడు రైల్లో
ము గొం, అదీ నీ పెట్లోనే ఎక్కిందా?
కృష్ణ ఊ
ము. గొం నిన్ను చూచిందా?
కృష్ణ. ఊ చూడనట్టు చూచింది దానిపిల్లలు 'తాత' అంటూ నా చుట్టూ చేరారు
ము గొం మాట్లాడిందా?
కృష్ణ **(చిన్న చిరునవ్వు)** పిల్లల్ని విసుక్కుంది కొత్తాపాతా లేదని
ము గొం నీదగ్గరికి వచ్చారనా? దానిభర్త ఉన్నాడా ?
కృష్ణ ఊ అతనూ దాని పిల్లల్లో ఒకడు
ము. గొం వాడితో సరిగ్గా ఉంటుందట్రా
కృష్ణ ఓ మహాపతివ్రతలుకూడా పెట్టరు అదీ భర్తా, గంపెడు పిల్లలు, జవాన్లు, బొచ్చెడంత సామాను, పెద్ద ఇల్లాలైపోయింది ఇప్పుడు దాన్ని చూస్తే నిజంగా నాకు...
ము. గొం నవ్వొచ్చిందా?
కృ **(నవ్వుతాడు)** ఊ అదొక్కటే నేను నిజంగా నవ్విన నవ్వు
ము గొం ఎంతదూరం వెళ్లార్రా అలా
కృ నేను మదరాసు వెడుతున్నా అది నెల్లూరులో దిగిపోయింది
ము గొం దిగేప్పుడుకూడా మాట్లాడలా?

కృష్ణ • మాట్లాడలా చూచింది ఇంతేనన్నట్లు.
ము గొం : పోనీబాబూ మన చేతులో ఏముంది ?
ము గొం : కృష్ణుడూ ! అడగడం మరిచాను అదేవిట్రా నీనోరు అలా వాసనేస్తోంది
కృష్ణ • ఏమీలేదు.
ము గొం • నన్ను డబాయించకోయ్ నాకు తెలుసు మతి స్తిమితం లేక మద్యమాం సాలకు అలనాటుపడి ఉంటావు అంతేనా?
కృష్ణ (చిన్న చిరునవ్వు)
ము గొం అంచాతనేరా ఇంత చిక్కిపో యావ్ చిన్నప్పుడు గుమ్మడిపండల్లే ఉండేవాడివి
కృష్ణ ఊ
ము గొం కొంచెం చెడుఅలవాట్లు తగ్గించుకోబాబూ చిన్నతనంలో కొద్దోగొప్పో నేనూ అంటుపడ్డవాణ్ణే ఎలాగో చావు తప్పదు మనం కోరి తెచ్చుకోవడం దేనికి ?

[ఒక్కక్షణం నిశ్శబ్దం.]

వృద్ధవేశ్యారుద్ధకంఠం. నాయనా ! చిన్ని కృష్ణుడూ!
కృష్ణ : ఎవరు ?
వృ • అవ్వనిరా నీ అవ్వని వరసకులే.
కృష్ణ • అవ్వ !
వృ • మీ తాతయ్యగారి అనుంగు ఉంపుడు కత్తెని రంగుపుష్పనిరా మీఅమ్మ వట్టి అబ్బనాకారపుదిరా నీ పురుడు నేనే పోసింది చిట్టిబాబూ! నిన్ను తొట్టిలో ఊపి జోలపాడి నిద్రపుచ్చింది నేనేరా పుట్టడం ఆ అమ్మకైనా నాచేతుల్లోనే పెరిగావు చచ్చి గీ పెట్టినా నాచంక దిగేవాడివి కావు చందమామను చూపుతూ నీకు గుజ్జనగూళ్ళు పెట్టింది నేనేరా నాయనా! చిన్నికృష్ణుడూ! నీకు జ్ఞాపకం ఉందా?
కృష్ణ అంతగాలేదు ఎన్నోమాసిపోయాయి ఇదీ మాసిపోయింది
వృ • పిచ్చికృష్ణుడూ ! పిచ్చికృష్ణుడూ (వికటంగా నవ్వుతుంది)
కృష్ణ నవ్వకు ! నవ్వకు ! నాకు భయం - భయం - భయం వేస్తోంది
వృ • ఏం బాబూ ! నా నవ్వు వింటే నీకంత భయంగా వుంటే?పోనీ నవ్వనులేబాబూ. ఇప్పుడంటే ఇలా ఉంది కాని నాగొంతు బ్రతికి బట్టకట్టిన రోజుల్లో ఇలా ఉండే దనుకున్నావా బాబూ! అప్పుడు నీవెంత వాడివిలే నీకు తెలియడానికి మన ఊరికి దక్షిణాన - వేణుగోపాలస్వామివారి ఆలయం ఉంది చూశావ్
కృష్ణ ఆలయం !
వృ నీకు తెలీదులే నీకీ దేవుళ్ళలో దయ్యాలలో నమ్మకం ఉంటేగా, ఉన్నా ఏకిరస్తానీ దేవుడిలోనో
కృష్ణ లేదు ! లేదు ! నమ్మకంలేదు ! నాకసలు నమ్మకమే లేదు!
వృ నాకు తెలుసురా చిన్నితండ్రీ - నీకు ఎందులోనూ నమ్మకంలేదు అసలు నీలోనే నీకు నమ్మకంలేదు
కృష్ణ అవ్వా !
వృ వినరానాయనా విను ఏమిటీ చెబుతున్నాను. ఆ అదీ ఆ స్వామివారి ఆలయంలో ప్రతి ఏటా ఉత్సవాలు జరుగుతాయి మన ఊరు దేవదాసీలంతా తలా ఒకరోజు తమ నేర్పునంతా పెరుమాళ్ళ సన్నిధి కైంకర్యం జరుపుతారు, అందరికీ నాయకురాలిని నేనే కదురా అందుకని ఆఖరురోజు నా ఆట రంగపుష్ప గజ్జ కడుతూ ఉందంటే చుట్టుపక్కల ఆమడ దూరంనుంచి ఊళ్ళు ఊళ్ళూ తరలి వచ్చేవిరా బాబూ నమ్ము నమ్మకపో నాయనా - ఆరునాళ్ళ మునుపునుంచే జనం పడిగాపులు గాసేదిరా బాబూ ఇక రేపు సాయంవేళ పెరుమాళ్ళముందు గజ్జ కడతాననగా ముప్పూటలు ఏకభుక్తంచేశి పెరుమాళ్ళ నామమే స్మరిస్తూ ఏకాంతం సేవించేదాన్నిరా నాయనా

కన్నులన్నవి కమలాక్షు డిచ్చినందుకు నాటి సభ చూడాలిరా నాయనా ఇటు సర దాలుగల సరదారులంతా బారులు తీర్చి వేంచేసి ఉండేవారు అటు లోకపతి విలాసమూర్తి ఇక నా స్థితి ఏమిచెప్పను. అప్సరసలా అవతరించి అష్టపది అందు కుంటే అష్టకష్టాలూ మరుపుకు వచ్చేవిరా బాబూ ఆనందం గంధంలా అలము కునేదిరా బాబూ అలా పాడిపాడి తక్కి-తారి అర్ధమరేయికూడా గడిచి ఆకసం కొనల తొలి సంజరేక తొంగిచూచేవరకు కర్పూరంలా కరిగి సొమ్మసిల్లిపోయే దాన్నిరా తండ్రీ! అప్పుడు నా గొంతు చలిలాగ దూరి చక్కిలిగింతలు పెట్టే దిరా నాయనా! ఇప్పుడీ గొంతు ఇలా మారింది బాబూ!

కృష్ణ అవ్వా! అలాంటిదానికి ఈ దెయ్యపు బ్రతుకేమిటి?

వృ అదేబాబూ! చేసుకున్నవారికి చేసుకు న్నంత! తప్పుతుందా! నేను...అప్పు డలా ఆకాశంలో అంటులేని మెరుపల్లే ఉండేదాన్ని ... కాని...రానురాను... చూడు బాబూ...నా ఒళ్లే నాకు కానిదై పోయింది బాబూ... పెరుమాళ్ళకైన ఈ ఒళ్ళు సరదాల సర్దార్ల పాలయిందిరా తండ్రీ! పాటలూ పోయాయి, ఆటలూ పోయాయి మంచుగడ్డలా మాలిన్యం పేరుకుంది కడకు కడకు...(Weeps)

కృష్ణ అవ్వా!

వృ చెయ్యరాని పని చేశానురా చేతులారా చేశానురా నా మక్కువనంతా గంగ పాలు చేశానురా. మీ తాతయ్యను

కృష్ణ అవ్వా!

వృ విషంపెట్టి చంపింది నేనేరా బాబూ! లంచానికి గడ్డితిన్న ఘాతకిని నేనేరా బాబూ! అందుకనే బాబూ! చూడు. మీతాతయ్య ఊపిరిపోతూ ఒక కేకెట్టాడు ఆ కేకే నా గొంతుకైంది

సీ అవునురా

వృ చూశావా పోలిక

సీ చంపితే చంపావులే బ్రతికి ఉన్నప్పుడు చంపావు ఇప్పుడేం చంపుతావు ఇహ వెళ్ళి కాసేపు ముచ్చట్లు చెప్పు కుందాం రా.

వృ చూశావురా కృష్ణుడూ మీ తాతయ్య చచ్చినా సరసం చావలేదు

సీ వహ్వా! పోనిచ్చావుకావు సానిబుద్ధి. ఇహ రా! వెడదాం.

వృ ఏం అంతతొందర చచ్చినా ఇంకా చిన్నతనం పోలా ఉండండి మనుమడికి ఓ చిన్న ఉపదేశం చేశి రానివ్వండి కృష్ణుడూ!

కృష్ణ అవ్వా!

వృ అబ్బాయీ! నీకంటె పెద్దదాన్ని గనక చెబుతున్నాను విను

నీఅంత చదువుకున్నదాన్ని కాదు
డిగ్రీలు పొందినదాన్ని కాదు
గ్రంథాల బంధాలమధ్య కలిగినదాన్ని కాదు
తర్కమన్న తరువునీడ తపసుసలిపిన దాన్ని కాదు
అయినా చెబుతున్నాను విను
ఏదో నాకు దోచింది కొంత
నాలో నేను తూచింది కొంత
ఆకాశమంత అనుభవం ఉన్నదాన్ని గనక
అంతో ఇంతో ఆనందం అందరికీ పంచిన దాన్ని గనక
ఎన్నో కౌగిళ్ళమధ్య
ఎన్నెన్నో కథలు విన్నదాన్ని గనక
ఏదో నాకు తోచింది కొంత
నాలోనేను తూచింది కొంత
చెబుతాను విను
ఇన్నాళ్ళ తరువాత
ఈనాడు కూచుని
ఇన్నాళ్ళ ఖాతాలు
గోతాలు తీసిచూస్తే

నాకు ఒకటే కనుపించింది బాబూ.
నాకు ఒకటే అనిపించింది బాబూ
లాభంలేదు నష్టంలేదు.
వ్యాపారం బాగానే సాగింది.
కాని, పెట్టుబడిమాత్రం అలానే ఉంది.
ఆ పెట్టుబడి నేను
అందుకనే హాయిగా ఉన్నాను.
అప్పుడు పొంగనూలేదు
ఇప్పుడు కుంగనూలేదు.
అప్పుడు ఎండనూలేదు.
ఇప్పుడు పండనూలేదు.
ఒకలాగే సాగింది నా బ్రతుకు
సన్నగా సాగిపోయే పంటకాల్వలాగ.
ఊయల ఒకనాడు ఊగిందీలేదు.
ఊయల ఒకనాడు సాగిందీలేదు
నాటికీ నేటికీ ఒకే చిన్న తేడా కనిపించింది నాయనా
అనుభవాల ఆశల విఫలతల విపులవాహినిలో శరీరం సాలగ్రామంలా నునుపెక్కింది
స్వరం మారింది,
చూపు బరువెక్కింది.
అంతస్సు ఆకసంలా విచ్చుకుంది.
ఇలలేదు నాకు కలలేదు నావలనుంచి ఈవలికి వచ్చాను.
ఎన్నో గ్రామాలప్రక్క ప్రవహించి ఒక నదికడకు కడలి కౌగిలిచేరినట్టు చేరాను నేటికి ఆవలిగట్టు
ఇదేబాబూ! ఇంతవరకు నేను కన్న ఆఖరి మెట్టు
ఓం! శాంతిః! శాంతిః! శాంతిః!
ఇదీ నాకథ! అతి విచిత్ర చిత్రవధ!
ఇక చెప్పనా నీ కథ!
నీకథ నీకే తెలీదు,
నీలో వ్యథ నీకే వ్యక్తంకాదు
నీవొక నీడవి.
వెలుగువెంట వెడతావు.
వెలుగు నీవే అనుకుంటావు.
బాబూ! కాని, నీవొక నీడవి.
ఏనాడో నీలో పడింది
ఒక పెద్ద దూలంలాంటిది - నిశ్శబ్దం!
అది నీవు ఎత్తుకోలేవు
నీ మెడమీద అది కూచుంది.
అవస్థ పడుతున్నావు.
ఎంచాతనో ఒకపాత్ర ధరించావు.
ఆ పాత్రమాత్రం నీవుకావు.
అలాగని వేషం కడుక్కోవు.
రంగు వేసుకోకుండా
అద్దం చూచుకోలేవు.
అసత్యానికి అలవాటు పడిపోయావు
రిటైర్డ్ ఆఫీసరులా
అసత్యమనే పడకకుర్చీతో
అవినాభావసంబంధం ఏర్పరుచుకున్నావు
నీనీడ బైటపడదు.
నీలోనే పడుతుంది
అస్తమానం మనస్సు హెచ్చించుకుంటావు
అస్తమానం మనస్సును వెచ్చించుకుంటావు
అమ్మకడుపులోనే నీకు అన్యాయం జరిగింది
సమస్య అమావాస్యలా నీలో నిండుకుంది.
జోలపాటలోనే తల్లి కాలకూటంపెట్టింది
పుట్టడం చావడం ఒకేసారి జరిగింది నీకు.
ఒక్కమాటలో చెప్పాలంటే
నీ సమాధి నీలోనే ఉంది
నీ విరోధి నీలోనే ఉన్నాడు
నీవు నిజంగా బ్రతకడం
నీకే శుభంకాదు
అనుమానాల వనంలో చిక్కుకున్న
అమాయకుడా!
అలాగే అస్తమిస్తావు!
ఇక సెలవు బాబూ! ఇక సెలవు!

కృష్ణ. అవ్వా! (పెద్దకేక) (నిశ్శబ్దం)

[కృష్ణమూర్తి రొప్పుతున్న శబ్దం ఒక క్షణం నిశ్శబ్దం]

సేవకుడు: బాబుగారూ! వంట తయారైంది లేవండి భోంచేద్దురుగాని.

కృష్ణ: భోజనం వద్దు పాడూ వద్దురా, పోదాం పద

సేవకుడు: అదేమిటి బాబయ్యా!

కృ: అది అంతేరా. ఇల్లు పాడిపడింది. పాడుపడ్డ ఇంటిని బాగుపరచలేంరా మన భవనం శిథిలమైంది మన బ్రతుకూ ఛిద్రమైంది ఇహ పోదాం పద

[పెద్ద ఇనుపతలుపు కిర్రుమన్న శబ్దం-పెద్దపక్షి అరచిన శబ్దం నిశ్శబ్దం..]

❖

విజ్ఞప్తి

1958 జూన్ నెలలో ప్రారంభించబడిన నవభారతి, డిసెంబరువరకూ, అనగా 7 సంచికలు, నిర్విఘ్నంగా వెలువరించాం. కాని స్వంత ముద్రణాలయం ప్రారంభించాలని సంకల్పించడంవల్ల ఆ తరువాత పత్రిక వెలువరించడంలో కొంత కాలవిలంబన జరిగింది. స్వంత ముద్రణాలయం ప్రారంభించడం, దానికి డిక్లరేషన్ మార్చుకోవలసి రావడం, మొదలైన కార్యకలాపాలలో పూర్తిగా నిమగ్నులమై ఉండిపోయి 1959 జనవరి, ఫిబ్రవరి సంచికలు వెలువరించలేకపోయాం. ఎంత ప్రయత్నించినా మనుష్యయత్నంలో ఈపని సాధ్యం కాకపోయింది. దైవికంగా ఏర్పడిన అవరోధాలవల్ల ఇలా రెండు మాసాలు పత్రిక ఆపుచేయవలసివచ్చి, నవభారతి పాఠకులకు, చందాదారులకు, ఏజంట్లకు, అభిమానులకు అసౌకర్యం కలిగించినందుకు ఎంతగానో విచారిస్తున్నాం. ఇందులకు మమ్మ మన్నించవలసినదిగా వారికి మనవి చేస్తున్నాం. ఇకమీదట మామూలుగా, నవభారతి నెలనెలా మొదటివారంలోనే క్రమం తప్పకుండా వెలువడగలదనీ, ఎప్పటివలెనే పాఠకులు, చందాదారులు, ఏజంట్లు మాకు సంపూర్ణ సహకార సానుభూతులను అందించి పత్రిక పురోభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

ఇట్లు,

సంపాదక వర్గం.

శ్రీ భరతముని ప్రణీత

నాట్యశాస్త్రమ్

❖

ఆంధ్రభారతి

డాక్టర్ శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పి. హెచ్. డి.

చతుర్థోఽధ్యాయః — తాండవలక్షణమ్

10. అర్ధనికుట్టకము

అంచితౌ బాహూ శిరసి హస్త స్త్వభిముఖాంగులిః
నికుంచితార్ధయోగేన భవే దర్ధనికుట్టకమ్. ౭౯

అభిముఖముగా అలపల్లవ హస్తమును భుజశిరస్సున అంచితము చేయవలెను. చిటికెనవ్రేలునుండి క్రమముగా అరచేయిలో ఆవర్తపరివర్తనములు చేయుచున్న వ్రేళ్ళు ప్రక్కలకు వచ్చి వికీర్ణములైన అలపల్లవమగును. ఈ అలపల్లవ హస్తము సగము నికుంచితమై ఉన్నమన, వినమనములను గల్గియున్నచో అర్ధనికుట్టకమగును. ఆత్మగౌరవము. స్వోత్కర్షల విషయమందు ప్రరూఢమగు వాక్యార్థము నభినయించుచో నిది ప్రయోగింపబడును.

11. కటిచ్ఛిన్నము

పర్యాయశః కటిశ్ఛిన్నా బాహూ శిరసి పల్లవౌ
పునఃపునశ్చ కరణం కటిచ్ఛిన్నంతు తద్భవేత్. ౮౦

నడుము వంపుతిరిగినట్లున్న ఛిన్నకటి అందురు. ఊర్ధ్వ వ్యావర్తిత కరణముతో బాహువులను ప్రసరించి, పరివర్తనమున మణికట్టువద్ద స్వస్తికాకృతిగల పతాకలను పట్టినచో పల్లవ హస్తములు రాగలవు. వీటికి భ్రమరికాచారితో రెండు వైపుల భ్రమణమును చూపవలెను. కుంచితమైన పాదమునువెత్తి ముందుకు బాగుగా ప్రసారించి, నాలుగు తాళముల ఎత్తుగా అగ్రతలముతో అడుగు వేసిన అతిక్రాంత చారీ సిద్ధించును. ఈ అతిక్రాంతిచారీలో చెప్పబడిన కుంచిత పాదమును ఎత్తి భుజంగ త్రాసితమువలె త్రికోణాకృతితో నున్న ఊరువును. వివర్తింపజేసి, ద్వితీయ పాదతల భ్రమణమున శరీరమునంతయు పరివర్తింపజేసిన భ్రమరీచారీ రాగలదు.

ఈ చారీ ప్రయోగమైన తర్వాత మండల స్థానకమున నిలచి బాహు శిరస్సున పల్లవహస్తమును ప్రయోగించవలెను. ఇదేరీతిగా మూడు నాలుగు పర్యాయములు దీని నభినయించవలెను. విస్మయ ప్రధానమగు వాక్యార్థము నభినయించుటలో నీ కరణమును ప్రయోగించవలెను.

12. అర్ధరేచితకము

అపవిద్ధః కరః సూచ్యా పాదశ్చైవ నికుట్టితః
సన్నతం యత్ర పార్శ్వంచ తద్భవే దర్ధరేచితమ్. ౬౧

వ్రేళ్ళ నన్నిటిని శ్లిష్టములుగాచేసి బొటనవ్రేలిని కుంచించి, అరచేయి పల్లముగా నుండునట్లు జేసిన సర్పశిరస్సు వచ్చును. చతురశ్రస్థానమునందు సర్పశీర్ష హస్తములలోని బొటనవ్రేలు మధ్యవ్రేలియందుండగా చేతిని ప్రక్కకు ప్రసారించి చూపుడువ్రేలిని బాగుగా కన్పడునట్లు చేయవలెను. అట్టి బాహుప్రసారమును పర్యాయశః చేయగా సూచీ ముఖములు రాగలవు.

మండల స్థానమున నిలచి, ఒకచేతిని, ఖటకా ముఖముగా వక్షమున ఉంచి, రెండవదానిని సూచీముఖముగా చేయవలెను. ఈసూచీముఖహస్తమును అపగమ పూర్వకముగా దగ్గరకు తీసికొని బయటకు చాచునపుడు పార్శ్వము సౌష్ఠతాకృతిలో వంగియుండగా పాదము నికుట్టితము కావలెను. సగభాగము బయటకు పోవుటచే అర్ధరేచిత మగుచున్నది.

అసమంజసమైన చేష్టను ప్రధానముగా తెలుపు వాక్యార్థాభినయమున నీ కరణమునకు వినియోగము కలుగును.

13. వక్షః స్వస్తికమ్

స్వస్తికౌ చరణౌయత్ర కరౌ వక్షసి రేచితౌ
నికుంచితం తథా వక్షో వక్షఃస్వస్తిక మేవతత్. ౬౨

వక్షమువద్ద చతురశ్రములుగానున్న పతాకలను రేచితములుగాచేసి వ్యావృత్త కరణముతో ఆభుగ్నమగు వక్షమువద్ద స్వస్తికను ప్రయోగించి, ఇట్లే జంఘాగుల్ఫ వలనముగల పాదములతో స్వస్తికను చూపవలెను. అప్పుడది వక్షఃస్వస్తికమగును. వక్షస్థలము నిమ్నమై, వీపు ఎత్తుగానుండి, మధ్యమధ్య నిరవష్టంభమై, జారుచున్న భుజములతో ఉన్న ఉరఃప్రదేశమును ఆభుగ్నము, లేక నికుంచితము అందురు. దీనికి నృత్తముతో సంయోగము కలిగిన సౌష్ఠవము చేకూరును. సిగ్గు, పశ్చాత్తాపము అను వానిని ప్రధానముగా తెలుపు వాక్యార్థాభినయనమున దీనికి వినియోగము.

14. ఉన్మత్తకము

అంచితేనతు పాదేన రేచితౌ తు కరౌ యదా
ఉన్మత్తం కరణం తత్తు విజ్ఞేయం నృత్తకోవిదైః. ౬౩

మడమను భూమిపై నిలిపి, అరికాలిముందు భాగమును పైకిఉంచి, వ్రేళ్ళను ప్రసృతము చేసిన అంచిత పాదమగును. అంచిత పాదముతో, రేచిత హంసపక్ష హస్తములను ఆవిద్ధచారీ సహితముగా ప్రయోగించవలెను.

స్వస్తికగానున్న పాదములలో కుడిపాదమును కుంచించి, ప్రసారించి ఆవిద్ధముచేసి ఎడమకాలి మడమవద్ద కుడికాలి మడమను వేసిన ఆవిద్ధచారి యగును

దీనిని అంగపర్యాయముగా ప్రయోగించవలెను. అతి సౌభాగ్యము మొదలగువాని వలన కలిగిన గర్వమును తెలుపు వాక్యార్థాభినయమున నీ కరణమును ప్రయోగింపవలెను.

15. స్వస్తికము

హస్తాభ్యా మథ పాదాభ్యాం భవతః స్వస్తికౌ యదా
తత్స్వస్తిక మితి ప్రోక్తం కరణం కరణార్థిభిః. ౬౪

ఉద్వేష్టిత వర్తనమున ఎడమ చేతిని నిష్క్రమింపజేసి, వ్యావర్తిత కరణమున హస్తపాదములకు ఒకే సమయమున స్వస్తికను పట్టవలెను.

వాక్యార్థాభినయ లక్షణములు, నృత్తాంగహార రూపములు, గతి పరిక్రమాది స్వభావములు నగు క్రియలను తెలిసికొనినవారికే కరణము లుపకరించగలవు. అన్యులకు కాదని తెల్పుటకు కరణార్థులచే నీ కరణము చెప్పబడినదని భరతుడనుచున్నాడు.

యుక్తాయుక్త వివేచన చేసి ద్వేషమును నిషేధమును తెలుపు వాక్యార్థమున నీ కరణము నుపయోగించవలెను.

16. పృష్ఠస్వస్తికము

విక్షిప్తాక్షిప్త బాహుభ్యాం స్వస్తికౌ చరణౌ యదా
అపక్రాంతా ర్ధసూచిభ్యాం తత్పృష్ఠ స్వస్తికం భవేత్, ౬౫

కుంచితమైన పాదమును ఎత్తి ముందుకు బాగుగా ప్రసారించి, నాలుగు తాళముల ఎత్తుగా అగ్రతలముతో భూమిపై వేసిన అపక్రాంతచారీ సిద్ధించును. కుంచిత పాదమును, ఎత్తి జానుపర్యంతము జంఘను ప్రసారించి, అగ్రతలముతో భూమిపై నుంచిన సూచీచారీ రాగలదు.

ఉద్వేష్టిత క్రియతో రెండుచేతులను విక్షేపించుచు అపక్రాంత చారీని ప్రయోగించవలెను. అపవేష్టిత కరణము నాడుచు రెండవ పాదముతో సూచీచారీని ఆడి, హస్తములతోను, పాదములతోను స్వస్తికను పట్టవలెను. కుడి కాలి వెనుక ఎడమకాలి నుంచి త్రికవలనముతో పరాఙ్ముఖ మగుచు, స్వస్తికను పట్టగా పృష్ఠస్వస్తిక మగుచున్నది. స్వస్తికకు చెప్పిన వినియోగమునే ఇచటకూడ చెప్పికొనవలెను.

17. దిక్స్వస్తికము

పార్శ్వయో రగ్రతశ్చైవ యత్ర శ్లిష్టగతో భవేత్
స్వస్తికో హస్తపాదాభ్యాం తద్దిక్స్వస్తిక ముచ్యతే. ౬౬

ప్రక్కలకు, ముందు వెనుకలకు త్రుటితమగు బొటన వ్రేలితో హస్తములకు, పాదములకు స్వస్తికను పట్టిన దిక్స్వస్తిక యగును. గీతపరివర్తములయందీ కరణమును ప్రయోగించవలెను.



10



11



12



13



14



15



16



17



18


19


20


21


22


23


24


25


26


27

18. అలాతకము

అలాతం చరణం కృత్వా వ్యంసయే ద్దక్షిణం కరమ్
ఊర్ధ్వజాను క్రమం కుర్యా దలాతక మితి స్మృతమ్. ౬౬

అలాతచారీని మొదట ప్రయోగించవలెను కుడికాలిని వెనుకకు ప్రసారించి వలనముతో లోనికి తెచ్చి, రెండవ తొడకీ యరికాలిని అభిముఖము చేయవలెను తర్వాత మడమతో దీనిని క్రిందవేసిన అలాతచారీ యగును. భుజములనుండి విచిత్రతతో ఉత్తానాధోముఖములుగా నిష్క్రమించు పతాకలను నితంబనుదాకా వర్తింపజేయగా నితంబహస్తము లగును వీనిని ఊర్ధ్వజానుచారీతో చూపవలెను కుంచిత పాదమును జానుస్తన సమముగాఎత్తి స్తబ్ధముగా నుంచవలెను ఇట్లే రెండవపాదమునకు గూడ చేయగా ఊర్ధ్వజానుచారీ రాగలదు.

కుడిపాదముతో అలాతచారీని చూపుచు. కుడిచేతిని నితంబహస్తముగా చేసి, చతురశ్రముగా చూపవలెను ఎడమ పాదముతో ఊర్ధ్వజానుచారీని చూపి, ఎడమ చేతిని పైవిధముగా చేయవలెను ఇట్లువచ్చు కరణమును లలితనృత్త విషయమున ప్రయోగించవలెను

19. కటీసమము

స్వస్తికాప సృతః పాదః కరౌ నాభి కటి స్థితౌ
పార్శ్వ ముద్వాహితం చైవ కరణం తత్కటీసమమ్. ౬౭

పాదములతో స్వస్తికముపట్టి వాటిని వేరుజేయవలెను వేరు జేయుటలో ఆక్షిప్తచారీ అపక్రాంత చారీలు ప్రయుక్తము లగును. కుంచిత పాదమును పైకి త్రితాల దూరముగా ఎత్తి పిక్కలవరకు తీసికొనివెళ్ళి మడమను స్వస్తికగా భూమియందుంచిన ఆక్షిప్తచారీ రాగలదు ఊరువలనము గావించి, కుంచిత పాదమును ఎత్తి ప్రక్కగా వేసిన అపక్రాంత చారీ వచ్చును చేతులతోగూడ స్వస్తికను పట్టి, చేతులను విడదీయగా, ఒకచేయి ఖటకా ముఖమై నాభివద్ద ఉండును రెండవచేయి అర్ధచంద్రమై నడుమునద్ద నుండును ఇట్లుచేయగా, ఒకప్రక్క వంగినట్లుండి రెండవ ప్రక్క ఉద్వాహిత మగును

కపిత్థ హస్తములోని అనామికను చిటికెన వ్రేలితో కూడ పైకిఎత్తి వంచిన ఖటకాముఖ మగును నాలుగు వ్రేళ్ళను బాణమువలె ఉంచిన అర్ధచంద్రమగును ఉరఃప్రదేశ మెత్తుగా నున్నట్లు చూపుట ఉద్వాహితము ఈ కరణ ప్రయోగమున వైష్ణవ స్థానకమును చూపవలెను రెండుపాదములకు మధ్య రెండున్నర తాళముల దూరముంచి, ఒక పాదమును త్రికోణముగా పైకిఎత్తి, రెండవదానికి పార్శ్వాభిముఖములగు వ్రేళ్లు కలదానినిగా చేయవలెను. అప్పుడు జంఘములను కొంచెము వంచగా సౌష్ఠవాంగ పురస్కృతమైన వైష్ణవ స్థానక మగును

20. ఆ క్షి ప్త రే చి త ము

హస్తౌ హృది భవే ద్వామః సవ్య శ్చాక్షిప్తరేచితః
రేచిత శ్చాపవిద్ధశ్చ తత్ స్యా దాక్షిప్తరేచితమ్. ౬౯

హృదయమువద్ద హంసపక్ష హస్తముల నుంచవలెను అప్పుడు కుడిచేతిని రెండుప్రక్కలకు పైకి వ్యావర్తిత కరణమున చాచుచు, రేచితముగా హంసపక్ష హస్తమును చూపవలెను. ఇట్లు ఆక్షిప్తమైన హస్తమును కుడివక్షము వద్దకు అధోముఖముగా తెచ్చి అంచితము చేయవలెను ప్రక్కలకు పైకి, క్రిందకు అంచితముచేసిన అపవిద్ధ మనబడును అంచితమై రేచితమగు శరీరమునుంచి బయటకు పోయినచో ఆక్షిప్తరేచితమగును. అంచిత సూచీరూపముగా పాదముల నుంచవలెను త్యాగము, ఉపాదానను, అన్యోన్యతను తెలుపు వాక్యార్థము నభినయించుటలో దీనిని ప్రయోగింపవలెను

21. వి క్షి ప్తా క్షి ప్త క ము

విక్షిప్తం హస్తపాదంచ తస్యై వాక్షేపణం పునః
యత్ర తత్కరణం జ్ఞేయం విక్షిప్తాక్షిప్తకం ద్విజాః. ౭౦

ఒక హస్తమును వ్యావర్తనము చేయునపుడు పాదము బయటకు పంపబడినచో విక్షేప మందురు రెండవచేయి చతురశ్రముగా నుండును పరివర్తనమున హస్త పాదముల నాక్షిప్తములుగాచేసి, రెండవ హస్తపాదములతో విక్షేప గమనాగమనముల నభినయించ వలెను ప్రధానవాక్యార్థమున నీ కరణము నుపయోగింపవలెను, అభినయాంతరాళములయందు, గతిపరిక్రమమున, తాలాంతర సంధానమున, యుద్ధ నియుద్ధచారీ స్థానమున, సంచారమున నీ కరణ ముపకరింపగలదు

22. అ ర్ధ స్వ స్తి క ము

స్వస్తికౌ చరణౌ కృత్వా కరిహస్తంచ దక్షిణమ్
వక్షఃస్థానే తథా వామ మర్ధస్వస్తిక మాదిశేత్. ౭౧

రెండుప్రక్కలకు అడ్డముగా ప్రసరింపబడు పతాకలు లతాహస్తము లగును ఈ లతాహస్తమును ఒక ప్రక్కనుంచి మరొక ప్రక్కకు ఊయలవలె నూపుచు రెండవ చేతిని త్రిపతాకగా చెవివద్ద నుంచిన కరిహస్తము వచ్చును పాదములను స్వస్తికగానుంచి, కుడిచేతితో కరిహస్తమునుపట్టి ఎడమ చేతిని ఖటకాముఖముగా, వక్షస్థలమున నుంచవలెను ఇచట కేవలము పాదములతోనే స్వస్తిక రాగలదు గనుక అర్ధస్వస్తిక మనబడినది

23. అం చి త ము

వ్యావృత్త పరివృత్తస్తు సఏవతు కరో యదా
అంచితో నాసికాగ్రేతు తదంచిత ముదాహృతమ్. ౭౨

అర్ధస్వస్తిక కరణమున నేచేతిని కరిహస్తముగా నుంచవలెనో దానినే వ్యావర్తితకరణమున ముక్కుదగ్గరకు తీసికొని రావలెను అలపల్ల వాకృతి గలిగి అంచితో

దంచిత సారణను అనుసరించుటచే అంచితకరణమని పిలువబడుచున్నది తన విష యము తాను చెప్పుకొనునపుడు, స్వాతిశయ కౌతుకము గల్గినపుడు, నిర్వాణప్రధాన మైన వాక్యార్థమున నీ కరణము నభినయించవలెను.

24. భుజంగత్రాసితము

కుంచితం పాద ముత్షిప్య త్ర్యశ్ర మూరుం నివర్తయేత్
కటీ జాను నివృత్తౌచ భుజంగత్రాసితం భవేత్ ౭౩

కుంచితపాదమును ఎత్తి ఊరువును త్రికోణాకృతిలో నుంచవలెను కటిజాను వులను వివర్తింపజేయవలెను పాదవిన్యాస వశమున చేతులను గూడ వ్యావర్తిత పరి వర్తితములుగా చేయవలెను. కుడిచేయి డోలాహస్తము, ఎడమచేయి ఖటకాస్యము ఈ కరణమున భుజంగత్రాసిత మనబడు చారీని ప్రయోగించవలెను కుంచితపాద మును రెండవ ఊరుమూలము వరకు ఎత్తి కటిజానువుల నివర్తనద్వారా పిరుదు కెదురుగా మడమ నుండునట్లు చేసిన త్రికోణాకృతిగల ఊరువు సిద్ధించగలదు దీనిని వివర్తింపజేయగా భుజంగత్రాసిత చారీవచ్చును. సర్పభయమువలన కలుగు గతిని పోలియుండున దీకరణము

25. ఊర్ధ్వజానువు

కుంచితం పాదముత్షిప్య జానుస్తన సమం న్యసేత్
ప్రయోగవశగౌ హస్తావూర్ధ్వజాను ప్రకీర్తితమ్ ౭౪

మడమను ఎత్తి కాలివ్రేళ్ళను కుంచించి, మధ్యభాగమును కూడ కుంచి తము చేయగా పాదము కుంచితమగును ఇట్టి కుంచితమగు కుడిపాదమును జాను స్తన సమనుగా ఉంచవలెను అదే సమయమున కుడిచేయి ఊర్ధ్వముఖమైన లల పల్లవముగా గాని, అరాలముగా గాని ఉండవలెను ఎడమచేయి ఖటకాముఖమై ఎడమరొమ్ము వద్ద నుండగా ఊర్ధ్వజానువు రాగలదు

26. నికుంచితము

వృశ్చికం చరణం కృత్వా కరం పార్శ్వే నికుంచయేత్
నాసాగ్రే దక్షిణంచైవ జ్ఞేయం తత్తు నికుంచితమ్. ౭౫

వెనుక ప్రక్కగా శిరోభాగమువరకు పాదమును సాచినచో వృశ్చిక పాదము రాగలదు. కుడిపాదమును వృశ్చిక పాదముగాచాచి, ఎడమచేతిని అరాలముగా పార్శ్వమునకు ప్రసారించవలెను. ఈ విధముగా చాచునపుడు ఎడమచేయి తలకు ప్రక్కభాగమునుంచి రావలెను కుడిచేయి నాసాగ్రమునుండి బయలుదేరి అరాల ముగా రొమ్మువద్దకు చేరవలెను ఆకాశగమనమునకు బయలుదేరునపుడు, సందేహ మును, ప్రణిధానమును తెలుపునపుడు ఈ కరణము నభినయించవలెను

27. మత్తల్లి

వామ దక్షిణ పాదాభ్యాం ఘూర్ణమానోపసర్పణైః
ఉద్వేష్టితాపవిద్ధైశ్చ హస్తైర్మత్తల్ల్యుదాహృతమ్. ౭౬

జంఘాస్వస్తిక యోగముతో అర్ధత్రికోణాకారమున నున్న ఊరువులను ఘూర్ణింపజేయుచు విడదీయుచు, ఉద్వేష్టితాపవిద్ధములగు నితంబ హస్తములను చూపగాసిద్ధించు మత్తల్లి యను చారీ విధానము నిచ్చట ప్రయోగించవలెను రెండవపాదము మడమను వేరుజేయుటకు ముందు నితంబహస్తములను ఉద్వేష్టితములుగా చేసి, వేరుజేయు సమయమున అపవిద్ధోపవేష్టనములుగా జేయవలెను ఇట్లు అంగపర్యాయముగా అనేక పర్యాయములు చేయ మత్తల్లి యనుకరణము రాగలదు ఇది అగాధమద విషయమున ప్రయోగింపబడు కరణము

STATEMENT ABOUT OWNERSHIP & OTHER PARTICULARS ABOUT

NAVA-BHARATHI

A Literary & Cultural Telugu Monthly

FormIV (See Rule 8) The Registration of News-Papers(Central)Rules,1956

1	Place of publication	Gandhinagar, Vijayawada-2
2	Periodicity of its Publication	First week of Every month
3	Printer's Name	Sri J. Radhakrishna Reddy
	Nationalty Indian	Address Vijayawada
4	Publisher's name	Sri J Radhakrishna Reddy
	Nationality Indian	Address Vijayawada
5	Editor's Name	Sri J Radhakrishna Reddy
	Nationality Indian	Address Vijayawada.

6 Names and Addresses of Individuals who own the News-Paper and Partners or Share - holders, holding more than one per-cent of the total capital

Names	*Addresses*
SRI CHADALAVADA PITCHAYYA.	VIJAYAWADA.
SRI J RADHAKRISHNA REDDY	VIJAYAWADA

I, J Radhakrishna Reddy, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief

J. RADHAKRISHNA REDDY

1—3—'59 Signature of publisher

మృత్యుముఖంలో తుదిరోజు

విక్టర్ హ్యూగో

అనువాదం: శ్రీ రెంటాల గోపాలకృష్ణ

16

ఆస్పత్రిలో కిటికీచెంత కూచునిఉన్నాను ఫెళఫెళ ఎండ కాస్తోంది. ఎండ చూస్తూ కూచుంటే ఎంత హాయిగాఉంది! పోనీలే, కనీసం కళ్ళారా ఎండచూచే ప్రాప్తమైనా ఉన్నది నాకు

తల వాల్చుకుని చెంపన చేతులు పెట్టుకుని దీనాతిదీనుడనై కూచున్నాను నా కాళ్ళూ, చేతులూ సర్వాంగాలూ, చచ్చుపులు పుడుతున్నాయి

ఈ చెఱసాల జీవితం నన్ను ఛిన్నాభిన్నం చేసింది ఖైదీల సంకెళ్ళ చప్పుడు ఇంకా నా చెవులలో మారుమ్రోగుతోంది అబ్బ! ఎంత ఆయాసంగా ఉన్నది! ఏదైనా చల్లని మెల్లని సంగీతం చెవిని పడితే బాగుండును ఆ భగవంతుడు మధురగీతం పాడే ఒక పక్షినైనా నాకోసం పంపించి నా మనస్సుకు హాయి కలిగించ కూడదూ?

నా మొఱలు దేవుళ్లే విన్నారో దయ్యాలే విన్నాయో తెలీదు కాని-సరిగ్గా అదే సమయంలో నా కిటికీ దిగువ భాగాన ఒక చల్లని మెల్లని కంఠం వినిపించింది. అది ఒక పక్షి పాట కానేకాదు కోయిల కంఠాన్ని మించిన ఒక మానవకంఠం పదిహేనేండ్ల అమ్మాయి చేసిన మధురగానం! ఎంత స్వచ్ఛంగా, ఎంత హాయిగా, ఎంత తీయగా ఉన్నదా పాట!

హఠాత్తుగా తలఎత్తి చూచాను ఆపిల్ల పాడుతున్న పాట శ్రద్ధగా విన్నాను అదొక విషాద గీతం మానవ హృదయాలను ఒక్కుమ్మటుగా కలచివేసే విలాపగానం అది! ఆ పిల్ల ఇలా పాడింది

బ్రతుకు బాధల కడలి భయపెట్టునోయి!
చితికిన జీవితము చిగురించదోయి!
చూడ ఈలోకమున సుఖము లేదోయి!
వాడిపోయిన వయసు తిరిగి రాదోయి!
బ్రతుకు బాధల కడలి భయపెట్టునోయి!
చితికిన జీవితము చిగురించదోయి!

ఈపాటవిని ఎంతగా క్రుంగిపోయానో చెప్పలేను మనస్సంతా వికలమైపోయింది. కడుపులో చెయ్యిపెట్టి దేవుతున్నట్లనిపించింది ఆ అమ్మాయి మళ్ళీ ఒకపాట పాడడం మొదలుపెట్టింది

చిన్నారి బ్రతుకులో చిచ్చుపెట్టా రెవరో,
కన్నెపూవలపులో విషము కలిపా రెవరో!
ఆశదీపపు ప్రమిద లార్పివేశా రెవరో
మోసులెత్తినమనసు మోసపుచ్చా రెవరో!
జీవితంలో వెలుగు రాదోయి, రాదోయి!
చింతించి లాభంబు లేదోయి, లేదోయి!
వసుధ జన్మించుటే ఒక మహాపాపం!
వరుస మానవకోటి కిది ఘోరశాపం!!

తరువాత నాకు వినిపించలేదు ఇహ నేను వినదలుచుకోలేదు కూడా అబ్బ! ఆ అమ్మాయి పాడిన పాట ఎంత భయంకరంగా ఉంది, అయ్యో, భగవంతుడా! నిండా పదహారేండ్లు లేవు ఆ పిల్లకు, ఉన్న జీవితంఅంతా ముందే ఉన్నది ఆమె జీవితం చిగుళ్ళు తొడిగి, మొగ్గలువేసి పుష్పించాలి, మకరంద మాధుర్యాలు కురిపించాలి, వెన్నెల వెలుగులు నిండాలి, ఆపిల్ల బ్రతుకు పండాలి - మరి అప్పుడే ఆవిడకు జీవితంమీద ఇంత వెగటు పుట్టిందా! ఏమిటీ విడ్డూరం? చిన్న చిరుగాలి వీచినా తాళలేని తీగెలాగా ఉన్నదే ఆపిల్ల! మిలమిల మెరిసే ఆ నీలికన్నులనుండి వెన్నెలలు కురుస్తున్నాయే, పలుచని పూరేకుల

వంటి ఆ చిరుపెదవులనుండి అమృత ధారలు వర్షిస్తున్నాయే - ఇంత భయంకరమైన, విష విషాదభరితమైన పాట ఆపిల్ల నోటినుండి ఎలా వెలువడింది?

ఏమో, అర్థం కావడంలేదు ఆపాట విన్నప్పుడు నేనెలా ఉన్నానోకూడా వ్యక్తం చేయలేను నాకు దుర్భరమైన బాధ కలిగిందీ, ఆ బాధతోపాటే నన్నెవరో లాలిస్తున్నట్లూ పాలిస్తున్నట్లూ అనిపించింది! ఆవిడ కంఠస్వరం, ఒక బాలిక కంఠస్వరంగానూ అదే తరుణంలో ఒక వృద్ధ స్త్రీ రోదనంగానూ వినిపించింది!

అబ్బబ్బ! యీ చెఱసాల ఎంత నికృష్టమైన ప్రదేశం! ఎంత వెగటుగా ఉన్నదిక్కడ! అంతా విషం, కాలకూట విషం ఇక్కడున్న ప్రతి అణువూ విషంతో సమానం అప్పుడే రేకులు విచ్చిన గులాబీ పువ్వులాఉన్న అమ్మాయిని కూడా ఏదో కాలనాగు కాటందింది! ఇక్కడో చిన్నపిట్ట కనుపించినా, దాని రెక్కలకు దుమ్ము అంటుకుంటుంది ఒక చక్కనిపువ్వు త్రుంచి వాసన చూస్తే, తక్షణం ప్రాణం పోతుంది!

17

ఒకవేళ నేనీ ఆస్పత్రిలోనుంచి తప్పించుకుంటే మాత్రం - పొలాలలోనుంచి ఎలా పారిపోవాలి ?

ఉహూ వీల్లేదు పారిపోవడం సాధ్యం కాదు ఎవరికంట పడినా అనుమానిస్తారు కనుక మెల్లగా, తల వొంచుకుని పెద్దమనిషిలా నడిచి వెళ్ళాలి నన్నెవరూ కనుక్కోకుండా మారువేషం వేసుకోవాలి ఈచుట్టు ప్రక్కల పల్లెలలో జనం ఏదుస్తులు వేసుకుంటారో నేనూ ఆ దుస్తులే వేసుకోవాలి అప్పుడు నన్నెవరూ గుర్తు పట్టరు

'అర్యాయెల్' ప్రాంతంలో ఒక చిన్న కుంట, ఆకుంట ఒడ్డుననే గుంపుగాఉన్న చెట్ల తోపు ఉన్నాయి చిన్నతనంలో నేను బళ్లో చదువుకునేటప్పుడు అప్పుడప్పుడు అక్కడికి వెడుతుండేవాణ్ణి కుంటలో కప్పలను పట్టుకుని సరదాగా ఆడుకునేవాణ్ణి! ఇప్పుడక్కడికి వెళ్ళి ఆ కుంటఒడ్డున తోపులో దాక్కోవచ్చు బ్రహ్మరుద్రుడు కనుక్కోలేడు చీకటి పడినదాకా అక్కడ దాక్కొనిఉండి, మళ్ళీ రాత్రిపూట ప్రయాణం సాగించాలి సరాసరి 'విన్ సెన్నెస్'కు వెళ్ళవచ్చు అహాఁ వీల్లేదు. ఆ త్రోవనే వెడితే మధ్యలో నది అడ్డం వస్తుంది! అంచాత నేను, ఇట్లా చుట్టూతిరిగి 'ఆర్పజాన్'కు వెళ్ళాలి - 'సెయింట్ జర్మెయిన్' దిశగా ప్రయాణం సాగించి 'హార్వే' చేరుకోడం మంచిది అక్కడనుంచి పడవమీద ఇంగ్లండు పోవచ్చు - కాని ఏమిటి ప్రయోజనం? 'లాంగ్ జార్యూ్య' చేరుకోగానే ఎవడో ఒకపోలీసువాడు నన్ను పట్టుకోనే పట్టుకుంటాడు 'ఏదీ, ప్యాస్ పోర్టు చూపించూ?'అని అడుగుతాడు దాంతో... నాపని ఖాళీ!

అయ్యో, దౌర్భాగ్యుడా! ఎన్ని కలలు కంటున్నావురా నాయనా! ఇన్ని కలలు కనేవాడివి కనుకనే చివరకు నీగతి ఇలా అయింది ఎక్కడికి తప్పించుకపోతావు? చుట్టూ మృత్యువు నిన్ను ముట్టడివేసి ఉంది చావుకోసమే నీవీ 'బిసిట్రీ' జైలుకు వచ్చావు, కనుక ఇక్కడ పిచ్చాసుపత్రిలో ఉన్నట్లుండి, అల్లాడి అల్లాడి ఆకులుమేసి చావు! అంతే!

18

నా ఆత్మకథ, నా అనుభూతి ఇలా వ్రాసుకుంటూ పోతున్నాను అంతట్లో దీపకాంతి మందగించడం మొదలు పెట్టింది భల్లున తెల్లవారిపోయింది జైల్లో గోడ గడియారం ఆరుగంటలు కొట్టింది

కాపలావాడు నా గదిలోకి వచ్చాడు తలమీది టోపీ తీశాడు నాకు 'శాల్యూట్' చేశాడు.

"మీ పనికి అంతరాయం కలిగించానేమో, నన్ను క్షమించండి" అని ఒడ్డుకున్నాడు

"ఏమైనా తింటారా? ఏంతీసుకు రమ్మంటారు?" అని అడిగాడు అతని కంఠస్వరం ఎంతో మృదువుగా ఉంది. అతని ముఖంలో ప్రసన్నత అగుపిస్తోంది

నేను గడగడ వణికిపోయాను వళ్ళంతా కంపరం పుట్టింది. అయ్యో, భగవంతుడా! ఆక్షణం రానేవచ్చిందా ఏమిటి? ఇవాళేనా నన్ను ఉరి తీసేది?

19

ఇవాళేనా నన్ను ఉరితీసేది?

జైలు గవర్నరు స్వయంగా ఒకమాటు వచ్చి నన్నుచూచి వెళ్ళాడు

"ఏమయ్యా? నీ కిక్కడ అంతా సౌకర్యంగా ఉన్నదా? జైలు ఉద్యోగులు, కాపలావాళ్ళు నీతో మన్ననగా ఉంటున్నారా? లేక వాళ్ళమీద ఫిర్యాదు లేమైనా ఉంటే చెప్పు?

నీ ఆరోగ్యం ఎలాఉన్నది? రాత్రిళ్ళు ఎలా గడుపుతున్నావు? బాగా నిద్ర పడుతున్నదా? చెప్పవయ్యా, నావల్ల అయ్యేపని ఏమైనా ఉంటే చెప్పు తప్పక చేస్తాను చెప్పు 'మాన్ పియర్' అంటూ గవర్నరు నాయోగక్షేమాలు విచారించి వెళ్ళాడు నన్ను మర్యాదగా 'మాన్‌పియర్' అని సంబోధించాడు

అంచాత ఇవాళేనేమో నన్ను ఉరితీసేది? అవును ఇవాళే అయిఉండాలి!

20

తననుగురించిగాని, తన సహచరులను గురించిగాని ఫిర్యాదు చేయవలసినదేమీ లేదన్నాడు కాపలావాడు అతను యథార్థమే చెప్పాడు పరాయి అమ్మ కన్నబిడ్డలు వాళ్ళ మీద లేనిపోని అభాండాలు వేయడం, పితుర్లు చెప్పడం నాకు న్యాయంకాదు పాపం, వాళ్లేం చేశారు? వాళ్ళవిధి వాళ్లు నిర్వర్తించారు నన్ను సక్రమంగానే చూచారు. అప్పుడు - ఇక్కడికి వచ్చిననాడూ మర్యాదగానే చూచారు ఇప్పుడు - ఇక్కడి నుంచి వెళ్ళిపోతున్న నాకూమర్యాదగానే చూచారు మరి అంతటితోతృప్తిపడక నాకు వాళ్ళమీద ఫిర్యాదు లెందుకూ?

ఈ కాపలావాడు మంచివాడు పెదవులపై చిరునవ్వు ఉంటుంది కాని విషపునవ్వు నెమ్మదిగా మాట్లాడతాడు కాని ఆ మాటలు నా గుండెల్లోనుంచి దూసుకపోతాయి. ప్రసన్నమైన చూపు కాని ఆచూపు సూదిలా తాకుతుంది నిరంతరం నామీద నిఘా ఉంచుతుంది నిజానికి జైలు అతని రూపంలో అవతారమెత్తింది! మానవ రూపంలో ఉన్న 'బిసెట్రీ' చెఱసాల అతను నాచుట్టూ చెఱసాల అనేక అవతారాలతో అగుపిస్తున్నది ప్రతిరూపంలోనూ దానిని నేను చూస్తున్నాను మనిషి రూపంలోనేకాక, ఇనుపగడియ రూపంలోకూడా దానిని చూస్తున్నాను ఈగోడ, రాతిరూపంలో ఉన్న చెఱసాల ఈతలుపు కొయ్యరూపంలో ఉన్న చెఱసాల ఈ కాపలావాళ్లు మానవాకృతిలో ఉన్న చెఱసాలలు! భయంఅనే దానికి మారురూపు చెఱసాల నేను దానికి ఆహారం అది నన్నుగురించే తలపోస్తుంది నన్ను కౌగిట్లోకి తీసుకుంటుంది. గోడలనే హస్తాలతో పట్టుకుని నొక్కుతుంది కాపలావాళ్ళనే కళ్లతో నన్ను కనిపెడుతూ ఉంటుంది ఇనుప కటకటాలు, గడియలనే దౌడలతో నన్ను నమిలి వేస్తుంది!

అయ్యో, పరమేశ్వరా! నేనేమైపోతానో కదా? నన్ను వాళ్ళు ఏంచేయనున్నారో కదా?

21

ఇప్పుడు నాకు ప్రశాంతత చిక్కింది అవును అంతాఅయిపోయింది. పూర్తిగా అయిపోయింది, జైలు గవర్నరు నన్ను చూడడానికి రాగానే నాకు 'షాక్' కొట్టినట్టయింది, కాని ఇప్పు డందులోనుంచి తేరు

కున్నాను. ఎందుకంటారా? నిజం చెపుతున్నాను నాకింకా ఆశవుంది!...

అవుతే, ఇప్పుడు ఇహ నాకు ఏ ఆశ లేదు

అసలు జరిగింది ఇది

సరిగ్గా ఆరున్నర గంటలు కొట్టేసరికి, కాదుకాదు-ఆరుంపావు అయ్యేసరికి, నాచెఱసాల గదితలుపు తెరుచుకున్నది బూడిద రంగు కోటు వేసుకున్న ఒకవృద్ధుడు లోనికి వచ్చాడు తల ముగ్గుబుట్టలా పండిపోయింది. ఆయన ఒక మతగురువు కాని జైలుకు చెందిన మతగురువు కాదు మరణ కాలంలో హాజరయ్యే వేరే మతగురువు ఆయన

ఆయన నా కెదురుగా కూచున్నాడు ప్రసన్నమైన వదనం పెదవులపై చిరునవ్వు తొంగి చూస్తున్నది శిరస్సు పంకించాడు కనులు పైకెత్తాడు ఒక్కక్షణంసేపు గది పైకప్పువంక చూచాడు నా కర్థమైంది

"నాయనా! సన్నాహాలన్నీ చేసుకుని సంసిద్ధుడవై ఉన్నావా?" అని అడిగాడు మతగురువు

నాకు గొంతుపట్టుకున్నట్లయింది

"సన్నాహాలేమీ చేసుకోలేదు స్వామీ కాని సిద్ధంగా ఉన్నాను!" అని మంద స్వరంతో జవాబు చెప్పాను నా కనులు చెమ్మగిల్లాయి శరీరంలో సంధులన్నీ ఎక్కడికక్కడ విరిగిపోతున్నట్లనిపించింది శిరోవేదన మొదలయినట్లు కణతలు కటకటలాడిపోయాయి. చెవులు దిబ్బడ వేశాయి కుర్చీలో అలాగే నిశ్చలంగా కూచుండిపోయాను వృద్ధుడేదో మాట్లాడుతున్నాడు కాని ఆయన ఏంచెబుతున్నాడో నాకు వినిపించడంలేదు

మళ్ళీ గదితలుపు తెరుచుకున్నది

ఆ చప్పుడుకు నేను తేరుకున్నాను మళ్లీ యీ ప్రపంచంలోకి వచ్చాను మతగురువు కూడా తన సంభాషణ చాలించాడు జైలు గవర్నరును వెంటబెట్టుకుని, నల్లటి దుస్తుల్లో ఉన్న ఒకవ్యక్తి లోనికి వచ్చాడు. అతన్ని చూడగానే శవాన్ని శ్మశానానికి మోసుకపోయే శకటం జ్ఞాపకం వచ్చింది. అట్లా ఉన్నది అతని ఆకారం అతని చేతితో చుట్ట చుట్టిన ఒకకాగితం ఉన్నది.

అతను నాకు 'శాల్యూట్' చేశాడు· "మాన్‌సియర్! పారిస్‌లోని ఉన్నతన్యాయస్థానానికి చెందిన ఉద్యోగిని నేను 'అటర్నీ జనరల్' తరఫున మీకు నేనొక వర్తమానం తీసుకొచ్చానయ్యా!" అన్నాడు, తెచ్చిపెట్టుకొన్న చిరునవ్వుతో

నేను తేరుకున్నాను మనస్సు చిక్కబట్టుకున్నాను. నన్ను నేను నిభాయించుకుని "అవుతే అటర్నీ జనరల్‌గారికి ఇంత త్వరగా నా ప్రాణాలతో అవసరం వచ్చిందా? ఆయనగారు నాకు స్వయంగా యీవార్త పంపడం నిజంగా నా అదృష్టం! అవును, నా చావు ఆయనగారికి సంతోషదాయకం!" అని సమాధానం చెప్పాను ఇలాచెప్పి, తిరిగి గట్టిగా "తరువాత చదవండి మాన్‌సియర్!" అన్నాను

అతను కోర్టువారి ఉత్తర్వును చదవడం మొదలుపెట్టాడు ప్రతివాక్యం స్పష్టంగా నొక్కినొక్కి చదివాడు గొంతు అదోలా పెట్టి ఒకపాట చదివినట్లుగా రాగంతీస్తూ, మధ్యమధ్య ఆపుతూ చదివాడు నేను పైవారికి చేసుకున్న 'అప్పీల్' నిరాకరించబడింది అదీ అందులో సారాంశం

"శిక్ష ఇవాళ 'డీగ్రేవ్'లో అమలు జరుపబడుతుంది" అంటూ అతను చదవడం పూర్తిచేశాడు తరువాత దృష్టికూడా మరల్చకుండా, ఆ పత్రంవంకే చూస్తూ "మనం సరిగ్గా ఏడున్నర గంటలకు బయలుదేరి 'లాకాన్ సర్జెరీ'కి వెళ్లాలి ఏమంటారు మాన్‌సియర్? మీరు నాతో వస్తారుకదూ?" అన్నాడు

తరువాత కొద్దినిమిషాలపాటు నా కేదీ వినిపించలేదు గవర్నరు, మతగురువు [illegible]

మాట్లాడుకున్నారు. గవర్నరు ఆ ఉత్తర్వు వంకే చూస్తున్నాడు. నేను వారవాకిలిగా తెరిచిఉన్న ద్వారంవంక చూచాను ... భయంకరం! వాకిట్లో నలుగురు సోల్జెర్లు నిలబడి ఉన్నారు

కోర్టునుంచి వచ్చిన ఉద్యోగి నావంక చూస్తూ తిరిగి ప్రశ్నించాడు.

నేను "మీరు ఏ క్షణాన రమ్మంటే ఆ క్షణాన వస్తాను" అని సమాధానం చెప్పాను

అంతట అతను నాకు శాల్యూట్ చేసి "ఒక్క అరగంటలో మీకోసం వస్తాను" అన్నాడు పిమ్మట వారంతా వెళ్లిపోయారు జైలుగదిలో ఒక్కణ్నే మిగిలిపోయాను

"అయ్యో, భగవంతుడా! తప్పించుకునే మార్గం? మార్గం దొరక్కపోదు ఏదోవిధంగా ఇక్కడనుంచి తప్పించుకోవాలి, తప్పించుకొని తీరాలి, తక్షణమే తప్పదు! వాకిళ్ళలోనుంచో, కిటికీలలోనుంచో, లేక పైకప్పు ఊడతీసుకొనో, శరీరం చీల్చుకుని ప్రాణం బయట పడ్డట్లు - ఈ జైలుగోడలు బ్రద్దలు కొట్టుకొని నేను బయట పడాలి, అయ్యో, భగవంతుడా! దేవతల్లారా! రాక్షసుల్లారా! పంచభూతాల్లారా! నన్నెందుకు ఇలా శపిస్తున్నారు? ఈ గునపంతో ఈ గోడలు త్రవ్వాలన్నా కొన్నిమాసాలు పడుతుందే, గునపంకాదు నా వ్రేళ్ళకు గోళ్లుకూడా లేవే, మాసంకాదు, ఒక్క గంటకూడా వ్యవధి లేదే, ఏంచెయ్యను?

22

సరిగ్గా, ఏడున్నరగంటల కల్లా కోర్టు ఉద్యోగి నాగదిచెంతకు వచ్చాడు

"మాన్షియర్! మీకోసమే కనిపెట్టుకుని ఉన్నాను" అన్నాడు

అయ్యో, భగవంతుడా! అతనివెంట మరికొందరుకూడా ఉన్నారు!

నేను లేచి నిలుచున్నాను ఒక అడుగు ముందుకు వేశాను నా తల గిర్రున తిరిగిపోతోంది కాళ్ళు తేలిపోతున్నాయి. ఎక్కడలేని నిస్త్రాణ ఆవహించింది ఎలాగో పూనికచేసి, వారివెంట నడిచాను, వెడుతూ వెడుతూ ఒకమాటు గదిఅంతా కలయచూచాను. ఇహ నాకదే ఆఖరిచూపు! ఆ జైలు గదంటే నాకెంతో ఇష్టం అవును ఇన్నాళ్లూ అది నన్ను కడుపులో పెట్టుకుని కాపాడింది ఇహ ఈ క్షణంతో దానికీ నాకూ ఋణం తీరిపోతున్నది! నేను వాకిట్లోకి వచ్చి చూచేసరికి గదంతా చిన్నపోయినట్లు కనుపించింది నేను వెళ్ళిపోతున్నందుకు అది కంటతడి పెడుతున్నట్లుగాఉంది! ఇహ ఈగది ఇలాగే ఖాళీగాపడి ఏడుస్తుందనుకున్నాను కాని కాదట! తరువాత కాపలావాళ్లు చెప్పారు అసైజు కోర్టులో శిక్షపడిన మరొక అభాగ్యుడు, ఇంకొక నిముషంలో ఆ గదిలోకి వస్తాడు!

నేను చెఱసాల వదిలి వెడుతుండగా గవర్నరు ప్రేమపూర్వకంగా నాతో కరస్పర్శ కావించాడు నలుగురు వృద్ధసైనికులతోపాటు, ఆయనా, నావెంట నడిచాడు జైలు ఆస్పత్రి ముందు చావసిద్ధమైయున్న ఒక వృద్ధుడు నావంకచూచి "నమస్కారం, సెలవు!" అన్నాడు,

మేము ఆవరణంలోకి వచ్చాం చల్లని గాలి వచ్చి నావంటికి తాకింది నా ప్రాణానికి ఎంతోహాయి అనిపించింది కాని అట్లా స్వేచ్ఛాగా, గాలి పీల్చుకుంటూ ఎంతో దూరం నడవలేదు అంతలోనే అక్కడ జోడుగుర్రాల బగ్గీ ఒకటి సిద్ధంగా ఉండడం నాకు కనుపించింది నన్ను మొదట్లో ఈ చెఱసాలకు తీసుకొచ్చిన గుర్రపు బగ్గీయే అది! నల్లగా, చాలా అసహ్యంగా ఉంది

శకటం అధిరోహించబోతూ ఒకమాటు చుట్టూ కలయచూచాను ఆవరణంలో చెట్లు గుంపులు గుంపులుగా ఉన్నాయి ఆ చెట్లదగ్గర ఒకవైపు అనేకమంది ఖైదీలు, మరొకవైపు చాలామంది ఇతర ప్రేక్షక

జనం గుమికూడి ఉన్నారు. అందరూ నా వంక చూస్తున్నారు అప్పుడే చూడవచ్చిన జనసమూహం తయారయిందే!

అంతలోనే చల్లనిగాలి వీచింది ఆకసం మేఘావృతమైంది వానజల్లు ప్రారంభమైంది చూస్తూచూస్తూండగా కుంభపోతగా వర్షంకురిసింది. రోడ్లన్నీ జలమయమైనాయి. ఆవరణమంతా నీళ్ళతో నిండిపోయింది. ఎక్కడచూచినా బురద - ఆ బురదలో అలగా జనం, గుంపులు గుంపులు-

అశ్వశకటం రెండు భాగాలుగా ఉన్నది కోర్టు ఉద్యోగి, రక్షక భటుడు ముందు భాగంలో కూచున్నారు రెండవ భాగంలో మతగురువు, మరొక రక్షకభటుడు, నేను కూచున్నాం. అశ్వారోహకులైన మరో నలుగురు రక్షక భటులు శకటంచుట్టూ ఉన్నారు కనుక లెక్కవేస్తే మొత్తం ఎనిమిదిమంది - ఒక మనిషికోసం ఎనిమిదిమంది మనుష్యులు కాపలా!

నేను శకటం అధిరోహిస్తున్నప్పుడు ఒక వృద్ధఖైదీ ఇలాఅన్నాడు "ఈ చెఱసాలకంటె నాకు ఆ శిక్ష విధిస్తేనే బాగుండేది!"

శకటం కదిలిపోతున్నది ఆర్చీలు తీర్చిన పెద్ద గేటుగుండా, చప్పుడు చేసుకుంటూ వెడుతున్నది. గేటుదాటి మైదానంలో ప్రవేశించగానే బిసెత్రీ జైలుద్వారాలు మూసుకున్నాయి ఏదో మైకంలో ఉన్నట్లున్నది నాకు మాట పలుకులేక తోటకూర కాడవలె వ్రేలాడబడిపోతున్నాను ఒకశవాన్ని పూడ్చిపెట్టడానికి శ్మశానానికి మోసుకెడుతున్నట్లు, నన్నాశకటంలో పడేసి తీసుకెడుతున్నారు! గుర్రాల మెడలకు కట్టిన చిరుమువ్వల ధ్వని, మధ్యమధ్య ఎక్కిళ్ళమాదిరి మందంగా నా చెవిన పడుతున్నది

నేను మెల్లగా కళ్ళు తెరిచాను కునికిపాట్లుపడుతూ కూచున్నాను శకటం హఠాత్తుగా మైదానంలోనుంచి మలుపు తిరిగి రోడ్డుమీదికి వచ్చింది. రంధ్రాలలోనుంచి బయటి దృశ్యాలన్నీ నాకు కనిపిస్తూ అంతలోనే ఒకదానివెంట ఒకటి కనుమరుగైపోతున్నాయి దూరంగా మంచుతెరల మధ్య 'నాటర్ డామ్' గోపురాలు అగుపిస్తున్నాయి క్రమక్రమంగా బెసెత్రీ జైలుకు సంబంధించిన ఆలోచనలన్నీ నా మనోఫలకం నుంచి మాయమైపోయాయి. 'నాటర్ డామ్' తాలూకు స్మృతులు కనులముందు పొడగట్టాయి 'నాటర్ డామ్' గోపురంపై రెపరెపలాడుతున్న పతాకం, అక్కడున్న జనసమూహం నాకంట పడుతుంది, అని నాలో నేను అనుకొని ఒక వెర్రినవ్వు నవ్వుకున్నాను

అంతలో మతగురువు నాతో సంభాషణ మొదలుపెట్టాడు అయనగారు చెప్పేదంతా నేను ఓర్పుతో వినసాగాను బండిచక్రాల గరగర ధ్వని, గుఱ్ఱపుడెక్కల సవ్వడి, ఛెళ్లు ఛెళ్లుమంటున్న కొరడా చప్పుడు అన్నీ నా చెవిన పడుతూనే ఉన్నాయి

మతగురువు అదేపనిగా మాట్లాడుతున్నాడు. గలగలమని ప్రవహించే సెలయేరులాగా ఆయన సంభాషణ సాగిపోతున్నది ఏదో చల్లని, మెల్లని రాగాలాపన వింటున్నట్లు నా మనస్సు శాంతి పొందుతున్నది. అంతలో అకస్మాత్తుగా, నాకు ఎదురుమళ్ళగా కూచున్న కోర్టుఉద్యోగి మాటల్లోకి దిగాడు

"ఏం గురువుగారూ? ఏమిటి వార్తలు?" అన్నాడు ఉద్యోగి అతని కంఠం కంచు మ్రోగినట్లు మోగింది అతను మతగురువు వంక తిరిగి ఏదో చెప్పబోయాడు కాని అప్పటివరకూ నాతో మాట్లాడుతున్న మతగురువుకు, ఆ బండి చప్పుడులో ఉద్యోగి పిలిచింది వినిపించలేదు. అంచాత ఆయన జవాబు చెప్పలేదు.

"అబ్బబ్బ! ఏంబండీ అండి ఇది! ఎత్తెత్తి వేస్తున్నది ఎముకలు గుల్లవుతున్నాయిరా భగవంతుడా!" అన్నాడు మళ్ళీ కోర్టు ఉద్యోగి. ఈమాటు అతను బిగ్గరగా అరుస్తూ

మాట్లాడాడు ఇప్పుడు మతగురువుకు వినిపించింది

"అవును బాబూ! వళ్ళంతా హూనం అవుతోంది" అని బదులు చెప్పాడు మతగురువు

"అసలు ఈ చక్రాల చప్పుడుకు ఎంత మొత్తుకున్నా వినిపించి చస్తేనా'- అన్నాడు ఉద్యోగి "అన్నట్లు నేనేం చెపుతున్నాను ?- ఆఁ, అదీ! పారిస్‌లో ఈనాటి ప్రధానమైన వార్త ఏమిటో మీకు తెలుసునా ?" అని అడిగాడు

నేను కంపించిపోయాను అది నాకు సంబంధించిన విషయమే అనుకున్నాను

"లేదుబాబూ నాకు తెలీదు, ఇవాళ ఉదయం, పత్రిక చదవాలన్నా నాకు తీరిక చిక్కలేదు ఇట్లా పని ఒత్తిడిలో ఉన్నానాడల్లా వచ్చిన పత్రికలన్నీ జాగర్తగా అట్టిపెట్టమని మానౌకరుకు చెపుతుంటాను తరువాత రాత్రికి ఇంటికి వెళ్ళినప్పుడు అవన్నీ తిరిగ్గా చదువుకుంటాను"

"అయ్యో, గురువుగారూ! ఇంతమటుకూ మీకీవార్త చెవిన పడలేదంటే నేను నమ్మను పారిస్ నగరవార్త! ఇవాళ ఉదయమే వచ్చిన తాజావార్త!"

అంతలో నేను అందుకున్నాను

"ఆవార్త ఏమిటో నాకు తెలుసులెండి"

వెంటనే కోర్టు ఉద్యోగి నావంక ఇలాకపోయి చూచాడు

"నిజంగా! నీవు విన్నావుటయ్యా? వింటే అదేమిటో నాకుచెప్పు?" అని అడిగాడు.

"మీకెందుకు చెప్పడం?" అన్నాను నేను

"నా కెందుకంటావా మాన్‌షియర్ ? ఎవరి రాజకీయాభిప్రాయాలు వారివి మీకూ కొన్ని అభిప్రాయా లుంటాయి లేదనుకోడం పొరపాటు నామటుకు నేను, జాతీయ దళాలను మళ్ళీ స్థాపించాలనే వారిలో ఒకణ్ని నేను కొంతకాలం జాతీయ దళంలో నాజెంటుగా పనిచేశాను అప్పుడెంత హాయిగా గడిపా ననుకున్నారూ ?"—

అని అతను ఇలా చెపుతుండగా అతని మాటకు నేను అడ్డువచ్చాను

"పారిస్‌లోని ముఖ్యమైన వార్త ఇది కాదనుకుంటాను!" అన్నాను.

"మరింకేమి టంటావు ? నీకు తెలుసు నన్నావుకా ?"

"అవును ఈనాడు పారిస్ వాసులకు ఆసక్తి కలిగించే వేరే వార్తను గురించి చెపుతున్నాను నేను"

నేను ఇంతగా చెపుతున్నా నాభావం ఆ మూర్ఖుడికి అవగతం కాలేదు అతనికి తెలుసుకోవాలన్న కుతూహలం హెచ్చింది

"వేరేవార్తా ? ఏ త్రాష్టుడు చెప్పాడయ్యా నీకది? నీకు పుణ్యం ఉంటుంది, అదేమిటో నాకు చెప్పవయ్యా అరి భగవంతుడా! వార్తలు పుట్టించడంలో నేనే మొనగాడ ననుకున్నాను నాతల తన్నావే నీవు! ఏమిటయ్యా ఆ విషయం? వార్తలు సేకరించడమంటే నాకు చచ్చేఇష్టం చచ్చి నీ కడుపున పుడతాను చెప్పవయ్యా అదేమిటో?"

ఇలాఅని అతను మతగురువువంక, తరువాత నావంక చూచాడు కాని నేను సమాధానం చెప్పలేదు, ముఖం అష్టవంకర్లు త్రిప్పి ఊరుకున్నాను

అతను మళ్ళీ "చెప్పవయ్యా, త్వరగా చెప్పు?" అన్నాడు

"ఈ సాయంత్రానికి నేనీ ధరణిమీద ఉండను!" అన్నాను నేను

"ఓశ్! ఇదేనటయ్యా? చంపావే నన్ను భలేవాడినయ్యా నీవు కుర్రాడివైనా చిచింద్రీపిట్టవే! కాని నిన్నుచూస్తే ఎప్పుడూ దిగులుగా ఉంటావు అదేనాకు నచ్చదు." అన్నాడతను,

"నేను కుర్రాణ్ణి కాదయ్యా బాబూ వృద్ధుణ్ని మీకంటె పెద్దవాణ్ని, క్షణక్షణా

నికీ నాలో ముదిమి ముసురుకుంటున్నది" అన్నాను నేను

అతను నివ్వెరపోయి నావంక కొద్ది నిమిషాలపాటు తదేకంగా చూచాడు తరువాత బిగ్గరగా నవ్వాడు

"ఏమిటీ! నన్ను నవ్విస్తున్నావే నాకంటె పెద్దవాడవుటయ్యా నీవు మీ తాతకంటె పెద్దవాణ్ణి నేను!" అన్నాడు

"నవ్వడమంటే నాకు గిట్టదు" అన్నాను కోపంగా,

అతను తన పొగాకుసంచి తీశాడు "ఇదిగో, కోపం తెచ్చుకోకు చుట్ట కాల్చవయ్యా" అంటూ ఒక పొగాకుకాడ నాకు అందించాడు అంతలో బండీ ఒక పెద్ద కుదుపు ఇచ్చింది అతని చేతిలోనుంచి పొగాకుసంచీ రతుక ఫటుడి కాళ్ళక్రింద పడింది

"దీని పాడుగాను! ఛా, ఛా! ఇదెక్కడి బండీ, చంపేస్తున్నదే" అంటూ నావంక తిరిగి "నా పొగాకంతా క్రింద పడిపోయింది చూశావా ఎంతనష్టమో!" అన్నాడు

"అంతకంటె ఎక్కువే నష్టపోతున్నాను నేను" అన్నాను నేను చిరునవ్వు నవ్వుతూ అతను ఏదో గొణుక్కుంటూ క్రిందపడిన పొగాకు కాడలు తిరిగీ ఏరుకోసాగాడు -

"నాకంటె ఎక్కువ నష్టమటయ్యా నీకు? చెప్పడానికేం మాటలు, ఈ పొగాకు ఎంత ఖరీదో తెలుసా? పారిస్‌లోకల్లా మేలురకం పొగాకు ఇది!" అన్నాడు

అప్పుడు మతగురువు మరల తన సంభాషణ కొనసాగించాడు మతగురువు, కోర్టు ఉద్యోగులమధ్య సంభాషణ కొనసాగింది వారిని అట్లా మాట్లాడుకోనిచ్చి నేను తిరిగీ నా ఆలోచనలలో మునిగిపోయాను

నగర పొలిమేరల్లోకి చేరుకునేసరికి నేను పూర్తిగా ఆలోచనా నిమగ్నుడనై ఉన్నాను కాని పారిస్ నగరంలోని అలజడి మామూలు కన్న మరింత ఎక్కువగా ఉన్నట్లు నాకు అనిపించింది

ఆ శకటం 'ఆక్ట్రోయ్'వద్ద ఒక నిముషం సేపు ఆగింది మున్సిపాలిటీ ఇన్‌స్పెక్టర్లు బండీని తనిఖీ చేశారు కాని బండీలో ఉన్నది కసాయి దుకాణానికి తీసుకపోతున్న ఏగొర్రెపిల్లో ఆవుదూడో అవుతే, పదో - అయిదో పన్ను వేసి వసూలు చేసేవారు మరి ఇది ఒక మానవుడి తల దీనికి పన్ను ఎంతని విధిస్తారు- మాబండీ సరాసరి వెళ్ళిపోయింది

మేం తోపుదాటాం సెయింట్‌మార్స్యూ వీధిలోగుండా అనేక మలుపులు తిరిగి నగరంలోని ఇరుకు సందులలోనుంచి వెడుతున్నది బండీ ఈ సందులలో క్రిందఅంతా గులకరాళ్లు బండీ మరింత కుదుపుఇస్తూ, గరగర ధ్వనులుచేస్తూ పోతున్నది నేను వీధులవంక చూచాను వచ్చేపోయే జనం ఆగి బండీవైపు తదేకంగా వీక్షించసాగారు కొందరు పిల్లలు బండీ వెనకాల పరుగెత్తుకుంటూ రావడం మొదలుపెట్టారు అక్కడక్కడ పేవ్‌మెంట్ల మీద చినిగిన దుస్తులతో బిచ్చగాళ్ళు అగుపిస్తున్నారు

మేము 'కాన్‌సెర్జరీ' ఆవరణంలో ప్రవేశించేసరికి భవన గోపురంమీది గడియారం ఎనిమిదిన్నర గంటలు కొట్టింది ఎత్తుగా ఉన్న మెట్లవరుస, భూతంవలె భీతి గొలుపుతున్న 'కాన్‌సెర్జరీ' భవన ఆవరణం చూచేసరికి నాకు వణుకు పుట్టింది.

అశ్వశకటం ఆగింది నా గుండెకూడా ఆగింది. కూచున్నవాణ్ని కూచున్నట్లే కుంచించుక పోయాను త్రుటికాలంలో - మెరుపు మెరిసినట్లు తలుపు తెరుచుకున్నది బండీలోనుంచి ఎగిరి దూకాను అటూ - ఇటూ బారుతీరిఉన్న సోల్జర్లమధ్యనుంచి తల వంచుకుని నడవసాగాను అప్పటికే అక్కడ జనం గుంపులు గుంపులుగా పోగయి ఉన్నారు!

అల్లసాని వాని అల్లిక జిగిబిగి

కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౮

ఆ న ం ద మీ మా ం స

వరూథిని ప్రవరునితో

మ॥ ఎందేడెందము గందళించు రహిచే నేకా
గ్రతన్ నిర్వృతిం
జెందుం గుంభగత ప్రదీప కళికా శ్రీదోప
నెందెందుబో
కెందే నింద్రియముల్ సుఖంబుగను నా
యింపే పరబ్రహ్మమా
నందో బ్రహ్మయటన్న ప్రాఁజదువు నంత
ర్బుద్ధి నూహింపుమా.

అన్న మాటకు ప్రవరుడు

"మోక్షలక్ష్మీ పథ్యాగమ సూత్రపంక్తికి
యివెపో
మీ సంప్రదాయార్థముల్"

అని సమాధానము చెప్పినాడు అంతకంటె నిచ్చట వేరే ప్రసక్తి చెయ్యబడలేదు. 'ఆనందో బ్రహ్మ, బ్రహ్మేతివ్యజానాత్' అన్న తైత్తిరీయములోని మాటను వరూథిని యుదాహరించినది ఆ యానందమున కొక వ్యాఖ్యానము చేసినది. ఆ వ్యాఖ్యానము సంప్రదాయార్థము కాదని ప్రవరుడు త్రోసివేసినాడు. ఆ వ్యాఖ్యావ మెట్టిది? అది సంప్రదాయార్థ మేలకాదు? తొలుత తైత్తిరీయములోని యీమాట యే సందర్భమునందు కలదు? యీ ఆనంద మీమాంస ఆనందవల్లిలో కలదు యువకుడు, సాధు యువకుడు, ఆధ్యాయికుడు, ఆశిష్ఠుడు, ద్రఢిష్ఠుడు, బలిష్ఠుడు, అతనికి సర్వమైన పృథివి విత్తముతో నిండియున్నది. వాడుశ్రోత్రియుదు,అకామహతుడు. అతనికి యేకమైన మానుషమైన యానందము. ఈ యీలక్షణములు కలవాడు ఒక ఆనందమును పొందుచుండును ఈయానందము ఒక కార్యమును పురస్కరించుకొని ఒక వేళను పురస్కరించుకొని, ఒక నిమిత్తమును పురస్కరించుకొని, పొందునదిగా కనిపించుటలేదు ఆయా లక్షణములు గలిగినవాడు ఆ యానందము కలిగినవాడుగా చెప్పబడుచున్నాడు ఇది విచారించగా-నిట్లు తోచుచున్నది. ఒకని కొక లక్షరూపాయలు వచ్చినవేళ కలదు ఆ వేళయందు వాడొక సౌఖ్యమును పొందుచున్నాడు దానికీ యీ యానందమునకు సంబంధము లేనట్లున్నది. ఆ యానందము పూర్వము చెప్పినట్లు 'నిమిత్తజన్యము' కాదు మరియెట్టిదనగా - ఒకడొక గొప్పయింట పుట్టెను. ఆ గర్భశ్రీమంతుడు, విద్యావంతుడు, ఆరోగ్యవంతుడు, అదృష్టవంతుడు వాడొక యానంద మనుభవించుచుండును అది వాని మనస్సునకు నిత్యలక్షణము ఇట్టి నిత్యలక్షణమును గూర్చి యీ యానందము చెప్పబడినట్లు కనిపించుచున్నది అంతియేకాని, ఒక హేతువుచేత కలిగిన యొక తాత్కాలికమైన తృప్తి యీ యానందమునకు లక్షణముగా కనిపించదు. కావున రతిజనిత సౌఖ్యము ఆ యానందముగా వరూథిని చేసిన వ్యాఖ్యానము వేదసమ్మితముగా లేదు అందుచేత ప్రవరుడు దీనిని త్రోసివేసెనా?

యోగులు సమాధిగతులై ఆత్మ నాత్మయందు అపహతేంద్రియులై చూచుకొందురని, అదియొక స్థితియని, తత్కాలమునందు ఆనందము పొందుచుందురని చెప్పినచో - ఆస్థితి ఆనందమని ఎక్కడను లేదు. అదియును పొసగదు

లోకమునందు మాత్రము ఆనందమున కిట్టి వ్యాఖ్యానము చేయుటకలదు లోకమునందున్న పలుభావములు సుష్ఠు విచారితములు కావు అట్లుకాని వాక్యమునే వరూథని స్వీకరించి చెప్పినది

పెద్దన్న విశిష్టాద్వైతి ప్రవరుని విశిష్టాద్వైతిగానే యాయన యూహించియుండును కాని యతని అగ్నిహోత్రములు, అతని కర్మిష్ఠిత-మొదలైనవి విశిష్టాద్వైతముకంటె స్మార్తమునందు బ్రవరుని నిష్ఠాత్మునిగా జూపుచున్నవి ఈ ప్రవరుని యాగ్నిహోత్రత్వము విశిష్టాద్వైతము వైపునకు మొగ్గుటలేదు ప్రవరుని కథ యంతయు విశిష్టాద్వైత ప్రతిపాదకముగాలేదు ఈ సంగతి పెద్దన్నగారికి కూడ దెలియును కనుకనే తాను విశిష్టాద్వైతియై తన్మతప్రతిపాదకము కాని కావ్యము తాను వ్రాసితినని తుదకు కొంత విశిష్టాద్వైతమును ప్రవేశపెట్టినాడు లేనిచో నాయన మనస్సుకే తృప్తిలేదు

తన మతమునకు ఈ 'యానందో బ్రహ్మ' యన్నమాట సరిపోదు అందుచేత దానిని "యిదియా మీ సంప్రదాయార్థము"లని త్రోసిపుచ్చినాడు సరే వరూథిని చెప్పిన యర్థము సంప్రదాయార్థము కాదు తన సంప్రదాయార్థమేమి? దానిని చెప్పలేదే? చెప్పినచో నది యెట్లుండును? విశిష్టాద్వైతమునందు ఆనందము పరమేశ్వర స్వరూపము. ఈ యానందము రెండుమూడు విధములుగా చెప్పవచ్చును. వైకుంఠములో ఒక మేడ వున్నది. దాని పేరు ఆనందము

శుద్ధసత్త్వ మున్నది త్రిగుణములచేత నేర్పడు ద్రవ్యము కానిదియు, సత్త్వము కలదియు దానికి విభూతి యనిపేరు అది యూర్ధ్వలోకములం దనంతమైనది అధోలోకములందు పరిచ్ఛిన్నమైనది అది యానందము నావహింప చేయును. దానికి ఆనందమని పేరు దానికే పంచోపనిషదాత్మికయని, పంచశక్తిమయి యని యును పేరు ఈ యానందము నారాయణ స్వరూపము నారాయణుడు కాదు. ఇట్టి భావము ప్రవరున కున్నదా? ఉన్నదో లేదో! అతడీ వ్యాఖ్యానము చేయవలసిన యవసరము లేదు. చేయలేదు అందుచేనిచట ప్రవరుడద్వైతియో విశిష్టాద్వైతియో, మనము నిర్ణయించలేము అతని కర్మిష్ఠితను పురస్కరించుకొని మనము వానిని స్మార్తుడుగా, కర్మిష్ఠిగా భావించవచ్చును

కాని యీ కావ్యము పేరు "స్వారోచిషమను సంభవము" కావ్యముయొక్క పరమార్థము-స్వారోచిషమనువు పుట్టుట, అతడు పుట్టినాడు అతడకాముడై చిరతపము చేసినాడు అతనికి లక్ష్మీశ్వరుండు కనిపించినాడు ఆ లక్ష్మీశ్వరుని ఆయన యిట్లు స్తుతించినాడు

అవ్యయానంత విశ్వాత్మక విశ్వేశ,
బ్రహ్మవునీవ కపర్దివీవ
యింద్రుండవీవ,వహ్నివి యనిలుఁడ వీవ,
వరుణుండ వీవ, భాస్కరుఁడ వీవ

యముఁడవీవ, వసూత్కరము నీవ రుద్రులు
నీవ, యాదిత్యులు నీవ, విశ్వు
లీవ,మరుత్తులు నీవ,మంత్రములునోంకృతి
వషట్కృతి శ్రుతిస్మృతులు నీవ
వేద్యమీవ, యావచ్చిన విబుధ గణము
సర్వమును నీవ, యెట్లన్న సర్వగతుఁడ
వగుట మఱి నీవుగాని వాడనగ నెవ్వఁ
డరయఁగను శేషభూత సమస్తశేషి.

ఈ పద్యార్థము స్థూలముగా చూచి నచో నద్వైతముగానే చెప్పవచ్చును కాని పెద్దన్నగారు తన విశిష్టాద్వైతము నీ పద్యములో స్థాపించినాడు జగత్తునకు కారణ మెవ్వరు? ఈచర్చ వచ్చినప్పుడు విశిష్టాద్వైత మతములో నారాయణుడు తప్ప మరియొకడు కాడని సిద్ధాంతము. బ్రహ్మకారణ మన్నచో వేదములయందు, యింద్రాగ్నులు, సూర్యుడు, సోముడు, కుబేరుడు, యముడు, వరుణుడు, మొద లైన యెల్లరు శ్రుతులయందు తత్తత్ప్ర దేశముల హేతువులుగా చెప్పబడిరి. శ్వేతాశ్వతరమునందు శివుడు కారణ ముగా చెప్పబడినది. అథర్వమునందు రుద్రుడు చెప్పబడినాడు తైత్తిరీయము నందు హిరణ్యగర్భుడు జగత్కారణు డుగా చెప్పబడినాడు. వీని యన్నింటికి సామాన్య విశేష న్యాయమువలన వారు వారు కారు-నారాయణుడే హేతువని సిద్ధాంతము విశిష్టాద్వైతులకు నారాయ ణోపనిషత్తు పరమప్రమాణము. మరియు నిట్టి గ్రంథములు కొన్నికలవు. వానినిబట్టి నారాయణునకే పరమ కారణత్వము. సర్వశబ్ద వాచ్యత్వము, మోక్షప్రదత్వము అందుచేత స్వయంభువు అన్నను హిరణ్య గర్భుడన్నను, ప్రజాపతి యన్నను,-నారా యణుడనియే అర్థము. ఒకటియేమి? దహరాది సర్వవిద్యలయందు చెప్పబడిన రుద్రాదులు నారాయణవాచ్యులే. నారా యణుని లోననున్న గుణజాతములే ఉపా స్యములు. భేదాభేద శ్రుతులన్నియు ఘటక శ్రుతులచేత విరోధము పరిహరించు కొని నారాయణునియందే సర్వము సమ న్వితమగుచున్నది. అన్నియు నారాయ ణుడే

ఈ పద్యమందుచేత విశిష్టాద్వైత ప్రతి పాదకమైనది. అందుకనియే "శేషభూత సమస్తశేషి" అన్న సంబోధన చివరకు విశిష్టాద్వైత మతమును ప్రతిపాదించు చున్నది.

ఈ స్వారోచిషుడు దశావతారములను వర్ణించినాడు. విశిష్టాద్వైతుల యొక్క దశావతారములలో బుద్ధుడులేడు. బల రాముడు, కృష్ణుడు నిద్దఱు రెండవతార ములు. అందుచేత పదియును పూర్తి యగును. ఈ పెద్దన్నగారి దశావతార వర్ణనలలోని రహస్య మిది.

మరియును దశావతారములను వర్ణిం చినంత మాత్రమున నారాయణ ప్రతిపా దకమగునా? అనగా అగును విశిష్టాద్వై తమున ఈశ్వరుడు-అయిదు విధములుగా నుండును.

ఒకటి పరుడు రెండు వ్యూహగతుడు మూడు విభువు నాలుగు అంతర్యామి అయిదు అర్చారూపుడు ఇందులో మూడ వవాడైన విభుడు అవతారములు పొందును. ఈ యవతారము లనంత ములు ప్రాధాన్య వివక్షచేత దశావతార ములకు యెన్నిక. ఈ యవతారములకు యిచ్ఛయే హేతువు. కర్మకాదు.

దుష్కృతి వినాశ పూర్వకమైన సాధుపరి త్రాణమే వీనికి ప్రయోజనము.

అందుకని అవతారములు వర్ణించుట నిస్సంశయముగా, విశిష్టాద్వైత మతప్రతి పాదకము పెద్దన్నగారు తన మతమును మనుచరిత్రమునందు చివరకు వెలయించి నాడు

తక్కిన కవులు ఆయన చేసిన శిల్పము లలోని రహస్యములు తెలియక అనేకము లను అనువదించుకొన్నారు మక్కికి మక్కిగా దింపికొన్నారు ఆయన తెలు గులో స్వతంత్ర ప్రబంధ రచనకు పితా మహుడు. ఆయనదృష్టి మరి యెవ్వరికిని లేదు ఆయన మహాశిల్పి. ఆంధ్రప్రబంధ సరస్వతి ఆయనగా నవతరించినది.

ఈ వ్యాసములందు చెప్పిన విషయము లన్నియు శిల్పదృష్టితో చెక్కబడినవి ఈ శిల్పము పద్యరచనాతిశాయి శిల్పము. పద్యరచనాగత శిల్పము వేరేయున్నది ఆ శిల్పమునకుకూడ మహా వ్యాఖ్యాన మవసరమైనదే. ఏలయనగా, ఆ శిల్పము కూడా ఆయనయందే పరాకాష్ఠ పొంది నది దానినిగూర్చి చెప్పుటయుకూడ సుల భముకాదు. దానియొక్క స్వరూపము ఎక్కువ భాగము-అక్షర సన్నివేశ రమణీ యతమీద నాధారపడి యుండును పూర్వమహాకవుల రచనల పరించి, పూర్వ సంస్కార విశేషముచేత పాఠకుడు యీ కూర్పునందు సౌకుమార్యము కలదు,యీ కూర్పునందు బిగువు కలదు, యీకూర్పు నందు మాధుర్యము కలదు,- యీ సౌకు మార్యముకంటె నిది యధికమైనది ఈ బిగువుకంటె నిది యధికమైనది- ఈరీతిగా వానికి వాడు నిర్ణయించుకోదగిన విష యము. ఒకానొక విధమైన పద్యరచన, ఒకానొక విధమైన సమాస గ్రథనము- ఒకడు ప్రౌఢముగా నున్నదనుకొనవ చ్చును. మరియు నొకడు కాదనుకొన వచ్చును. ఎట్లయినను నొక సామాన్య బుద్ధి సర్వరచనయందు దనుస్యూతముగా సర్వపాఠకులకు నుండును. విశేషముల యందే భేదము భాసించును.

కాని యీ వ్యాసములందు వ్రాయ బడిన భావవిషయికమైన శిల్పమునందు బుద్ధిమంతులకు విప్రతిపత్తి యుండదు. అందుచేత నిదియే బహుధా పరామృష్ట మైనది.

★

విజ్ఞానవాదము

బెర్ట్రండ్ రసెల్

అనువాదం : జి. ఎస్ ఎన్

౪

విజ్ఞానవాదమను పదము ననేకతత్త్వవేత్త లనేకములైన యర్థములలో వాడిరి. ఉనికిగల్గిన దెల్లను లేక ఉన్నట్లు విదిత మగునదియెల్లను ఏదోయొక యర్థములో మన స్సంబంధియై యుండవలెనను నంశమే యీ విజ్ఞాన వాదముయొక్క ముఖ్యోద్దేశ్యము ఈ సిద్ధాన్తము తత్త్వవేత్తలలో విశేష ప్రచారమున నున్నది అంతియకాక యనేకములగు నుపపత్తులచే సమర్థింపబడు చున్నది తత్త్వశాస్త్రము నతిసంగ్రహముగ ననుశీలనము చేసినవానికి గూడ విజ్ఞానవాదమును గూర్చి కొలదియో గొప్పయో తెలిసియుండవలెను తత్త్వశాస్త్రమున దానికి గల ప్రాముఖ్య మట్టిది

తత్త్వశాస్త్ర సంబంధియగు విచారణమునకు బొత్తుగా నలవాటు పడనివారు అట్టి సిద్ధాన్తమును తొలుదొల్తనే యసంబద్ధమని త్రోసిపుచ్చుట కున్ముఖులగుదురు. లోకజ్ఞానము (Common sense) బల్లలను, కురిచీలను, సూర్యచంద్రులను, మనస్సులకును, మనోగతములైనవానికిని (Contents of the minds) ప్రధానముగ విభిన్నమైనవిగను, ఒకప్పుడు మనస్సు లుడిగిపోయినను ఉనికిలో నెట్టి విచ్ఛేదమును లేనివిగను పరిగణించు నన్న మాట నిజమే మనస్సు లుండుట కెంతయో పూర్వమే ద్రవ్యమనునది యొకటి గలదని మనమనుకొనుచున్నాము కాని యట్టి ద్రవ్యమును కేవలమొక మనోవ్యాపార ఫలమని (Product of some mental activity) తలంచుట కష్టము, కాని యథార్థమైనను, అయథార్థమైనను విజ్ఞానవాదము పూర్తిగా నసంబద్ధమనిఁ త్రోసి రాజనుటకు వీలులేదు

భౌతిక వస్తువులకు స్వతంత్రమైన యస్తిత్వమొకటి యున్నప్పటికిని, వానికిని యింద్రియార్థములకును వ్యత్యాసము గలదనియును, కేటలాగునకును కేటలాగులోని పుస్తకములకును నెట్టి యానుగుణ్యము (Correspondence) గలదో అట్టి యానుగుణ్యమే భౌతిక వస్తువులకును నింద్రియార్థములకును గలదనియు మనము తెలిసికొంటిమి కావున లోకజ్ఞానము భౌతికవస్తువుల స్వభావమిదమిత్థమని యేమియు తెల్పుటలేదు అట్టి భౌతిక వస్తువులు నిజమగు మానసికమని భావించుటకు తగిన యుపపత్తి యున్నచో-మనకు విడ్డూరముగ తోచినంత మాత్రమున నట్టి యభిప్రాయమును త్రోసిపుచ్చుట న్యాయవముగాదు భౌతిక వస్తువులను గూర్చిన యాథార్థ్యము (Truth) నిజముగా విడ్డూరమైనదేయైయుండవలెను అట్టి సత్యమునెరుంగుట దుస్సాధ్యము కావచ్చును ఏతత్త్వవేత్తయైనను తనకు సత్యము తెలిసినదని విశ్వసించుచో-తాను సత్యమని చాటు విషయమును-కేవలము విడ్డూరముగ నున్నదను కారణమునఁ త్రోసిపుచ్చుటలో నౌచిత్యమేమియును లేదు

విజ్ఞాన వాదమును సమర్థించుటకు గల కారణములు తదీయ జ్ఞానసిద్ధాంతమును (Theory of knowledge) బట్టియు, మన మట్టి కారణములను తెలిసికొనగల్గుటకు నవసరములైన పరిస్థితుల (Conditions) చర్చను బట్టియు ఏర్పడుచున్నవి ఆట్టి కారణములపై విజ్ఞానవాదమును స్థాపించుటకు చేసిన ప్రథమ ప్రయత్నము బిషప్ బెర్క్లీది సమంజసములగు ననేకములైన యుపపత్తులచే నాతడు మన యింద్రియార్థములకు మనకు

కొనుట సహజము కాని యీ మనోగత మగుట యనగా నేమి? మనస్సులో నుండుట దీని విషయమున కొంత యస్పష్టతకు తావు లేకపోలేదు ఒకవ్యక్తిని మన మనస్సున నుంచుకొన్నా మనగా ఆ వ్యక్తిని శరీరతః మన మనస్సులో నుంచుకొన్నామని గాదు కాని యా వ్యక్తిని గూర్చిన యాలోచన మన మనస్సులో నున్నదని ఒకవ్యక్తి - తా నేర్పాటు జేయదలచుకొనిన పని యాతని మనస్సునుండి దూరమైచనె ననగా, నాపని యొకప్పు డాతని మనస్సులో నుండెనని యర్థముగాదు. మరి యా పనిని గూర్చిన యాలోచన మొకప్పు డాతని మనస్సులో నుండెనని తరువాత దానిని గూర్చిన యాలోచన మాతని మనస్సులో మెదులుట మానెనని చెట్టును మన మెరుంగగల్గినచో నది మన మనస్సులో నుండియుండవలెనని బెర్క్లీ చెప్పునపుడు చెట్టును గూర్చిన యాలోచన మతని మనస్సులో నుండెనని చెప్పుటకు మాత్రమే యతనికి హక్కుగలదు చెట్టే మన స్సులో నుండవలెనని వాదించుట, మనము స్మృతిపథమున నుంచుకొను మానిసి శరీరతః మన మనస్సులో నున్నాడని వాదించు టవంటిది దక్షుడని పేర్వడసిన యొక తత్త్వ శాస్త్రవేత్త యిట్టి తికమకకు లోనౌట విడ్డూరముగ గన్పింపవచ్చును కాని యనేక విచిత్రపరిస్థితు లట్టివారిని గూడ తికమక బెట్టుటకు కారణములైనవి అది యెట్లో తెలియ వలయు ననిన భావములను గురించి మరింత లోతుగా చర్చింపవలయును

భావములననేమో పరిశీలన సేయుటకు మున్ను, ఇంద్రియార్థములకును, భౌతికవస్తువులకును సంబంధించిన రెండు ప్రశ్నములను విడివిడిగా వేఱుచేసి వివేచనము సలుపవలయును వృక్షమును గూర్చిన మన ప్రత్యక్ష జ్ఞానవిశిష్టములగు నింద్రియార్థములు మనపైనెంత యాధారపడియున్నవో వృక్షముపైనంత యాధారపడి యున్నవను నర్థములో కొలదిగనో గొప్పగనో వైయక్తికములని భావించుట సమంజసమేయని తెలిసికొంటిమి. కాని వెనువెంటనే జ్ఞాతమగునది యెల్లను మనోగతమై యుండవలెనని నిరూపింప బూనుకొనుట వేఱొక విషయము ఇందులకు, మనపై నింద్రియార్థము లాధారపడి యుండు విషయమై చిలవలు పలవలుగ నెన్ని వాదములు లేవదీసినను నిష్ప్రయోజనమే జ్ఞాతమౌటచే విషయములు మనస్సంబంధులని నిరూపింప వీలగునని తొలుత నిరూపింపవల యును బెర్క్లీ యీ విషయమున తాను కృతకృత్యుడ నైతిననియే విశ్వసించును మన కత్యంతము ప్రధానమగు సమస్య యిదియే మరి యింద్రియార్థములు, భౌతిక వస్తువులను గూర్చిన సమస్యగాదు

బెర్క్లీ వ్యక్తముచేసిన యభిప్రాయము ప్రకారను భావమను పదమును విచారించి నచో నా సందర్భమున రెండు వేర్వేరు విషయములను విచారింపవలసిన యావశ్యకతం గలదు ఒకవంక మనకు జ్ఞాతమగు వస్తువును, వేఱొకవంక వస్తువునకు సంబంధించిన యథార్థ జ్ఞానమును ప్రధానముగ గమనింప దగినవి అందు వస్తుసంబంధియగు జ్ఞానము నిస్సందేహముగా మనస్సంబంధియే కాని గ్రహణమునకు విషయమగు వస్తువుగూడ మానసికమని యనుకొనుట కుపపత్తి యేమి యునులేదు రంగువిషయమై మనము వెనుక పరిశీలించిన యుపపత్తులు గ్రహణమునకు విషయమగు వస్తువులేవిధమున నైనను మనస్సంబంధియని నిరూపింపజాలకుండెను వస్తువు యొక్క యునికి మన యింద్రియములకును, వస్తువులకునుగల సంబంధముపై నాధారపడి యుండునని మాత్రమే నిరూపించునవి అనగా బల్లకు ననుగుణమైన దూరమున నొక ప్రదేశముపై మనదృష్టిని నిగుడించి నచో ఒకానొక రంగొక ప్రత్యేకమగు విధముగ గోచరించునని యవి నిరూపించినవి రంగు చూచువాని మనస్సులో గలదని యవి నిరూపింపలేదు రంగు నిశ్చితముగా మన మనస్సులోనే యుండవలెనని బెర్క్లీ అభి

నతిరిక్తమైన యస్తిత్వము గలదని యనుకొనుటకు వీలులేదనియు, చూచుటగాని వినుటగాని, స్పృశించుటగాని వాసన చూచుటగాని, రుచి చూచుటగాని లేకపోయినచో వస్తువుల యునికికి విచ్ఛేదము గలుగుననునర్థములో ఇంద్రియార్థములు మన మనోగతములై యుండవలెనని నిరూపించెను అంతవరకును నతని వాదము నిక్కముగ సమంజసమైనదే అయినను అతని యుపపత్తులలో కొన్ని యసమంజసమైనవిగూడ లేకపోలేదు ఇంద్రియార్థము లొక్కటే మనకు ప్రత్యక్షగ్రాహ్యాము లనియు, జ్ఞాతమగుట యనగా మనోగతమై యుండుట యనియు, మనోగతమైనదితప్ప మరియొకటి జ్ఞాతమగుటకు వీలులేదనియు, మనోగతము కానట్లు గోచరమగునదెల్లను మరియొక మనస్సునందైనను నుండియుండవలెననియు నాతడు ఖండితముగా జెప్పెను

అతని యభిప్రాయము నర్థము చేసికొనవలెనన్న భావము అని యాతడు వాడిన పదము నర్థము చేసికొనవలయును వెంటనే జ్ఞాతమగుటకు వీలైన ప్రతి విషయమునకు నాతడు భావమనియే పేర్వెట్టెను ఉదాహరణమునకు మన యింద్రియార్థములు భావమ్ములే కాబట్టి మనము చూచు రంగు భావమే అట్లే మనమువిను కంఠధ్వనిగూడా కాని యీ పదము కేవల మింద్రియార్థములకే పరిమితమై యుండలేదు, స్మృతికిని, ఊహకును గోచరమగు ననేక విషయము లుండవచ్చును మనము నేదినైనను జ్ఞాపకముంచుకొనునపుడుగాని, ఊహించునపుడు గాని మనకు నట్టివానితో సంసర్గ ముండును అట్టి వానినే యాతడు భావములని వ్యవహరించును

తరువాత నాతడు 'చెట్టు' మొదలగు సామాన్య వస్తువులను గూర్చి విచారణము సలుప నారంభించును మనమొక చెట్టును జూచునపుడు వెంటనే జ్ఞాతమగు సర్వము నాతడు భావమనియే వ్యవహరించును చెట్టు విషయమై-మనకు గోచరించినది తప్ప మరెద్దియైన నిజమని యనుకొనుట కెట్టి యుపపత్తియును లేదని యాతడు వాదించును అది మనకు గోచర మౌటలోనే దాని యునికి గలదు, అని యాతడు చెప్పెను మనము కన్నులను మూసికొనునపుడుగాని లేక మానవమాత్రు డెవ్వడును దానికి దగ్గరగా లేనప్పుడుగాని చెట్టుయొక్క యునికికి నెట్టి విచ్ఛేదమును ఉండదని యాతడు సంపూర్ణముగ నంగీకరించును కాని చెట్టు ఉనికిలో నెట్టి విచ్ఛేదమును లేక నిలిచియుండుటకు గల కారణము భగవంతుడా చెట్టును జూచుచుండుటయే మనము భౌతిక వస్తువని వ్యవహరించెడు దాని కనుగుణముగా నుండెడి యీచెట్టు భగవంతునిమనోగతమగుభావము ఆ భావమునకును మనము చెట్టును చూచునపుడు జ్ఞాతమగు భావమునకును సామ్యము గలదు కాని ఈ రెండింటికిని కొంత వ్యత్యాసము లేకపోలేదు భగవంతుని మనోగతము లగు భావములు చెట్టు ఉనికికి విచ్ఛేదము లేనంతవరకును చిరకాలము నిలుచును బెర్క్లీమతమున, మనకు గలుగు ప్రత్యక్షజ్ఞానములు భగవంతుని ప్రత్యక్ష జ్ఞానములో కొంతవరకును పాలుబంచుకొనును ఈ కారణముననే వేర్వేరువురు కొలదిగనో గొప్పగనో ఒకే చెట్టును చూతురు కావున మనస్సునకును, తద్గత భావములకును మరి వేనికిని అస్తిత్వములేదు, మరియిక నేదియైనను జ్ఞాతమగుటకు వీలులేదు ఏలన జ్ఞాతమగు నెద్దియైనను భావమై తీరవలెను

ఈ వాదమున ననేక హేత్వాభాసములు గలవు అవి తత్త్వశాస్త్ర చరిత్రమున విశేషముగ ప్రాధాన్యము వహించియున్నవి. తొలుత భావమను పదమును వ్యవహరించుటలోనే కొంత తికమక గలదు ఒక భావము ప్రధానముగ నొకని మనస్సులో నున్నదని మనమనుకొందుము. కావున చెట్టు అనగా కొన్ని భావములని మనమనుకొనునపుడు, చెట్టు మన మనోగత మైనదని యను

ప్రాయపడుటకు కారణము-గ్రహణ విషయమగు వస్తువును, వస్తుగ్రహణమును ఒక్కటే యని యనుకొను తికమకకు లోనగుటయే. వీనిలో దేనినైనను అతడు భావమనియే వ్యవహరించి యుండవచ్చును. వస్తువును గ్రహించుట యనగా తెలిసికొనుట నిక్కముగా మానసిక వ్యాపారమే కాని యీ విషయములను మనస్సులో నుంచుకొనునపుడు భావములు మనోగితములని నిశ్చయముగా మన మంగీకరింతుము కాని భావములనగా గ్రహణమునకు విషయములగు వస్తువులని మనమనుకొనునప్పు డట్టి భావములు మన మనస్సులో నున్నవని చెప్పుట భ్రాంతిమూలకము ఇట్టి భ్రాన్తికి లోనగుటచేతనే వస్తుజ్ఞానమును, జ్ఞాతవస్తువును ఒక్కటని (భ్రాన్తి పడుటచేతనే) మనకు జ్ఞాతమగునదెల్ల మనోగతమై తీరవలెనను నిగమనమును మన మంగీకరింపవలసి వచ్చినది బెర్క్లీ వాదమును విచక్షణాయుతముగ పరిశీలించినచో నందు తేటపడు హేత్వాభాసమును పాఠకులు గమనింపకపోరు

వస్తుగ్రహణమున గ్రహణ వ్యాపారమునకును గ్రహింపబడిన వస్తువునకును గల వ్యత్యాసమును గూర్చిన సమస్య చాల ప్రధానమైనది ఏలన విజ్ఞానార్జనశక్తి యంతయు దానితో ముడివడి యున్నది

మనస్సు తన కతిరక్తముగానున్న వస్తువులతో ప్రత్యక్ష పరిచయము (acquaintance) గడించుకొను శక్తి దానియొక్క లక్షణమై యున్నది మనస్సునకును తదతిరిక్తమగు పదార్థమునకును నడుమగల సంబంధమునుబట్టియే వస్తువులతో సంసర్గ మేర్పడుట యనునది యుండును వస్తువులను తెలిసికొనెడి మానసిక శక్తితో గూడుకొనున దిదియే జ్ఞాత వస్తువులు మనస్సులో నుండియుండవలెనని మనము చెప్పునపుడు, మనస్సునకు గల గ్రహణశక్తిని విపరీతముగా పరిమిత మొనర్చుచున్నామన్నమాట, లేక పునరుక్తి దోషమునకు పాల్పడుచున్నామన్నమాట మనస్సులో అనుదానికి మనస్సుచే గ్రాహ్యమగునది యని యర్థము చెప్పినచో, మనము కేవలము పునరుక్తియే చేయుచున్నామన్నమాట. ఈయర్థములో మనస్సులోనున్న దేదైనను మనస్సంబంధి కానక్కఱలేదని మన మంగీకరింపవలసివచ్చును కావున మనకు జ్ఞానముయొక్క స్వరూప మవగతమైనపుడు, బెర్క్లీ వాదము సర్వవిధముల దోషభూయిష్ఠమని యంగీకరింపక తప్పదు గ్రహణమునకు విషయములగు వస్తువులు మనస్సంబంధులని యనుకొనుటకు గల కారణములు సమంజసములు కావని వేఱే చెప్పనక్కఱలేదు కావున విజ్ఞానవాదమున కనుకూలించు నుపపత్తులను త్రోసిపుచ్చవచ్చును కావున మరి యితరములగు కారణము లేవైన గలవేమో క్రమముగా పరిశీలింపవలయును

మనకు తెలియని వస్తువున్నట్లు మన కెన్నడును తెలియుటకు వీలులేదనునది-నిరూపింపనక్కఱలేని సత్యముగ(Self-evident truth) నేడు చెలామణి యగుచున్నది ఏది యెట్లున్నను మన యనుభవమునకు సంబంధించినదెల్ల మనచే జ్ఞాత మగుటకు వీలైనదై యుండవలెననునది యనుమిత సిద్ధమై యున్నది దీనినిబట్టి ద్రవ్యమనునది జ్ఞాతమగుట కాస్కారము లేనిదైనచో నది యున్నట్లు మనకు తెలిసికొనుటకు వేఱొండు మార్గము లేదు కాబట్టి దానికెట్టి ప్రాముఖ్యమును లేకుండబోవలసివచ్చును కావున ప్రాముఖ్యము లేనిదెల్లను నయథార్థమైనది ద్రవ్యమనగా మనస్సులు, తద్గత భావములలో గూడుకొనిన యొక పదార్థము గానిచో, దానియునికియే యసంభవమై యుండెడిది అది యొక కెమేరా యయ్యేడిది

ఈ విషయమై సంపూర్ణముగా చర్చలు సలుపుట ప్రస్తుత పరిస్థితిలో కుదురునదిగాదు ఏలన అది చర్చాజటిలములగు ననేక యవాంతర సమస్యలను బయలుదేరదీయును కాని దీనిని త్రోసిపుచ్చుటకు కొన్ని హేతువులను పరిశీలింపనగును ఈ పరిశీలనమును చివఱ

నుండియు ప్రారంభింపవలె ననిన మన జీవితము ననుభవ సిద్ధముకాని దేదియు వాస్తవము కాదనుట కుపపత్తి యేమియును లేదు దీనిలో సిద్ధాంత విషయక మగు (Theoretical) ప్రాముఖ్యము గూడ నంత ర్భూతమైనచో వాస్తవ మనజెల్లు సర్వవిషయమును మనకు ముఖ్యమే ఏలన యీ జగత్తత్వము విషయమై జిజ్ఞాసను జూపు మనకీ జగమునగల సర్వమును నభిలాష గొలుపును కావున ద్రవ్యమనునది యున్నట్లు తెలిసికొనుటకు గూడ నలవి గాకున్నను - దాని యునికియే నిజమైనచో నది మనకు ముఖ్యము గాదనుట సరిగాదు అదియున్నట్లు మనకు కొంతయనుమానమునకు తగుల వచ్చును దానియునికి మన కాశ్చర్యము గూడ గల్గింపవచ్చును కావున నది మనజిజ్ఞాసతో ముడివడియున్నది మరి దాని ప్రాముఖ్యము మన జిజ్ఞాసను దీర్చుటలోగాని నిరోధించుటలోగాని వ్యక్తమగును అంతియకాక మనమెరుగని దేదియైనను ఉన్నట్లు తెలిసికొన లేమను నీక్రొత్త 'సుభాషితము' నంగీకరించుటకు వీలులేదు తెలిసికొనుటయను మాట రెండు వేర్వేరు అర్థములలో ప్రయోగింపబడినది మన మెరిగినది సత్యమే యను నర్థములో నది (error) భ్రమకు నతిరిక్తమైన జ్ఞానమున కన్వయించును అనగా నది మన విశ్వాసములకును జీవిత లక్ష్యములకును అన్వయించును వీనికే నిర్ణయములని పేరు ఈ యర్థమున నా పదమును ప్రయోగించునపుడిది యిదియని మనకు దెలియుచున్నది ఇట్టి జ్ఞానమును వస్తుతత్త్వ జ్ఞానమని చెప్పవచ్చును ఈ పదమునే రెండవ యర్థమున ప్రయోగించునపుడది ప్రత్యక్ష జ్ఞానమున (acquaintance) జెల్లు వస్తుజ్ఞానమున కన్వయించును మన మింద్రియార్థముల నెరుగు నదీ యర్థముననే

కావున వెనుకటి వాక్యమునే తిరిగి మార్చినపుడీ విధముగ నుండును మనకు జ్ఞానవిషయకమగు సంబంధములేని యెట్టి వస్తువైనను ఉన్నట్లు మనము వాస్తవముగా నిర్ణయింపజాలము ఇది యేవిధముగనూ యథార్థముగాదు మరి శుద్ధాబద్ధము. చైనా ప్రభువుతో నాకు పరిచయభాగ్య ముండక పోవచ్చును కాని ఆయన యునికిని గూర్చి నాకెట్టి సంశయమునులేదు ఆయనతో నితరుల పరిచయమును పురస్కరించుకొని నాకట్టి నిశ్చితాభిప్రాయ మేర్పడెనని యెవ్వరైన ననవచ్చును ఇది యప్రస్తుతమైన సమాధానము, ఏలన ఆ సిద్ధాంతము నిజమే యగుచో నాయనతో నితరులకు పరిచయ మబ్బుట నాకెట్లు తెలుసుకొన వీలుపడును? ఇతరున కెవ్వనికిని జ్ఞానవిషయక మగు సంసర్గములేని వస్తువు నాకేల జ్ఞాతము కారాదో నాకు తెలియదు ఈ విషయము ముఖ్యమైనది దీనికి వివరణమవసరము

ఉనికిగల వస్తువుతో నాకు జ్ఞాన విషయక మగు సంసర్గ మున్నచో నట్టి సంసర్గమే ఆ వస్తువున్నదను జ్ఞానమును మనకు గలుగజేయును కాని ఒకానొక వస్తువున్నదని నేను తెలిసికొనగల్గినపుడెల్ల నా వస్తువుతో సాత్యంతికమగు ప్రత్యక్ష పరిచయ ముండి తీరవలెనను నియమము సత్యసమ్మతముగాదు నాకు ప్రత్యక్ష పరిచయములేని వస్తువును గూర్చి నిశ్చితాభిప్రాయమున్న సందర్భమున ఆవస్తువున్నదని, యితరులు చెప్పుటచే దెలియుచున్నది ఒక సామాన్య సిద్ధాంతమును పురస్కరించుకొని ఒక ప్రత్యేక వర్ణనమునకు సరిపోవు వస్తువుయొక్క యునికి నాకు ప్రత్యక్ష పరిచయము గల్గిన వస్తువునుబట్టి యనుమిత మగును ఈ విషయమును పూర్తిగా నవగతము చేసికొనుటకు అనుభవ జన్యజ్ఞానమునకును, శాబ్దజ్ఞానము నకునుగల వ్యత్యాసమును విచారించి, మన యనుభవముల యునికిని గూర్చిన జ్ఞానమున కున్నంత నిశ్చితత్వము సామాన్య సిద్ధాన్తములకు సంబంధించిన యెట్టి జ్ఞానమునకు గలదో పర్యాలోచించుట సమంజసము ఈ విషయము తరువాతి యధ్యాయములో పరామర్శింపబడును

జీటా

(ZETA · Zero Energy Thermonuclear Assembly)

శ్రీ వసంతరావు వేంకటరావు

౨

కొన్నిలక్షల డిగ్రీల తాపక్రమాన్ని ఉత్పత్తి చేయడానికే జీటాని నిర్మించేరు అయితే, తాపక్రమాన్ని గురించి కొంత తెలిసికొంటే తప్ప జీటా నిర్మాణంలో అంతర్భూతమై యున్న కష్టాలను అర్థం చేసికొనే అవకాశం లేదు. 'తాపక్రమం' అంటే ఏమిటి ?

'వేడి' 'చల్ల' అను పదాలు సామాన్యంగా వాడుకలో నున్నాయి. కాని ఒకరికి 'వేడి' గా నున్న పదార్థం మరొకరికి 'చల్ల'గా తోచవచ్చును అప్పుడే మంచుముక్క పట్టుకొన్న చేతిని మామూలు నీటిలో ముంచగా ఆ నీరు 'వేడి'గా నుంటుంది వేడినీటిలో ముంచిన చేతిని మామూలు నీటిలో ముంచగా ఆనీరే 'చల్ల'గా నుంటుంది అందుచేత 'వేడి' 'చల్ల' అన్నవి సాపేక్ష పదాలు మాత్రమే వాటికి ప్రామాణ్యం కల్పించాలంటే వేరొక మార్గమవలంబించాలి

ఏ వస్తువునైనా వేడిచేసినప్పుడు అందులో కొన్నిమార్పులు కలుగుతాయి. దాని పరిమాణం మారవచ్చు. దాని తాపక్రమం పెరగవచ్చు. దాని అవస్థ మారవచ్చు అది రసాయనికపు మార్పును చెందవచ్చు వేడివల్ల కలిగే ఫలితాలలో 'తాపక్రమం' ఒకటి తాపక్రమాన్ని కొలవడానికి రకరకాల థెర్మామీటర్లున్నాయి అయితే గాజు థెర్మామీటర్లతో అన్ని తాపక్రమాలను కొలవలేము కొన్ని పదార్థాలు యేఏ తాపక్రమాలవద్ద కరుగుతాయో, కరిగి ఏర్పడిన ద్రవం ఏ తాపక్రమంవద్ద మరుగుతుందో క్రింది పట్టికనుండి తెలిసికొనవచ్చును.

పట్టిక

పదార్థము	కరిగేతాపక్రమం (డిగ్రీలు సెం॥)	మరిగే తాపక్రమం (డిగ్రీలు సెం॥)
నీరు	0	100
పాదరసం	-	357
వెండి	961	2152
బంగారం	1063	2360
ఇనుము	1500	3235
గ్రాఫైటు(కార్బన్)	3500	3927

తాపక్రమాన్ని ఊహించుకొనే ప్రత్యేక విధానముంది. పదార్థాన్ని వేడిచేసినప్పుడు దాని తాపక్రమం పెరుగుతుందని గమనించేము దానికి కారణం పదార్థమందలి అణువుల స్పందనము. ప్రతి పదార్థము అణువులమయము నీటి అణువులతో నీరు, ఉప్పు అణువులతో ఉప్పు, పంచదార అణువులతో పంచదార ఏర్పడుతున్నాయి అణువుల ఏర్పాటునుబట్టి పదార్థంయొక్క అవస్థ ఉంటుంది. ఘనపదార్థమందలి అణువులు క్రమబద్ధంగా దగ్గరదగ్గరగా నున్నాయి ఘనపదార్థాన్ని వేడిచేసినప్పుడు అందలి అణువుల క్రమంతగ్గి ఒకస్థితిలో అది ద్రవంగా మారుతుంది. ద్రవాన్ని వేడిచేసినప్పుడు అణువుల ఆక్రమం పెరిగి అది వాయువుగా మారుతుంది. ఘనపదార్థమందలి అణువులు వాటి స్థానాన్ని వీడక స్పందిస్తూంటాయి. ద్రవంలో అవి యథేచ్ఛగా సంచరించగలవు. కాని వాటి స్వాతంత్ర్యం ద్రవపదార్థ మాక్రమించిన మేరకే పరిమితమైయుంది వాయువు ఎంత స్థలాన్నైనా ఆక్రమించగలదు. వాయువులో అణువులకు ఎంతైనా స్వేచ్ఛ గలదు.

ఏవస్తువైనా కొంత వేగంతో గమించినప్పుడు దానికి గతిజశక్తి సిద్ధిస్తుంది పదార్థంలో స్పందిస్తూన్న అణువులకూ గతిజశక్తి ఉంది. అన్ని అణువులు ఒకేవేగంతో స్పందించవు కాబట్టి వాటి సరాసరి గతిజశక్తి పరంగా తాపక్రమాన్ని ఊహించుకొంటున్నాము. కొన్ని వందల డిగ్రీలవరకు గాజు థెర్మామీటర్లతో కొలవవచ్చును. అంతకెక్కువ తాపక్రమాలను కొలవడానికై వేడిపదార్థాలనుంచి వెలువడు ఉష్ణశక్తిని వినియోగిస్తారు. తీగెలలో విద్యుత్తు ప్రవహిస్తుంది ' అప్పుడు తీగెలు వేడెక్క

తాయి; వాటి "విద్యున్నిరోధం" (Electrical resistance) మారుతుంది. తీగెల తాపక్రమానికీ వాటి విద్యున్నిరోధపు మార్పుకూ గల సంబంధాన్ని గమనించి, నిరోధపరంగా తాపక్రమాన్ని కొలిచే మార్గాలున్నాయి.

వేడివస్తువులు ప్రసరించే శక్తినిబట్టి వాటి తాపక్రమాన్ని కొలిచినప్పుడు, శక్తిపరిమాణము 'శ' అని తాపక్రమం 'త' అని అనుకొంటే

శ × త^4

అనగా తాపక్రమపు నాలుగవ ఘాతానికి శక్తి అనుపాతంలో నున్నదని అర్థము.

పరమాణువు సూర్యమండలంవలె నున్నదని గమనించేము. పరమాణు మధ్యను ధనావేశంగల బరువైన కేంద్రక ముండగా దాని చుట్టు ఎలక్ట్రానులు తిరుగుచున్నాయి. అవి వేర్వేరు కక్ష్యలలో నున్నాయి. పదార్థానికి శక్తి నిచ్చినప్పుడు అందున్న పరమాణువులలో తిరుగుతున్న ఎలక్ట్రానులు వాటి కక్ష్యలనుంచి కేంద్రకానికిదూరంగానున్న కక్ష్యలలోనికి గెంతి, తిరిగి వాటి స్వస్థానాలను చేరుకొంటాయి. ఆ క్రియలో అవి శక్తిని ప్రసరిస్తాయి. మండుచున్న పదార్థంనుండి వెలువడు కాంతిని గాజుపట్టకం (Prism) ద్వారా పంపినప్పుడు ఒక వర్ణపటం (Spectrum) ఏర్పడుతుంది. సరియైన యేర్పాటుతో ఆ వర్ణపటంలో నిలువుగానున్న రంగు రంగుల గీతలను చూడవచ్చును. ప్రతిమూల తత్త్వం దానికి ప్రత్యేకమైన గీతలను కలిగిస్తుంది. అవి వాటికి సహజమైనవి. ఒక మూల పదార్థం కలిగించిన గీతలను మరొకటి కలిగించదు. మనుష్యులలో వ్రేలిముద్రలు ప్రత్యేకమైనవంటారు. ఒకరిని పోలిన వ్రేలిముద్ర మరొకటి ఉండదు అల్లే వర్ణపటంలో రేఖల స్థానాన్నిబట్టి వాటిని కలిగించిన మూల పదార్థాన్ని పోల్చుకోవచ్చును. అదొక ప్రత్యేక శాస్త్రభాగం.

కాంతిని ప్రసరిస్తున్న పరమాణువులు స్థావరంగా నున్నప్పుడు వాటికి సహజమైన వర్ణపట రేఖలు కలుగుతాయి. చిత్రంలో అట్టి ఒకరేఖ యొక్క స్థానం 'క' అనుకొంటాము. ఆ పరమాణువులే పట్టకంవైపు గమిస్తూంటే వర్ణపటమా రేఖయొక్క స్థానం జరుగుతుంది. స్థిరపరమాణువులు వెలువరించు శక్తి ఒక నిర్దిష్టమైన అలపొడవుగల తరంగ రూపంలో నుంటే, ఆ పరమాణువులే పట్టకంవైపు గమిస్తూన్నప్పుడు వాటినుండి వెలువడు శక్తికిరణాల అల పొడవు తగ్గి, వర్ణపటంలో ఏర్పడు రేఖ స్థాన చలనం పొంది, తక్కువ అల పొడవువైపు జరుగుతుంది. అంటే సామాన్యంగా ఆకుపచ్చగానున్న గీత, పరమాణువుల గమనంచే నీలంగా మారవచ్చు. అదే చిత్రంలో ఎడమకు జరిగినట్లుంటుంది. పరమాణువులు పట్టకానికి రంగా గమించిన పక్షంలో వాటినుంచి వెలువడు కాంతియొక్క అల పొడవు పెరిగి, వర్ణపటరేఖ ఎక్కువ అల పొడవువైపు జరుగుతుంది అంటే, ఆకుపచ్చ గీత, ఈసారి పసుపు పచ్చగా మారుతుంది. అదేచిత్రంలో కుడివైపునకు జరుగుతుంది కాని, మండుచున్న పదార్థంలోనున్న పరమాణువులు అన్నివైపులా గమించిన పక్షమందు, వర్ణపటరేఖ వెడల్పు ఎక్కువౌతుంది. 'క' కి యిరువైపుల జరుగుతుంది. ఈవిధంగా రేఖపొందిన వ్యాప్తిని బట్టి పదార్థం ఎంత వేగంతో గమిస్తూందో లెక్కకట్టగలరు దీనికొక ఉదాహరణ ముంది. ప్లాటుఫారంపై నిలుచుని స్టేషనులో ప్రవేశిస్తూన్న రైలుకూత విన్నప్పుడు, రైలు చేరువకు వస్తూన్నకొద్దీ దాని కూతయొక్క స్థాయి ఎక్కువౌచున్నట్లును, రైలు ప్లాటుఫారం దాటి పోతూన్నప్పుడు కూతస్థాయి తగ్గుచున్నట్లును కనిపెట్టవచ్చును. కూత స్థాయిలో కలిగెడి మార్పు వర్ణపటంలో రేఖ పొందెడి స్థానచ్యుతి వంటిది.

ఈ విషయం జీటాలో ఉపయోగపడుతుంది. జీటాలో ఉదజని పరమాణువులే ప్రధాన పాత్రను వహిస్తాయి. ఉదజని పరమాణువులో ఒకేఒక ఎలక్ట్రాను కేంద్రకం చుట్టు తిరుగుతూంది. కాని, జీటాలో ఉత్పన్నమయే తాపక్రమాలలో ఆఒక్క ఎలక్ట్రాను కేంద్రకంనుండి విడిపోతుంది. వర్ణపట రేఖ

లనుబట్టి తాపక్రమాన్ని గణించే పద్ధతి వీని యోగపడదు. ఏమంటే వర్ణపట రేఖలే ఉండవు।

అందుచేత, తాపక్రమాన్ని కొలవడానికై జీటాలో కొంత ఆక్సిజనును ప్రవేశపెట్టవలసి వచ్చింది. ఆక్సిజన్ (ప్రాణవాయువు) పరమాణువులో 8 ఎలక్ట్రానులు కక్ష్యలలో భ్రమిస్తున్నాయి ఆ అధిక తాపక్రమాలలో ఎనిమిదింటి ఐదు ఎలక్ట్రానులు కేంద్రకంనుండి విడిపోతాయి. మిగిలిన మూడు ఎలక్ట్రానులే వర్ణపట రేఖలను కలిగించాలి, వాటి నాధారంగా చేసికొని, అ రేఖలు ప్రదర్శించే చ్యుతినిబట్టి తాపక్రమాన్ని కొలిచే పద్ధతి నుపయోగిస్తారు.

కొన్నిలక్షల డిగ్రీల తాపక్రమాన్ని తాళగల పదార్థం మన ఎరుకనులేదు. కాని, అట్టి తాపక్రమంలోనున్న ఉదజనిని బంధించడానికి సామాన్య పదార్థాలతో నిర్మింపబడిన పాత్రలు పనికిరావు. అందుచేత ఉష్ణాన్ని ధిక్కరించే అదృశ్య పాత్రలో ఉదజనిని బంధించేరు. అదొక అయస్కాంత బలరేఖలతో ఏర్పడిన పాత్ర. మహావేగంతో పరుగెత్తుతున్న ఉదజని పరమాణువులతో పెనవేసుకొని, వాటిని ఎటువైపున చెదరనీయకుండా అదిమిపట్టి, నియత మార్గాన వాటిని పరిమితం చేయగల అయస్కాంత బలరేఖలను జీటాలో సృష్టించేరు. అదొక మహాద్భుత విషయం. ఏమంటే, అంత మహోగ్ర తాపక్రమాలలో పదార్థం మండిపోయి దాని పరిసర ప్రాంతాల నన్నింటిని మంటపెట్టగలదని అనుకొనేవారు. కాని, అయస్కాంత బలరేఖల ధర్మమా యని అట్టి అసామాన్య స్థితిలో పదార్థాన్ని బంధించగల అవకాశం కలిగింది.

గొట్టాలలోనున్న గాలిద్వారా విద్యుత్తు ప్రవహించదు కాని గొట్టాని కిరువైపుల రెండు లోహపు కాడల నమర్చి, గాలిని పంపుతో తోడివేసినప్పుడు ఎక్కువ విద్యుత్ పీడనాన్ని వినియోగిస్తే గాలి విద్యుద్వాహక మౌతుంది. గొట్టాని కమర్చిన లోహపు కాడలను "విద్యున్మార్గాలు"(Electrodes)అంటారు. ఒకదానిద్వారా విద్యుత్ ప్రవేశిస్తుంది. రెండవ దానిద్వారా బహిర్గమిస్తుంది. విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు విద్యున్మార్గాలు వేడెక్కుతాయి. జీటాలో విద్యున్మార్గాల నుపయోగిస్తే ఆ లక్షల డిగ్రీల తాపక్రమానికి ఏలోహం నిలబడగలదు? కాబట్టి జీటాలోనున్న ఉదజనిద్వారా విద్యుత్ ప్రవాహాన్ని పంపడానికై విద్యున్మార్గాల నుపయోగింపని విధానాన్ని అమలు పరిచేరు.

ఒక తీగెచుట్టపై మరొక తీగెనుచుట్టి, మొదటిదానిలోనుండి వచ్చిన్న విద్యుత్ ప్రవాహాన్ని పంపినప్పుడు ప్రేరేపణవల్ల రెండవ తీగెలో విద్యుత్ ప్రవహిస్తుంది. ఒకతీగె చుట్టవంతు ఉదజనిగల గొట్టాన్ని వినియోగించి బలమైన విద్యుత్ ప్రవాహాన్ని రెండవ తీగె చుట్టలో పంపినప్పుడు విద్యున్మార్గాల ప్రసక్తి లేకుండా ఉదజనిలో విద్యుత్ ప్రవహిస్తుంది.

ఈవిధంగా జీటా నిర్మాణంలో అనేక సూత్రాలు వినియోగింపబడ్డాయి.

విశ్వనాథమధ్యాక్కఱలు
శేషగిరి శతకము
శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౩

వాఁడెవఁడో తప్పుచేసె, నది వాని వర్ణమందఱను
గాడిన వెట్టి నరుకను నిజముగాఁగారణ మగున?
తోడు తల్లియుఁగాని నీకుఁ బెఱలైనఁద్రుంచి వేయుదురు
చీడ పట్టినచోటు- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

అండజపతివాహా! మధ్యమధ్య నీకా వేశమెత్తు
చుండున, యప్పుడు సుంత తరువాత నున్నవారికిని
పండిన పంట, యీ నడుమ మనియెడి వారి దుర్జనులు
చెండుచున్నారయ్యా! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

అప్పర! నీ భార్గవరాముఁడైనట్టి యవతార మొక్కఁ
డు విశిష్టతం దాల్చియుండె, నొక్కొక్కఁడు కుజనుఁడైన
రివరివకేమి? యొకొక్కవర్ణ మా రీతి పేటెత్తి
సివమెత్తుట భరంబు- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

జపహోమ మంత్రాది నియమ సమితినిన్ సాధింపనైన
విపులత లేని నీకొన్ని యవతార విభవముల్ కలవ,
యెపుడుఁ జెప్పక తప్పదాయె, నినుఁ జెప్పుచీ పీనిఁగూడఁ
జెపుమ యీ మర్మంబు- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

గొడ్డలిపూని తిరుగరు సమిధల కోస మెవ్వరును,
గొడ్డలియెందు కెవ్వరినో నరుకుట కోసమే కాదె?
దొడ్డబుద్ధి యనాదిది, కృతవీర్యుఁడు దొరికెఁ జెడ్డకును
జెడ్డయేమున్నది? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఎన్న నిన్ నీవ యెఱుఁగని యవతార మెత్తనెంచితివి
నిన్ను నీ వెఱిఁగినదానికన్నఁ బండితి రామచంద్ర
సన్నుతమూర్తిగా, నింక పదియెత్తు స్వామి! శ్రీరాము
చిన్నెలు తేలేవు - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

అచ్చమైనట్టి సాత్త్వికపు మర్యాదయైనట్టి వాఁడు,
అచ్చమౌగుండెకు మిక్కిలిగ దగ్గరైనట్టివాఁడు,
పచ్చని మైడాలువాఁడు, శ్రీరామ భద్రుఁడై నీవు
చెచ్చెరరావయ్య! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

సకల వేదములును నుపనిషత్తులు సకలాగమములు
నొకయెత్తు నాస్వామి, రామయను నామమొక యెత్తు; రత్న
శకలమ్ము రఘుపతి, చీఁకటి నెఱుక చాలమియను ని
శికిఁ జందమామ; శ్రీ వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

బుజమున విల్లున్న నందమును గొల్చి పోసెదుస్వామి,
నిజమున కప్పియఁ గలుగు తత్త్వంబు నిధి రఘుపతియ,
రజనిచర మనోజ్ఞ వదనుఁడు, వసంత రమ్యాకృతి, మన
సిజ రమ్యతరమూర్తి; వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఎన్ని మహాయుగంబుల తపస్సు వ్యయించితో రాముఁ
డన్నట్టి యవతారము పడయ, నఖండమైన కాలమ్ము
జన్ని యావై పిండినట్టి పాలజున్నైన శ్రీరాము
చెన్ను వహించితి; వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మనుజు లీ రీతిగా నడువవలయు నన్మాటలు చెప్పు
మనుజులు లక్షలు కోట్లు; నడచిన మనిసి నడ్పించు
మనిసి లే, డొక్క శ్రీ రాఘవుఁడు తక్క మహితమౌ సృష్టిఁ
జిన నాటినుండియు; వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మానవజాతి కంతకును నవ దీపమణియైన రాముఁ
డైనావు; రాముండు పరమ నాగరుఁడచ్చమౌ మనిసి;
వాని మేలిమిచూపి సరకు విడుదల పరతు వీ సృష్టి;
శ్రీనీరజాక్ష! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నూఱు తప్పులు సైచ వచ్చును, నూటిపై నొకటి
యోరువ రాదేమి? యోర్చుకొన్నచో నోర్వనువచ్చు,
నూఱేమి పదివేలు; నందులోన ననుఁగు మేనమఱది,
శ్రీరమాపతి! కృష్ణ! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

పళ్ళెమ్ము విసరిన గొంతు నరుకఁగాఁబడుట చిత్రమ్ము,
పళ్లెమ్ముఁ జేయించి తట్లు దీనికై ప్రత్యేకముగను,
త్రుళ్ళి భారతయుద్ధమునకు నాంది నెత్తురు చేసినావు
చిళ్ళతా మతితోడ, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మొదట నిద్దఱకయి రెండు నవతారములు, పైన నొకటి,
తుదకును శిశుపాలదంత వక్త్రులఁదునుమనే కాద,
యుదయించినది, దైత్యశక్తి పలుచనై యుడిగి నీవల్లె
చిదుముచున్నకొలంది - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఒక్కదానికి మైకొకిబికి సరిచేయుటొక గొప్పకాదు,
కక్కసించిన సుయోధనుని మనసు వంకర తీర్చలేదు,
అక్కటా నాయెద వేయిమంది దుర్యోధనుల్ కలరు!
చిక్కించుకోరాదె? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

వేరికిఁ జూపి ప్రయోజనము లేదో, విశ్వరూపంబు
వారికిఁ జూపితి కౌరవ సభలో భయపడినట్లు,
ఔర! పరమ నిష్ప్రయోజనమ్ముగ నాచరించుటను
జేరి క్రొత్తయె లేద? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

కాయ మొదలో, విత్తు మొదలో యను ప్రశ్నగానైన సృష్టి
కే యాది లేదు, నీకుఁ బలె, భేదమో యిది ఖండ ఖండ
మాయె, నఖండమౌ జ్యోతి వీవు, నీ కా సంతఁ జేసి
శ్రీయుతుఁడైనావు వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఎత్తక తప్పక చేసి జన్మ రాహిత్యంబు గీత
లొత్తి చెప్పితి, తొల్లి జన్మలే యెత్తకుండఁగఁ జేయ,
వొత్తి యేడ్పించి లాలించు లక్షణమో నాఁగ - నీదు
చిత్తమ్ము సాగించు వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఆయన కొంపయుగోడి నాగలి యాయన గోల
యాయన పడుచుండ, మోసికొంచు నేలంతయు నీవు
రాయిడి లేకుండ లోక మెన్నికల్ రాజ్యాలు బిట్టు
చేయుచునుంటివి, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ! -

మాస ఫలములు

మార్చి 15 — ఏప్రియల్ 15

శ్రీ 'బుధ'

మేషము.

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా,)

మార్చి నెలాఖరువరకు ప్రతికూలం ఆపైఅనుకూలం వృత్తి వ్యాపారాదులలో ఆనేక సమస్యలు పలువిధములగు, సంకల్పములు పైకొచ్చి పరిణామాన్ని కోరుతుంటాయి. నిర్ణయ శక్తిలోపిస్తుంది యత్నకార్యములన్నీ ఆలోచనలతోనే అంతమవుతాయి. ఏపనీకాదు. పరుల మాటలకు భ్రమపడి భంగపడుతారు. ఉద్యోగ వ్యాపార ధర్మములు సక్రమముగా నడుపవు. వ్యవహారిక పేచీలు. గృహస్థ జీవితము సుఖము నివ్వదు. భ్రాతృకష్టము, బంధు విరోధము, అనారోగ్యము, నేత్రవ్యాధి, సంతానప్రాప్తి. ఏప్రియల్ 9 వరకు ఆదాయమునకు మించిన ఖర్చు-ప్రయాణముల వలన ప్రయోజనము శూన్యం. విషయ వాంఛలు పెడదారుల పట్టిస్తాయి తొందరపడి ప్రేమించుకొనడం, స్నేహసంబంధాలు ఏర్పరచుకొనడం తగదు.

వృషభము

(కృత్తిక 2, 3, 4, రోహిణి, మృగశిర 1, 2, పా,)

ఈ నెలలో మీ కష్టాలు కొంతవరకు తీరుతాయి. జీవిత పురోగమనమునకు తగు అవకాశములు లభ్యమవుతాయి. వృత్తి ఉద్యమములు నిరాటంకముగా సాగిపోతూ మంచి ఆదాయమును చేకూర్చును - నూతన ప్రయత్నములు సమకూరును. ఉద్యోగాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి, ధనలాభము, వివాహాది శుభకార్యములు జరుగగలవు. లలితకళా పారిశ్రామికులకు, విద్యావ్యాసంగము కలవారికి మంచికాలము - లాభదాయకమగు ప్రయాణములు. ప్రేమజీవితమందువిజయం.

మిధునము

(మృగశిర3,4పా,ఆరుద్ర,పునర్వసు1,2,3పా,)

గ్రహస్థితి శుభాఽశుభ మిశ్రమ ఫలితాన్ని ఇచ్చును వృత్తి వ్యాపారములలో అస్థిరత్వము అనాలోచితంగాకార్యాచరణ విద్యావ్యాసంగులకు ఆటంకాలు. రాయబారులకు, స్వల్ప ఉద్యోగులకు, ఏజెన్సీ వ్యాపారులకు మంచికాలము ఉన్నత పురుషుల సాంగత్యము, శక్తిసామర్థ్యములకు తగిన ఉద్యోగములు. లాభము కలుగును. మార్చి 29 నుండి జన్మరాశికి కేంద్రములలో రవి, కుజ, శని, పాపగ్రహ సంచారమువలన మాతా, పితరులలో నొకరి మృతి. అధికారులతో వివాదము. వ్యవహార, వ్యాపారములలో నష్టము పుత్రుని ఆరోగ్యము చెడుట వృత్తి భంగము.

కర్కాటకము

(పునర్వసు 4 పా పుష్యమి, ఆశ్రేష)

గ్రహస్థితి మిగుల అనుకూలము కాలము, కర్మం, కలసివస్తాయి యత్నకార్యములు ఫలిస్తాయి వృత్తి వ్యాపారాభివృద్ధి. ఉద్యోగస్థులకు ప్రమోషన్ ఆర్థికలాభం, ఉత్సాహము సౌఖ్యము. రాజకీయవాదులు తమ రాచకార్యములను మిగుల దక్షతతో నిర్వహించు కొనగలుగుదురు. ప్రజాసహకారము, గౌరవము, సన్మానము ప్రత్యక్షంగానూపరోక్షంగానూ బహుమానములు, దానధర్మములు సమకూరుతాయి పండితులకు రాజాదరణ సాంఘిక, రాజకీయముల కొఱకే ఎక్కువకాలమువ్యయపరుచుచుందురు భూగృహ విషయాలలో మీ ప్రయత్నములు ఫలిస్తాయి. వివాహాదిశుభకార్యములు ఏప్రియల్ మొదటివారములో అనారోగ్యము రహస్య శతృత్వము, వ్యవహారిక ఇబ్బందులు

సింహము

(మఖ, పూఫ, ఉత్తర 1 పా)

ఎక్కువగా సాంఘిక వ్యవహారములు, బంధుమిత్రుల నడవడి మీ ప్రేమహృదయాన్ని భగ్నపరుచుతాయి భౌతిక ఫలాపేక్ష వట్టి భ్రమయని మీఅంతరాత్మ బోధించుతుంధి ఆధ్యాత్మిక వికాసం కలుగుతుంది వృత్తి, ఉద్యమముల ననుసరించి మీ ప్రయత్నములు ప్రథమంలో కొంత ఆశాభంగముసైననూ, తుదకు మరొక రూపంలో జయప్రద మవుతాయి. ఉద్యోగులకు మార్చి నెలాఖరువరకు పై అధికారులవలన భీతి, ఆపైన అనుకూలము

వ్యాపారస్తులకు ఎక్కువగా స్పెక్యులేషన్ మీద లాభం చేకూరుతుంది. పండితులు చక్కనిరచనలు చేస్తారు. గృహస్థ జీవితము సుఖము నివ్వదు సాంఘిక వైరములు, అనారోగ్యం, స్థానచలనం మొదలగు స్వల్పచికాకులు.

కన్య

(ఉఫ 1・2 3 పా, హస్త, చిత్త 1 2, పా)

మీ గ్రహస్థితి ఈనెలలో మిగుల భీభత్సం, భయానకం. జన్మరాశికి నాలుగు కేంద్రాలలో

పాపగ్రహాలు కావిడున్నాయి. పారిపోవుదమన్ననూ పోనీయవు, కర్మఫలం అనుభవించకుండా. పైగా అట్టి గ్రహాలకు పరస్పర సమసప్తకస్థితి. పోరాటాలు. ఇది మంచికో, చెడ్డకో రానున్న మహోత్కృష్టమైన సంఘటన. సామాన్య స్థితి కాదు. ఆవేశపూరితంగా కార్యాచరణ జరుగుతుంది. సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ సంక్షోభం. మీ జీవనస్థాయి పెరిగి ప్రఖ్యాతి బడయటమా? అధఃపతనమై అడుగంటి పోవడమా? సందిగ్ధావస్థ. మార్చి 29 నుండి జన్మరాశిని అన్ని గ్రహాలు చూస్తున్నాయి. ఇది శుభాన్ని, జయాన్ని తప్పక ఇస్తుంది. మార్చి 24 న జన్మచంద్రుడు రాహుగ్రస్తు డగును. గ్రహణమును ఈ రాశివారు చూడకూడదు. అపనిందలు, శత్రుత్వం.

తుల.

(చిత్త 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా)

గ్రహస్థితి అనుకూలం, చిక్కుసమస్యలన్నీ తీరుతాయి. ధైర్యోత్సాహాలు, ఆత్మబలం, దైవ బలం సమకూరుతుంది. దక్షతతో వ్యవహారిక విజయాన్ని సాధిస్తారు, శత్రుజయం. నూతన కార్యక్రమాలు జయప్రదం. వృత్తిఉద్యమాలలో ఆధిక్యత, గౌరవం, వ్యాపారలాభం. ఆర్థిక పరిస్థితి అనుకూలం. స్వల్పఅనారోగ్యం. ప్రయాణాలలో ప్రమాదం.

వృశ్చికము.

(విశాఖ 4 పా, అనూ, జ్యేష్ట)

వృత్తి ఉద్యమములలో మార్పులేదు. జీవన సుఖ మర్యాదలకు లోటురాదు. గృహస్థ, సాంఘిక, జీవితమందు అశాంతి, బంధు మిత్రాదులతో వైరం. ఓర్పు వహించాలి. నావికులకు, ఔషధవిక్రయపరులకు, డాక్టర్లకు నర్సులకు మంచికాలం. జీవనస్థాయి పెరుగుతుంది, ఏప్రియల్ మొదటివారంనుండి వ్యాపారలాభం, మార్చి 29 నుండి 8 వ అంగారకుడు. అనారోగ్యం. స్థానచలనం. ప్రయాణంలో నష్టం.

ధనుస్సు.

(మూల, పూషా, ఉషా 1 పా;)

సాంఘిక వ్యవహారిక, గృహస్థ జీవితములలో తలవని తలంపుగా అనేక క్లిష్టసమస్యలు తలఎత్తుతాయి. వృత్తి ఉద్యమములలో ఆటంకాలు. మనోవ్యాకులత. ఏమైనా గౌరవ ప్రతిష్ఠలు కాపాడుకొంటారు, లలితకళా ప్రవీణులకు, కవులకు మంచికాలం. వృత్తి, ఉద్యోగస్థల, మార్పులను గూర్చి ఆలోచనలు, పరిశ్రమకు తగిన ఆదాయంరాదు. ఏప్రియల్ నుండి కుటుంబసౌఖ్యం తక్కువ. కళత్ర అనారోగ్యం. సంకరజాతి స్నేహంవల్ల మాన ప్రాణములకు హాని.

మకరము.

(ఉషా 2,3,4 పా, శ్రవణము, ధనిష్ట 1.2,పా;)

గ్రహస్థితి అనుకూలం. ప్రయత్నాలు ఫలిస్తాయి. జీవనస్థాయి పెరుగుతుంది. ఎక్కువ పెట్టుబడితో వ్యాపారంనడుపుతారు. భూ, గృహ, శుభ కార్య, విషయాలుఫలిస్తాయి, స్థానిక సంస్థలలోపని చేయువారికి, కంట్రాక్టర్సుకు, ఇంజనీర్లకు, డాక్టర్లకుమంచికాలం. వేతనాభివృద్ధి, ఆర్థికలాభం, వ్యవహారజయం. సాంఘికగృహస్థ జీవితం సుఖప్రదం.

కుంభము

(ధని 3,4 పా, శతభిషము, పూ భా, 1,2.3పా)

గ్రహస్థితి మిగుల అనుకూలం. విద్యావిజ్ఞానాభివృద్ధి. పండితులచే ప్రశంసలు. నూతన బంధుమిత్రాదులతో సాంఘిక జీవితం సుఖప్రదంగా ఉంటుంది. వృత్తి, ఉద్యోగములలో ఆధిక్యత, గౌరవం. వ్యాపారస్థులు భారీగా వ్యాపారములు చేసి మంచిలాభం గడిస్తారు. కొందరు స్పెక్యులేషన్ వలన నష్టపడుతారు. పారమార్థికచింత. అనుకున్న కార్యాలు కొన్ని ఫలిస్తాయి.

మీనము.

(పూ భా 4 పా, ఉ భా, రేవతి)

మార్చి 29 నుండి రాశికి నాల్గు కేంద్రాలలో పాపగ్రహ సమ్మేళన, పరస్పర సమసప్తకం. అత్యంతప్రమాదకరమైన పరిస్థితి. జీవిత పురోగమనానికి అనేక అవరోధాలు. సాంఘిక, రాజకీయ శత్రుత్వం. వృత్తి ఉద్యమములు భంగపరచుటకు ఎప్పటికప్పుడు కొత్తసమస్యలు తల ఎత్తి గౌరవహాని కలిగిస్తాయి. ఆవేశంతో పనులు చేస్తారు. పట్టుదలవల్ల కొంత ధనవ్యయం. కాని షష్ఠాధిపతి జన్మలోఉండి గురుదృష్టి పొందాడు. కనుక చిక్కులన్నీతీరి జయం లభిస్తుంది. భార్యాబిడ్డలకు అనారోగ్యం,

Edited, Printed & Published by Sri J. Radhakrishna Reddy, Vijayawada-2
Printed at Nava Bharathi Press, Vijayawada-2.